**విలేకరులు కావలెను**

కర్నూలు నుండి వెలువడుతున్న 'విజయ సారథి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను.. తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలు మరియు అన్ని మండల కేంద్రాలలో స్థానిక సమస్యలపై పోరాడేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు వెంటనే సంప్రదించండి.. సెల్ నెం: 9700370499

సీనియర్ జర్నలిస్ట్. ఎడిటర్ : పి.వెంకటేశ్వర్లు



విజయ

# సారథి

RNI / APTEL/2015/64956

తెలుగు దినపత్రిక



**టీవీ రిపోర్టర్లు కావలెను**

రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టిస్తున్న విజన్ టీవీలో రిపోర్టర్లు & వీడియో గ్రాఫర్లు, కెమెరామెన్లు కావలెను. ఆసక్తి ఉన్న వారు వెంటనే సం॥ సెల్ నెం: 9700370499

A.P VISION TV

యండి. పి.వెంకటేశ్వర్లు



చీఫ్ఎడిటర్ : పేరపోగు వెంకటేశ్వర్లు | గురువారం 24-04-2025 | సంపుటి : 11 | సంచిక : 94 | పేజీలు : 8 | వెల : రూ 3-00

కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి,శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్.


# మళ్లీ సర్జికల్ స్ట్రైక్ తప్పదా..




న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: పహల్గాంపై ఉగ్ర మూకల దాడి నేపథ్యంలో భారత్ ప్రతీకార చర్యలు దిగుతుందనే సందేహం పొరుగు దేశమైన పాక్‌లో వ్యక్తమవుతోంది. అందులోభాగంగా పీవోకేలోని ఉగ్రవాద శిబిరాలను పాకిస్థాన్ ఖాళీ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. తాజా దాడితో ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నట్లు అయింది. ఈ దాడిలో 28 మంది మరణించడంతో.. భారతదేశం నుంచి తీవ్ర ప్రతిస్పందన వస్తుందనే భయాందోళనలు పాకిస్తాన్‌లో నెలకొన్నాయనే వాదన వినిపిస్తోంది. అందులోభాగంగా పాక్ ఆక్రమిత కాశ్మీర్ (ఖూఐ)లోని ఉగ్రవాద శిక్షణ శిబిరాలను వెంటనే ఖాళీ చేయాలని పాక్ ఆదేశించినట్లు పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి)చుట్టూ హై అలర్ట్ జారీ చేయడంతోపాటు పాకిస్తాన్ సైనిక, నిఘా సంస్థల సీనియర్ అధికారులు నిరంతర సమావేశాలు నిర్వహిస్తున్నారని సమాచారం.మరోవైపు పహల్గామ్ దాడి నేపథ్యంలో భారత్‌లో ఆగ్రహావేశాలను వ్యక్తమవుతోన్నాయి. ఈ సంఘటనపై టీమిండియా ప్రధాన కోచ్, బీజేపీ మాజీ ఎంపీ గౌతమ్ గంభీర్.. తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాల కోసం ప్రార్థిస్తున్నాను. బాధ్యులు దీనికి మూల్యం చెల్లించుకుంటారు. భారతదేశం దాడి చేస్తుందంటూ ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా వెల్లడించారు. గౌతమ్ గంభీర్ చేసిన ఈ ప్రకటన భారతదేశ వైఖరిని ప్రతిబింబిస్తుంది. ఇది పాకిస్తాన్‌లో సర్జికల్ స్ట్రైక్ భయాన్ని సృష్టించింది.జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా మాట్లాడుతూ.. పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన దాడి పిరికిపంద చర్యగా ఆయన అభివర్ణించారు. ఈ ఉగ్రవాద దాడిని తాను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. అత్యంత దారుణమైన ఈ దాడి వెనుక ఉన్న వారిని వదిలిపెట్టబోమని ప్రజలకు తాను హామీ ఇస్తున్నాని స్పష్టం చేశారు. డీజీపీతోపాటు భద్రతా అధికారులతో ఈ అంశంపై మాట్లాడానన్నారు. ఆర్మీ, జమ్మూ కాశ్మీర్ పోలీసు బృందాలు ఆ ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తున్నాయని వివరించారు.తన మరో ఎక్స్ ఖాతా ద్వారా లెఫ్టినెంట్ జనరల్ఎల్జీ సిన్హా మాట్లాడుతూ.. ఉగ్రవాదులను తటస్థీకరించడానికి ఉగ్రవాద నిరోధక ఆపరేషన్ ప్రారంభించామన్నారు. యావత్ దేశమంతా కోపంగా ఉందని చెప్పారు. తమ దళాలు రక్తం కారుస్తున్నాయని చెప్పారు. పహల్గామ్ దాడికి పాల్పడిన వారు.. భారీ మూల్యం చెల్లించుకుంటారని తాను దేశానికి హామీ ఇస్తున్నానని పేర్కొన్నారు.ఎల్‌ఓసీ సమీపంలో ఉన్న అన్ని ఉగ్రవాద శిక్షణా కేంద్రాలను ఖాళీ చేయాలని పాకిస్తాన్ ఆర్మీ సీనియర్ అధికారులు వెంటనే సూచనలు ఇచ్చారని సమాచారం. గత రాత్రి ఆలస్యంగా.. ఉగ్రవాదులను సమీపంలోని గ్రామాలకు తరలించమని ఆదేశాలు జారీ అయ్యాయని తెలుస్తోంది. భారత్ ప్రతీకారం తీర్చుకునే అవకాశం ఉన్నందున.. అంటే సర్జికల్ స్ట్రైక్ లేదా వైమానిక దాడి వంటి చర్యలు తీసుకుంటారనే భయంతో పాక్ ఈ చర్యలకు పునుకొంది. ఉగ్రవాద దాడులపై ప్రతిస్పందిం చడంలో భారతదేశం ఆలస్యం చేయదని గత చరిత్ర చూస్తే ఇట్టే అర్థమవుతోందనే అభిప్రాయం పాక్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.గతంలో కూడా ఇలాంటి సంఘటనలు జరిగిన తర్వాత పాకిస్తాన్‌కు భారతదేశం తగిన విధంగా సమాధానమిచ్చింది. ఉదాహరణకు 2016లో ఉరి దాడి.. 2019లో పుల్వామా దాడి తర్వాత, భారతదేశం పీఓకేలోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని సర్జికల్‌తోపాటు వైమానిక దాడులు నిర్వహించింది. ఈ చర్యలు ఉగ్రవాద సంస్థలకు భారీ నష్టాన్ని కలిగించడమే కాకుండా, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ తన కఠిన వైఖరి తీసుకుం టుందనే సందేశాన్ని పాకిస్తాన్‌కు స్పష్టంగా పంపాయి.ప్రస్తుత పరిస్థితిలో, పహల్గామ్ దాడి తర్వాత భారతదేశం భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేసింది.

## ఉగ్రదాడి మృతులకు సీఎం చంద్రబాబు సంతాపం



అమరావతి: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో నిన్న జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన ఏపీ తెలుగు సంఘం సభ్యులు జేఎస్ చంద్రమౌళి, మధుసూదన్‌లకి సీఎం చంద్రబాబు సంతాపం తెలిపారు. ఈ తీవ్ర దుఃఖ సమయంలో తమ ఆలోచనలు, ప్రార్థనలు వారి కుటుంబాలకు అండగా ఉన్నాయని, ఈ అపారమైన నష్టాన్ని తట్టుకునే శక్తిని వారు పొందాలని తాను ప్రార్థిస్తున్నానని సీఎం చంద్రబాబు అన్నారు. ఉగ్రవాద చర్యలు సమాజానికి మచ్చ అని సీఎం చంద్రబాబు చెప్పారు.ఉగ్రవాదం, హింస వారు ప్రోత్సహించాలని లక్ష్యంగా పెట్టుకోవడం వల్ల ఏదీ సాధించలేరని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంఘీభావంగా నిలుస్తోందని తెలిపారు. ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వం మన దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు తీవ్రవాదంపై ధృఢమైన, నిర్ణయాత్మక చర్యతో ప్రతిస్పందించడానికి తమ నిబద్ధతతో ఉన్నారని చెప్పారు. ఈ హేయమైన చర్యకు బాధ్యులైన వారిపై కఠినంగా వ్యవహరించాలని సీఎం చంద్రబాబు అన్నారు.అమరావతి నుంచి హెలికాప్టర్‌లో ఇవాళ ఒంగోలుకు సీఎం చంద్రబాబు వెళ్లనున్నారు. టీడీపీ నేత వీరయ్య చౌదరి భౌతికకాయానికి సీఎం చంద్రబాబు నివాళులు అర్పించన ఎన్నారు.

## ఏపీ టెన్త్ పరీక్షల ఫలితాలు విడుదల



విద్యార్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు బుధవారం ఉదయం 10 గంటలకు విడుదల అయ్యాయి. ఐటీ, విద్యశాఖల మంత్రి నారా లోకేష్ ఫలితాలను సోషల్ మీడియా ఎక్స్ వేదికగా విడుదల చేశారు. ఈ ఏడాది 6,14,459 మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. 4,98,585 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని మంత్రి వెల్లడించారు. 81.14 శాతం ఉత్తీర్ణత సాధించారని, పార్వతీపురం మన్యం జిల్లా 93.90 శాతం ఉత్తీర్ణత రేటుతో అగ్రస్థానంలో ఉండటం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో 1,680 పాఠశాలలు 100 శాతం ఫలితాలను సాధించాయన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ తన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ పరీక్షల్లో ఫెయిల్ అయినవారు నిరుత్సాహపడవద్దని సూచించారు. జీవితం రెండవ అవకాశాన్ని అందిస్తుందని అన్నారు.

## జనసేన మూడు రోజుల సంతాప దినాలు.. జెండాల అవనతం

అమరావతి: జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఘోర ఉగ్రవాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాప సూచకంగా ఆంధ్రప్రదేశ్‌లో మూడు రోజుల పాటు సంతాప దినాలను జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఇందులో భాగంగా పార్టీ జెండాను 3 రోజులు హాఫ్-మాస్ట్ (సగం కిందకు దించడం) చేసి ఉంచాలని పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ మూడు రోజులు రాష్ట్రవ్యాప్తంగా కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టాలని జనసేన ఒక ప్రకటనలో తెలిపింది.”పౌర సమాజంలో ఉగ్రవాదానికి చోటు లేదు. అందరూ కలిసికట్టుగా మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజే యాలి” అని పవన్ కల్యాణ్ ఆ ప్రకటనలో తెలిపారు.



పహల్గాంలో ఉగ్రవాదుల దాడి అమానవీయమని, ఎంతమాత్రం సహించరాదని అన్నారు. శాంతికి జనసేన కట్టుబడి ఉందని, ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన ప్రజలు, బాధిత కుటుంబాలకు “మానవహారం”గా ఏర్పడి సంఘీభావం తెలపాలని ఆ ప్రకటనలో పవన్ కల్యాణ్ కోరారు.తీవ్రంగా కలిచివేసిందిపహల్గాం ఉగ్రదాడి తమను తీవ్రంగా కలిచివేసిందని, మృతుల కుటుంబాలకు ప్రగాడ సానుభూతి తెలియజేస్తు?న్నానని పవన్ కల్యాణ్ సామాజిక మాధ్యమం ‘ఎక్స్’లో


## ఉగ్రదాడి..

### ఢిల్లీ, ముంబయి నగరాల్లో హై అలర్ట్

న్యూఢిల్లీ: జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రదాడి నేపథ్యంలో దేశంలోని పలు ప్రధాన నగరాల్లో భద్రత కట్టుదిట్టం చేశారు. పహల్గామ్ సమీపంలోని మారుమూల బైసరన్ లోయలో ఉగ్రవాదులు పర్యాటకులపై కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో ఇప్పటివరకు 26 మంది పర్యాటకులు చనిపోయారు. మరికొంతమంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో దేశంలోని పలు ప్రధాన నగరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు.దేశ రాజధాని ఢిల్లీ, ముంబై, జైపూర్, అమృత్‌సర్‌లతో పాటు మేజర్ సిటీల్లో హై అలర్ట్ ప్రకటించారు. ఢిల్లీలో కీలకమైన పర్యాటక ప్రదేశాలు, రవాణా కేంద్రాల వద్ద నిఘాను పోలీసులు పెంచారు.




## వక్ఫ్ బిల్లు చట్టభద్ధతపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ




ఇటీవల మోదీ సర్కారు ఆమోదించిన వక్ఫ్ బిల్లు చట్టభద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల పై సుప్రీం కోర్టు ఇవాళ(బుధవారం) విచారణ ప్రారంభించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ విచారణ చేపట్టింది. వక్ఫ్ బిల్లు చట్టభద్ధతను సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో 10 పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లు దాఖలు చేసిన వారిలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ, కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావేద్, టీఎంసి ఎంపీ మహువా మొయిత్ర, ఎస్పీ ఎంపీ జియా ఉర్ రెహమాన్, ఆర్జేడి ఎంపీ మనోజ్ కుమార్ ఝ, ఆప్ ఎమ్మెల్యే అమనాతుల్లా ఖాన్, మణిపూర్ ఎమ్మెల్యే షేక్ నూరుల్ హాసన్, వైసీపీ, డిఎంకె, టీవికే అధినేత విజయ్, సిపిఐ సహా కొన్ని ముస్లిం సంఘాలు ఉన్నాయి. ఇక, పిటీషనర్ల తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ వాదనలు వినిపించారు.మరోవైపు వక్ఫ్ బోర్డు సవరణ చట్టంను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణకు ముందు తమ వాదనలు కూడా వినాలని పలు రాష్ట్రాలు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. పిటిషన్లు దాఖలు చేసిన రాష్ట్రాల్లో అస్సాం, రాజస్థాన్, ఛత్తీస్‌ఘఢ్, ఉత్తరాఖండ్, హర్యానా, మహారాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయి. వీరంతా ఈ చట్టాన్ని సమర్థిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఇక, కపిల్ సిబాల్ వాదనల ప్రకారం పార్లమెంటు చట్టం ద్వారా మత విశ్వాసంలో కీలకమైన అంతర్భాగ అంశాలలో తలదూర్చారని కపిల్ సిబాల్ అత్యున్నత న్యాయంస్థానం ముందుకు తీసుకెళ్లారు. ఆర్టికల్ 25, 26లకు వ్యతిరేకంగా వక్ఫ్ సవరణ చట్టం ఉందని కపిల్ సిబాల్ అన్నారు. “చట్టం ప్రకారం” అనే పదాలు ముస్లిం మతానికి సంబంధించిన ముఖ్యమైన ఆచారాన్ని ప్రభావితం చేస్తాయని కపిల్ సిబాల్ కోర్టుకు విన్నవించారు. “చట్టం ప్రకారం” అనే పదబంధం ఇస్లాం మతానికి సంబంధించి మౌలికమైన ఆచారాలను దూరం చేస్తుందని ఆయన కోర్టుకు తెలిపారు. వక్ఫ్-అలల్-ఔలాద్‌ను సృష్టించినప్పుడు మహిళల వారసత్వ హక్కులను నిరాకరించరాదు.. దీనిపై ప్రభుత్వం ఎలా నిర్ణయం తీసుకోగలదు? అంటూ కపిల్ సిబాల్ న్యాయస్థానం ద?ష్టికి తీసుకెళ్లారు.అయితే, హిందువులకు సంబంధించిన వారసత్వ విషయాల్లో కూడా ప్రభుత్వం చట్టం చేసిందని.. ముస్లిం సమాజం కోసం కూడా పార్లమెంట్ చట్టం చేసింది.. ఇందులో తప్పేముందని సిజెఐ సంజీవ్ ఖన్నా ప్రశ్నించారు. ఆర్టికల్ 26 అనేది సెక్యులర్. ఇది అన్ని మతాలకు వర్తిస్తుందని సిజెఐ సంజీవ్ ఖన్నా వ్యాఖ్యానించారు.ఇస్లాంలో వారసత్వం వ్యక్తి మృతి తర్వాత జరుగుతుందని.. కానీ ప్రభుత్వం మృతికి ముందే వారసత్వం వస్తుందని చెబుతుందని కపిల్ సిబాల్ వాదించారు. ప్రభుత్వ ఆస్తిగా గుర్తించిన లేదా ప్రకటించిన ఆస్తిని కొత్త చట్టం అమలులోకి వచ్చిన తర్వాత వక్ఫ్ గా పరిగణించరాదని కొత్త చట్టంలో ఉందని కూడా కపిల్ సిబాల్ కోర్టుకు తెలిపారు. వక్ఫ్ బోర్డులో ముస్లిమేతర అధికారిని నియమించారని.. ఇది తనంతట తానే రాజ్యాంగ విరుద్ధమని కపిల్ సిబాల్ అన్నారు. కొత్త చట్టం అమలులోకి వస్తే ముస్లింలకు చెందిన రక్షిత స్మారకం స్థలాన్ని కూడా ఇకపై వక్ఫ్ స్థలంగా పేర్కొనలేమని కపిల్ సిబాల్ కోర్టుకు విన్నవించే ప్రయత్నం చేశారు.అయితే, వాదనలు విన్న అత్యున్నత న్యాయ స్థానం ఈ వక్ఫ్ బిల్లు చట్టభద్ధతపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. రేపు మధ్యంతర తీర్పు ఇస్తామని చెప్పింది.

## ప్రధాని మోదీ ఏపీ పర్యటన.. అధికారులకు మంత్రి నారాయణ కీలక సూచనలు

అమరావతి: రాజధాని అమరావతి ప్రాంతంలో ఇవాళ (బుధవారం) మంత్రి నారాయణ పర్యటించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఏపీ రాజధాని అమరావతిలో మే2వ తేదీన పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి నారాయణ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రధాని మోదీ సభకు వచ్చే రహదారులను పరిశీలించారు. గుంటూరు, ఏలూరు, విజయవాడ ఇతర జిల్లాల నుంచి వచ్చే ప్రజలకు సంబంధించి రహదారి మార్గాల విషయంలో అధికారులకు మంత్రి సూచనలు చేశారు. కొన్ని రోడ్లు వెంటనే. వేడల్పు చేయాలని మంత్రి నారాయణ ఆదేశిం చారు.



ట్రాఫిక్..ఇబ్బందులు లేకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి నారాయణ ఆదేశించారు. రాజధాని ప్రాంతంలో రూ.64 వేల కోట్ల విలువైన టెండర్లు పిలిచామని మంత్రి నారాయణ తెలిపారు. వచ్చే నెల 2వ తేదీన మళ్లీ రాజధాని పనులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా రీ లాంచ్ జరుగుతుందని చెప్పారు. వచ్చే నెల 2వ తేదీన ప్రధాని మోదీ సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు బహిరంగ సభలో పాల్గొంటారని అన్నారు. 5 లక్షల మంది ప్రజలు బహిరంగ సభకు హాజరవుతారనే అంచనా వేస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు.రాజధానిలో కొన్ని రోడ్ల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదని మంత్రి నారాయణ అన్నారు. పోలీసుశాఖ సమన్వయంతో సీఆర్డీఏ సిబ్బందితో రాజధాని ప్రాంతంలో పర్యటన చేశామని తెలిపారు. 8 రోడ్డు మార్గాల్లో సభకు చేరుకోవచ్చుని అన్నారు. తాడికొండ, హరిశ్చంద్రపురం, ప్రకాశం బ్యారేజ్ ఇలా కొన్ని మార్గాల్లో సభకు చేరుకునే విధంగా ఏర్పాటు జరుగుతుందని చెప్పారు. 11 ప్రాంతాల్లో పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేశామని అన్నారు.

# సంపాదకీయం

గురువారం 24-04-2025

## సైనిక దుస్తుల్లో వచ్చి మారణహోమం

జమ్మూ కాశ్మీర్‌లోని మినీ స్విట్జర్లాండ్‌గా భావించే పహల్గామ్‌లోని బైసరన్ లోయ అందాలను.. అక్కడి ప్రకృతిని చూసి ఆనందించాలని వచ్చిన పర్యాటకుల ఆశలు గల్లంతయ్యాయి. పక్కా ప్లాన్ వేసుకుని ఆర్మీ దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు.. 27 మందిని పొట్టనపెట్టుకున్నారు. మరో 20 మంది ప్రాణాల కోసం చావు బతుకుల మధ్య ఆస్పత్రుల్లో పోరాటం చేస్తున్నారు. కాశ్మీర్ అందాలను ఆస్వాదించాలని వచ్చిన ఆ టూరిస్ట్‌లు.. అచేతన స్థితిలో పడిపోయారు. ఈ క్రమంలోనే పహల్గామ్ ఉగ్రదాడికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు.. మీడియా, సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. అందులో ఒక ఫోటో ఇప్పుడు అందరి హృదయాలను కదిలిస్తోంది. ఓ వ్యక్తి మరణించగా.. అతడి పక్కనే భార్య ఏడుస్తున్న ఫోటో.. ఇప్పుడు అందరి కంట కన్నీరును పెట్టిస్తోంది.కొత్తగా పెళ్లి చేసుకుని.. హనీమూన్ కోసం జంటగా వచ్చిన ఆ ఇద్దరిలో ఇప్పుడు ఒక్కరే మిగిలారు. ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో భర్త ప్రాణాలు కోల్పోగా.. ఆ మృతదేహం పక్కనే భార్య రోదిస్తున్న ఫోటో ఇప్పుడు వైరల్ కావడంతో అది అందరినీ కలచి వేస్తోంది. ఎంతో ఆనందంగా జరిగిన ట్రిప్.. ముగిసే సమయంలోనే ఉగ్రవాదుల దాడి కారణంగా ఒక్కసారిగా తారుమారైంది. హనీమూన్‌కి వచ్చిన తమపై దాడి చేశారని.. తన భర్తను దగ్గర నుంచి కాల్చి చంపినట్లు మహిళ వణుకుతున్న గొంతుతో చెప్పింది. తాను అక్కడే కూర్చుని భేల్ పూరి తింటున్న సమయంలో తన భర్త పక్కనే ఉన్నాడని.. అంతలోనే ఓ వ్యక్తి వచ్చి తన భర్తను నువ్వు ముస్లింవా అని అడిగినట్లు చెప్పింది. అందుకు తాను ముస్లిం కాదని తన భర్త చెప్పడంతో కాల్చి చంపినట్లు ఆమె కన్నీరు మున్నీరు అయింది. భర్త శవం పక్కన కూర్చుని ఉన్న ఆ యువతి ఫోటో ఇప్పుడు అందరితో కన్నీరు పెట్టిస్తోంది.అప్పటివరకు సంతోషంగా కాశ్మీర్ అందాలను, హిమాలయాలను, పచ్చటి చెట్లు, గడ్డి భూములను చూసి ప్రపంచాన్ని మైమరిపోయిన టూరిస్టులు.. క్షణాల్లోనే ప్రాణాలు విడిచారు. ఈ దాడికి లష్కరే తోయిబా ప్రాక్సీ సంస్థ అయిన "ది రెసిస్టెన్స్ ఫ్రంట్" ఉగ్ర సంస్థ బాధ్యత ప్రకటించింది. ఇక ఈ ఉగ్రదాడి తర్వాత ఆ ప్రాంతం మొత్తం భీతావహ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం అక్కడి దాడికి సంబంధించిన వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. తమను, తమ వారిని కాపాడాలి అంటూ కన్నీటితో అందరినీ వేడుకుంటున్న వీడియోలు కలిచివేస్తున్నాయి. "ప్లీజ్ నా భర్తను రక్షించండి" అంటూ ఓ మహిళ ఏడుస్తూ బతిమిలాడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ఇక సైనిక దుస్తుల్లో వచ్చిన ఏడుగురు ఉగ్రవాదులు.. ఈ మారణహోమానికి తెరలేపినట్లు ప్రాణాలతో బయటపడిన ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. కనిపించిన వారిని కనిపించినట్లే పాయింట్ బ్లాంక్‌లో తుపాకీ పెట్టి కాల్చినట్లు పేర్కొన్నారు. అది ఒక భయానక సంఘటనగా వారు అభివర్ణిస్తున్నారు. మినీ స్విట్జర్లాండ్‌గా పిలుచుకునే అనంత్‌నాగ్ జిల్లాలోని పహల్‌గామ్‌లోని బైసరన్ ప్రాంతం.. ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరు. దీంతో దేశవిదేశాలకు చెందిన పర్యాటకులు బైసరన్ లోయ ప్రాంతాన్ని చూసేందుకు వస్తారు. అయితే అలాంటి టూరిస్ట్‌లను లక్ష్యంగా చేసుకుని..ఆర్మీ దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు దాడి చేశారు. ఇక ఈ ఉగ్రదాడికి పాల్పడింది తామే అంటూ టీఆర్ఎఫ్ ప్రకటించింది.దాదాపు 40 మంది పర్యాటకులను చుట్టుముట్టి.. అత్యంత సమీపం నుంచి కాల్పులు జరపడంతో వారు అక్కడికక్కడే రక్తపు మడుగులో పడి ప్రాణాలు విడిచారు. మతం ఏంటని.. పేరు ఏంటని అడిగి మరీ కాల్పులు జరిపినట్లు పర్యాటకులు చెబుతున్నారు. ఐడీ కార్డులు ఇవ్వాలని వారిని బెదిరించినట్లు చెప్పారు. గాయపడిన క్షతగాత్రులు మహారాష్ట్ర, గుజరాత్, యూపీకి చెందిన వారుగా గుర్తించారు. పలువురు విదేశీ పర్యాటకులు కూడా మృతుల్లో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. మరికొందరు బుల్లెట్ గాయాలతో ప్రాణాలు దక్కించుకునేందుకు ఆర్తనాదాలు చేశారు. ఇక బైసరన్ ప్రాంతంలో తుపాకీ కాల్పుల శబ్దాన్ని విన్న సైన్యం.. హుటాహుటిన అక్కడికి చేరుకుంది. హెలికాప్టర్ సాయంతో గాయపడిన వారిని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ బైసరన్ ప్రాంతానికి కేవలం కాలినడకన లేదా గుర్రాలపై మాత్రమే చేరుకునే అవకాశం ఉండటంతో బాధితులను వేగంగా తరలించడం సైన్యానికి కష్టతరం అయింది.మరోవైపు.. త్వరలోనే మంచు కొండల్లో పవిత్రమైన అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం కానున్న వేళ.. ఈ భారీ ఉగ్రదాడి జరగడం తీవ్ర సంచలనంగా మారింది. ఉగ్రవాద దాడి కోసం స్థానికులు ఉగ్రవాదులకు బైక్‌లను అందించి ఉండవచ్చని భద్రతా సంస్థలు అనుమానిస్తున్నాయి. సంఘటనా స్థలానికి సమీపంలో లభించిన అనుమానాస్పద బైక్ ఎవరిదో తెలుసుకోవడానికి దర్యాప్తు జరుగుతోంది. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి దేశాన్నే కాదు.. యావత్ ప్రపంచాన్ని గ్భ్రాంతికి గురిచేసింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలు ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఉగ్రవాదంపై పోరాటంలో భారత్‌కి తమ మద్దతును తెలియజేస్తున్నాయి. పహల్గామ్‌లో దాడి జరిగిన ప్రదేశం దగ్గర నంబర్ ప్లేట్ లేని నల్లటి బైక్ ఎవరిది? అనే విషయం ప్రస్తుతం చర్చణీయాంశంగా మారింది. 38 రోజుల పాటు కొనసాగే అమర్‌నాథ్ యాత్ర జులై 3వ తేదీన ప్రారంభం కానుంది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది యాత్రికులు రెండు మార్గాల్లో చేరుకోనున్నారు. అనంత్‌నాగ్ జిల్లాలో పహల్గాం మార్గంలోనే 48 కిలోమీటర్ల మేర ఉండగా.. 14 కిలోమీటర్ల మార్గం గండేర్బల్ జిల్లా నుంచి ఉంటుంది.పరిస్థితుల్లో తాజాగా పర్యాటకులపై ఉగ్రదాడి జరగడం అమర్‌నాథ్ యాత్రికులకు తీవ్ర భయాందోళన కలిగిస్తోంది.

# కౌశిక్ రెడ్డి అక్రమ వసూళ్లకు హద్దు లేదా

హుజురాబాద్ : ఏప్రిల్ 23, హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వోడితల ప్రణవ్ మాట్లాడుతూజమ్మూ కాశ్మీర్ లో 26 మంది ఉగ్ర దాడుల్లో చనిపోవడం భాదకరం మనీష్ రంజన్,వినయ్ రంగల్ కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. తధానంతరంహుజురాబాద్ శాసన సభ్యుడు కౌశిక్ రెడ్డి పై గ్రానైట్ వ్యాపారస్తుల కుటుంబం సుబేదారి పోలీసు స్టేషన్ లో కేసు నమోదు చేశారు. గుండె?డ్,వంగపల్లి గ్రామాల శివారులో గలఎంఎల్ఏ కౌశిక్ రెడ్డి అరాచకాలు తారా స్థాయికి చేరాయి అన్నారు. ఏ రకంగా ఇబ్బంది పెడితే గ్రానైట్ వ్యాపారి మనోజ్ రెడ్డి భార్య సుబేదారి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిందో ప్రజలకు అర్థం అవుతుంది.గతంలో ఏమ్మెల్సిగా ఉన్నప్పటి నుండి ఇదే ప్రవర్తన కొనసాగిస్తున్నారు.హుజురాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అంటేనే ప్రజలు అసహ్యించుకునే స్థాయికి కౌశిక్ రెడ్డి తీసుకొచ్చాడు.సంచలనం కావాలని ఇతను చేసే పనులకు హుజురాబాద్ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బాధిత కుటుంబానికిస్పష్టంగా వారికి వచ్చిన మెసేజ్ లు కాల్స్ చూపెట్టి ఫోన్ చేశారని ఒప్పుకొని దొరికిపోయారు.డబ్బులు ఇవ్వమని

### గ్రానైట్ యజమాని కుటుంబాన్ని భయబ్రాంతులకు గురి చేయడమేనా

బూతులతో,ఇంట్లో చుట్టాలు ఉన్నారని చెప్పిన కూడా వినకుండా ఇష్టం వచ్చినట్లు తిట్టారనీ సదరు మహి చెబుతున్నారు.వ్యాపారి పట్ల ఇలాంటి వైఖరి తప్పు ఎంత భాదపడితే కేసు పెడతారు.టీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడే ఎమ్మెల్సీగా డబ్బులు తీసుకున్నాడు. గుమ్మడి కాయ దొంగలు ఎవరు అంటే భుజాలు తడుముకున్నట్లు కౌశిక్ రెడ్డి ప్రవర్తన ఉందన్నారు. గుండెడు గ్రామస్తులు,టీఆర్ఎస్ నాయకులు వారి పార్టీ వ్యక్తులు పోయి కమలాపూర్ లో పోలీసులకు ఫిర్యాదు చేశారు.10 లక్షలు దాతగా ఇచ్చిన వ్యక్తి పై ఎవరైనా కేసు నమోదు చేస్తారా 7ఏళ్ళ క్రితమే వారికి డబ్బులు ముట్టజెప్పారనీ ఒప్పుకున్నారు.కౌశిక్ రెడ్డి వ్యాపారికి ఫోన్ చేసింది నిజమే అది వారే ఒప్పుకున్నారు.27 తారీఖు జరిగే రజతోత్సవ సభ కోసం ఇదంతా చేస్తున్నారా?కౌశిక్ రెడ్డి కేటిఆర్ బినామీగా వ్యవహరిస్తున్నారు. రావణాసురుడులాగా ప్రవర్తిస్తున్నాడు.10 ఏళ్లు దోచుకొని తిన్నారు.అది చాలక మళ్ళీ జనాలపై దోపిడీకి దిగారు. ఇలాంటి ఎంఎల్ఏలు బీఆర్ఎస్ పార్టీలో ఎంత మంది ఉన్నారో?కేసు తప్పుదోవ పట్టించుకునేందుకు కొత్త నాటకాలు చేస్తున్నారు. కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రావు, కేటీఆర్,హరీష్ రావు ఈ ఎంఎల్ఏ విషయంలో మీ వైఖరి స్పష్టం చేయాలి అన్నారు. కాంగ్రెస్ పార్టీ పక్షాన మేము డిమాండ్ చేస్తున్నాం,ఈ వైఖరిపై స్పందించాలి.మహిళా గవర్నర్ విషయంలో జర్నలిస్ట విషయంలో,ముదిరాజ్ కులాన్ని దుషించిన విషయంలో,డ్రైవర్ విషయంలో,సహచర ఎంఎల్ఏ విషయంలో,ఇప్పుడు ఒక వ్యాపారి విషయంలో ఇలా ఎన్ని అరాచకాలు చేస్తున్నా, ఇప్పటికీ మీరు స్పందించకపోతే దాని అర్థం ఏంటో తెలియజేయాలి. మీరు సమాధానం చెప్పకపోతే కౌశిక్ రెడ్డి వ్యవహార శైలిని సమర్థిస్తున్నట్లె అని ప్రజలకుఅర్థం అవుతుంది.కౌశిక్ రెడ్డి రాజీనామా చేసి హుజురాబాద్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి.హైదరాబాద్ లో గొప్పలు చెప్పే కేటిఆర్, కౌశిక్ రెడ్డి రాజీనామా తర్వాత హుజురాబాద్ నియోజకవర్గంలో డిపాజిట్ వస్తే దేని కైనా సిద్ధం అన్నారు .హుజురాబాద్ నుండే బి ఆర్ ఎస్ పతనం మొదలు కాబోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టి పి సి సి సభ్యులు పత్తి కృష్ణారెడ్డి, హుజురాబాద్ నియోజకవర్గం లోని కాంగ్రెస్ మార్కెట్ కమిటీ చైర్మన్ లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు తో పాటు పాల్గొన్నారు.

# మే 25 వరకు రాజీవ్ యువ వికాసం విచారణ పూర్తి చేయాలి.

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి,రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు విచారణ ప్రక్రియ మే 25వ తేది వరకు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.బుధవారం ఐడిఓసి కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు విచారణ ప్రక్రియ, మండలస్థాయిలో విచారణ టీముల ఏర్పాటుపై ఎల్డిఎం, డిఆర్డీఏ, ఎస్సి, ఎస్టీ, బిసి, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు, ఎంపిడివోలు, బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకానికి ఎస్సిలు 6711 మంది, ఎస్టీలు 2333 మంది, బిసిలు 11225 మంది, ఈబిసిలు 401 మంది, మైనార్టీలు 749 మంది, క్రిస్టియన్లు 9 మంది దరఖాస్తులు చేసినట్లు తెలిపారు. మండల స్థాయిలో విచారణ చేయుటకు ఎంపిడిఓ, మండల ప్రత్యేక అధికారి, బ్యాంక్ మేనేజర్లు, ఎస్సి, ఎస్టీ, బిసి, మైనార్టీ, ఈబిసి అధికారులు, డిఆర్డీఏ సిబ్బందితో కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం యూనిట్లు ఏర్పాటు చేయు లబ్ధిదారులకు బ్యాంకర్లు రుణాలు అందించాలని సూచించారు. లబ్ధిదారుల విచారణ ప్రక్రియ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరగాలని, ఎలాంటి పొరపాట్లు కు తావులేకుండా జరగాలని సూచించారు. మండల స్థాయి విచారణ తదుపరి జిల్లా కమిటీ పరిశీలన చేస్తుందని, తుది జాభితా ఆయా కార్పోరేషన్స్ కు పంపనున్నట్లు తెలిపారు. యూనిట్లు ఏర్పాటును బట్టి ఎంపిక చేసిన లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆఫ్ లైన్, ఆన్లైన్ ద్వారా వచ్చిన అన్ని దరఖాస్తులు జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిఆర్డీఓ నరేష్, ఎల్డిఎం తిరుపతి, బిసి, ఎస్సి, ఎస్టీ శాఖల సంక్షేమ అధికారులు శైలజ, వెంకటేశ్వర్లు, పోశం, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, అన్ని మండలాల ఎంపిడిఓలు, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్మీ దుస్తుల్లో వచ్చి ఉగ్రవాదుల దాడి..

### సైనికులను చూసినా గడగడ వణికిన బాధితులు

పహల్గాం సమీప బైసరన్ లోయలో ఉగ్రవాదులు సైనిక దుస్తుల్లో వచ్చి దాడులకు తెగబడ్డారు. మొత్తం ఐదుగురు ముష్కరులు మహిళలు, చిన్నారులను వదిలిపెట్టి పురుషులే లక్ష్యంగా కాల్పులకు దిగారు. ఈ కాల్పుల్లో మొత్తం 28 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. ఉగ్రదాడి నుంచి బయటపడిన పలువురు బాధితులు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు.దాడికి పాల్పడిన ఉగ్రవాదులు సైనిక దుస్తుల్లో రావడంతో.. దాడి అనంతరం బాధితులను రక్షించేందుకు వచ్చిన సైనికులను చూసి కూడా జనం గడగడ వణికిపోయారు. ఉగ్రవాదులు మళ్లీ వచ్చారనుకుని భీతిల్లారు. సైనికులను చూసిన ఓ మహిళ తన కొడుకును ఏమీ చేయవద్దని బోరున విలపించింది. చేతులు జోడించి వేడుకుంది. ఇతర పర్యటకులు భయంతో తమ పిల్లలను తమ వెనుక దాచుకున్నారు.దాంతో ఓ సైనికుడు వారికి ధైర్యం చెప్పారు. తాము భారత ఆర్మీ నుంచి మిమ్మల్ని రక్షించడానికే వచ్చామని భరోసా ఇచ్చారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అదేవిధంగా ఉగ్రవాదుల దాడిలో తన భర్త మరణాన్ని చూసి షాక్‌కు గురైన ఓ మహిళ అందులో నుంచి బయటకు రాలేకపోతున్నారని, బాధతో రోదిస్తూనే ఉన్నారని భద్రతా బలగాలు తెలిపాయి.కాగా జమ్ముకశ్మీర్‌లో పౌరులే లక్ష్యంగా జరిగిన అత్యంత దారుణమైన ఉగ్రదాడుల్లో ఇది కూడా ఒకటి. పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత 'లష్కరే తోయిబా' అనుబంధ విభాగం 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్' ఈ మారణహోమానికి తామే పాల్పడినట్లు ప్రకటించింది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఈ ఉగ్రదాడి జరిగింది. దుండగులు అతి సమీపం నుంచి తూటాల వర్షం కురిపించారు.మహిళలు, చిన్నారులను వదిలిపెట్టి పురుషులే లక్ష్యంగా దాడికి దిగారు. 28 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు విదేశీయులు ఉన్నట్లు అధికారులు తెలిపారు.



# నరమేధానికి పాల్పడిన నలుగురు ఉగ్రవాదుల ఫొటో రిలీజ్.. బట్టబయలైన పాక్ కుట్ర..!

జమ్ము కశ్మీర్‌లోని పెహల్‌గామ్ లో నరమేధానికి పాల్పడిన నలుగురు ఉగ్రవాదుల ఫొటోను భద్రతా సంస్థ తాజాగా విడుదల చేసింది. అందులో ముగ్గురి పేర్లు ఆసిఫ్ ఫౌజీ, సులేమాన్ షా, అబు తల్హాగా గుర్తించారు. ఆసిఫ్ ఫౌజీ పాక్ ఆర్మీ రిటైర్డ్ జవాన్‌గా దర్యాప్తు సంస్థ గుర్తించింది.ఈ నలుగురు పాక్‌కు చెందిన లష్కరే తోయిబాతో సంబంధాలు కలిగి ఉన్నట్లు దర్యాప్తు సంస్థలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. ఈ నలుగురిలో ఇద్దరు విదేశీలుగా భావిస్తున్నారు. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిలో పాక్ ఆర్మీ రిటైర్డ్ జవాన్ ఉండటంతో.. ఈ దాడి వెనుక పాక్ కుట్ర ఉన్నట్లు బట్టబయలైంది. ఉగ్రదాడి జరిగిన ప్రాంతానికి చేరుకున్న ఎన్ఐఏ బృందం ముష్కరులు వాడిన భాష, ఇతర వివరాలను ప్రత్యక్ష సాక్షుల నుంచి సేకరించారు. టెర్రరిస్టులు దాడి సమయంలో పష్తూన్ భాషలో మాట్లాడినట్లు గుర్తించారు. ఈ నలుగురు ముష్కరులు మరో ముగ్గురు స్థానికులు సహకరించినట్లు తేలింది.



# టెన్త్ విద్యార్థి ఆత్మహత్య

### అర్జావాని గూడెంలో విషాదం
### ఇక వారసుడు లేడని
### అమ్మానాన్న కన్నీరు మున్నీరు

పదవ తరగతి పరీక్షలో మరో సారి ఫెయిల్ కావటంతో.. ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. కృష్ణాజిల్లా బంటుమిల్లి మండలం అర్జావాని గూడెంలో ఈ విషాదం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. అర్జావాని గూడెం గ్రామానికి చెందిన గోవాడ రామకృష్ణ ఓ మినీ వ్యాన్ డ్రైవరు. ఆయనకు ఒక కుమారుడు, ఓ కుమార్తె ఉన్నారు. కుమారుడు గోవాడ అనిల్ కుమార్ ( బిట్టు) పెద తుమ్మిడి హైస్కూలులో గత ఏడాది పదవ తరగతి చదివాడు. కానీ ఫెయిల్ అయ్యాడు. సప్లమెంటరీలోనూ కృతార్థుడు కాలేక పోయాడు. ఈ ఏడాది మళ్లీ పదవ తరగతి పరీక్షకు సిద్ధమయ్యాడు. మళ్లీ ఫెయిల్ కావటంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. బుధవారం ఉదయం తమ ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏకైక వారసుడు అర్థంతరంగా ఆత్మహత్య చేసుకోవటంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. అర్జావానిగూడెం విషాదంలో మునిగిపోయింది. తమ బిడ్డకు పోస్టుమార్టం జరపొద్దని పోలీసులకు తల్లీదండ్రులు వేడుకున్నారు. గ్రామస్థులు సైతం తల్లిదండ్రులను ఓదార్చి, మద్దతు తెలిపారు.

## కోహెడ లో సన్న బియ్యం లబ్ధిదారు తలారి చంద్రయ్య ఇంట్లో భోజనం చేసినమంత్రి పొన్నం ప్రభాకర్.. జిల్లా కలెక్టర్ మను చౌదరి..ఇతర అధికారులు:

కోహెడ,సన్న బియ్యం పథకం ప్రారంభించిన తరువాత తమ కుటుంబానికి ఎంతో లబ్ది జరుగుతుందని తెలిపిన తలారి చంద్రయ్య కుటుంబ సభ్యులు.వారికి ఎన్ని కిలోల సన్న బియ్యం వస్తున్నాయి గతంలో ఉన్నప్పుడు ఇప్పుడున్న పరిస్థితుల పై ఆరా తీసిన మంత్రి పొన్నం ప్రభాకర్. మంత్రి మాట్లాడుతూ.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి పౌరుడు సన్న బియ్యం తినాలని ఉగాది పండుగ నుండి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది.కోహెడ మండలంలోని తలారి చంద్రయ్య మల్లవ్వ ఇంట్లో జిల్లా కలెక్టర్, నేను,మండల పార్టీ నాయకులు అందరం కలిసి వారింట్లో భోజనం చేశాం.మల్లవ్వ మంచి భోజనం పెట్టింది వారిది రేకుల గుడిసె.వారికి ఇందిరమ్మ ఇళ్లు కావాలని అడిగారు వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం.తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు న్యాయం చేయాలనీ చాలా కార్యక్రమాలు కొనసాగిస్తుంది.సన్న బియ్యం కార్యక్రమం చారిత్రాత్మక నిర్ణయం దేశంలో తెలంగాణలో మాత్రమే ఈ కార్యక్రమం జరుగుతుంది.దీనిని కూడా రాద్ధాంతం చేసే ప్రయత్నం వద్దు దీనిని కూడా మిగతా రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకునేలా కేంద్రంలో ప్రాతినిధ్యం వహిస్తున్న వారు చెప్తే సంతోషిస్తాం.ఎవరు హక్కుదారులు ఎవరు వాటదారులు అనే సందర్భం కాదు.సన్న బియ్యం తింటున్న ప్రజలకు ఇంకా ఏవిధంగా మేలు చేయాలనే ఆలోచిస్తున్నాం.

# చిన్న ఓదాల లో ఉచిత మెగా వైద్య సేవలు

### -ప్రజల నుండి భారీ స్పందన

మంథని మంథని మండలంలోని చిన్న ఓదాల గ్రామంలో బుధవారం మంథని పటేల్ ఐ కేర్ సహకారంతో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా మెడికవర్ హాస్పిటల్,కరీంనగర్ సౌజన్యంతో గుండె సంబందిత ఈ సీ జీ, బి పి, మధుమేహ పరీక్షలు, బ్లడ్ షుగర్ , బరువు పరీక్షలను నిర్వహించారు. శ్రీ వైద్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో అఫ్తాల్మిక్ ఆఫీసర్ బుద్ధార్తి సతీష్ కుమార్ సహకారంతో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుండి భారీ స్పందన లభించింది. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఎడ్ల పద్మ బాపు మాట్లాడుతూ వేసవి కాలంలో 41 డిగ్రీల ఎండలో మా గ్రామలో ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనియమన్నారు. వైద్య బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుదుడుల రంజిత్ పటేల్ ,కొండ సురేశ్, వేముల మహేష్, బుద్ధార్తి సంపత్, దాసరిశ్రీను. .డా.చరణ్. , డా.పి.అనీష్ కార్డియాలజీ , మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్ ,కో ఆర్డినేటర్ శ్రీకాంత్ మార్కెటింగ్ ఎక్సిక్యూటివ్ శ్రీనివాస్. మెడికల్ టెక్నిషియన్ బృందం పాల్గొన్నారు.

# ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్ దే అధికారం..

హైదరాబాద్, ఏప్రిల్ 23, తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితులను అంచనా వేసేందుకు ూాయా గ్రూప్, ఎఖూా టీమ్ హైదరాబాద్ నిర్వహించిన సమగ్ర సర్వే ఫలితాలు రాష్ట్రంలోని ప్రజా మనోభావాలను స్పష్టంగా వెల్లడిస్తున్నాయి. 2025 ఏప్రిల్ 20 నాటి ఈ సర్వే 113 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 32,500 నమూనాలతో నిర్వహించబడింది. ఈ సర్వే ఫలితాలు రాష్ట్రంలో ప్రస్తుత పాలనపై ప్రజల అసంతృప్తిని, రాజకీయ పార్టీల పనితీరుపై వారి అభిప్రాయాలను స్పష్టంగా చూపిస్తున్నాయి.సర్వే నిర్వహణ కోసం శాస్త్రీయ పద్ధతులను అనుసరించారు. క్షేత్రస్థాయి సమాచార సేకరణలో సమతూక రీతిలో విభిన్న వర్గాల నుంచి నమూనాలు సేకరించారు.నమూనాల సంఖ్య: 113 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 32,500 నమూనాలు సేకరించారు. ప్రతి నియోజకవర్గంలో నగటున 280?290 నమూనాలు.సమయం: 2024 ఏప్రిల్ 1 నుంచి ఏప్రిల్ 17 వరకు.సాంప్లింగ్ పద్ధతి: 55% స్ట్రాటిఫైడ్ (ఎంపిక చేసిన) సాంప్లింగ్, 45% రాండమ్ సాంప్లింగ్. ప్రతి నియోజకవర్గంలో 130 రాండమ్, 160 స్ట్రాటిఫైడ్ నమూనాలు.విభాగాలు: ఉత్తర తెలంగాణ, దక్షిణ తెలంగాణ, హైదరాబాద్?రంగారెడ్డి బెల్ట్‌లలో సమతూకంతో సర్వే నిర్వహించారు.విభిన్నత: వయసు, లింగం, కులం, ఆదాయం, గ్రామీణ?పట్టణ విభజనలను పరిగణనలోకి తీసుకున్నారు.పొరపాటు మార్జిన్: 1.5% నుంచి 2% మధ్య, ఫలితాల విశ్వసనీయతను నిర్ధారిస్తూ.సర్వేలో పాల్గొన్న వర్గాలుసర్వేలో రైతులు, కౌలు రైతులు, నిరుద్యోగ యువత, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ఆశా/అంగన్‌వాడీ కార్యకర్తలు, గృహిణులు, చిన్న వ్యాపారులు, బీసీ, ఎస్సీ/ఎస్టీ, ఓసీ, ముస్లిం సముదాయాలు, స్థానిక సంస్థ నాయకులు, కూలీలు, ధనిక/మధ్యతరగతి/పేద వర్గాలు పాల్గొన్నాయి. ఈ విభిన్న వర్గాల నుంచి సేకరించిన సమాచారం రాష్ట్రంలోని సామాజిక, ఆర్థిక వాస్తవాలను ప్రతిబింబిస్తుంది.ప్రధాన అంశాలు (ఓ?ఫ్యాక్టర్స్)సర్వే ప్రకారం, రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసే కీలక అంశాలు:ద్రవ్యోల్బణంరైతులు, కౌలు రైతుల సమస్యలుచట్టం, శాంతిభద్రతలుప్రాథమిక సౌకర్యాలు (తాగునీరు, రోడ్లు, విద్యుత్, ఆరోగ్య కేంద్రాలు)నిరుద్యోగంప్రభుత్వ సంక్షేమ పథకాలపై సంతృప్తి/అసంతృప్తిఅభివృద్ధి కార్యక్రమాలుఎమ్మెల్యేలు, మంత్రుల పనితీరుపార్టీలలో సమూహ రాజకీయాలుసర్వేలో కీలక అబ్జర్వేషన్స్ప్రభుత్వంపై అసంతప్తి: కాంగ్రెస్ పార్టీ హామీలు (మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ గహాలు, యువ వికాసం, చేయూత) అమలు కాకపోవడం లేదా ఆలస్యం కావడంతో ప్రజల్లో అసంతృప్తి నెలకొంది.మాజీ సీఎంపై విమర్శలు..సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు మాజీ సీఎం కేసీఆర్‌పై నిరంతరం విమర్శలు చేయడం ప్రజల్లో వ్యతిరేకతను రేకెత్తిస్తోంది. ప్రజలు మెరుగైన పాలన కోరుకుంటున్నారు, కానీ ప్రభుత్వం దృష్టి మళ్లింపు రాజకీయాలపై ఉన్నట్లు భావిస్తున్నారు.పార్టీలో అంతర్గత సమస్యలు: కాంగ్రెస్ పార్టీ క్యాడర్, ఎమ్మెల్యేల మధ్య సమన్వయం లోపించడం, సమూహ రాజకీయాలు పార్టీ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నాయి.బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఎమ్మెల్యేలు: ఈ ఎమ్మెల్యేలపై స్థానికంగా తీవ్ర అసంతృప్తి ఉంది.నిరుద్యోగం, ఉద్యోగ నియామకాలు: కొత్త ఉద్యోగ నియామకాలు, ఉద్యోగ అవకాశాలపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారు.పోలికలు: ప్రజలు ప్రస్తుత పాలనను మాజీ బీఆర్ఎస్ పాలనతో పోల్చి, ప్రస్తుత పాలనా శైలిని ప్రశ్నిస్తున్నారు.భూసేకరణ వివాదాలు: లగడచర్ల భూ సేకరణ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ కోసం భూ సేకరణలపై ప్రజా వ్యతిరేకత కనిపిస్తోంది.హైడ్రాపై విమర్శలు: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ యాసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ పనితీరు పేద, మధ్యతరగతి వర్గాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటోందని, ధనిక వర్గాలను విడిచిపెడుతోందని ప్రజలు భావిస్తున్నారు.పాజిటివ్ అంశాలు: పేదలకు నాణ్యమైన బియ్యం అందించడం, ఎస్సీ సముదాయ వర్గీకరణ కాంగ్రెస్‌కు కొంత ప్రయోజనం చేకూర్చాయి.ప్రాంతీయ విభజన: ఉత్తర తెలంగాణలో కాంగ్రెస్ కొన్ని సీట్లు కోల్పోయే అవకాశం ఉంది. హైదరాబాద్, రంగారెడ్డిలో ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తి ఎక్కువగా ఉంది. ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో బీఆర్ఎస్ పనితీరు సంతప్తికరంగా లేదు. బీజేపీ ఉత్తర తెలంగాణ, హైదరాబాద్‌లో కొంత వోటు షేర్‌ను పెంచుకుంది, కానీ రాష్ట్ర సగటు 18% వద్దే ఉంది.వోటు షేర్ అంచనాలు (20.04.2025 నాటికి)కాంగ్రెస్ (ఎఔఅ): 34.25% (?5.49% జటౌర్ఘు 2023)బీఆర్ఎస్ (ఃఖీూ): 39% (+1.65% జటౌర్ఘు 2023)బీజేపీ (ఃఏఖ): 18% (+3.85% జటౌర్ఘు 2023)ఎఐఎంఐఎం (ంఎఓఎఓ): 2.5% (+0.28% జటౌర్ఘు 2023)ఇతరులు: 6.25% (?0.29% జటౌర్ఘు 2023)అసెంబ్లీ సీట్ల అంచనామొత్తం 119 అసెంబ్లీ సీట్లలో:బీఆర్ఎస్: 58?60 సీట్లుకాంగ్రెస్: 37?39 సీట్లుబీజేపీ: 18?19 సీట్లుఎఐఎంఐఎం: 6?7 సీట్లుతీవ్ర పోటీలో ఉన్న సీట్లు: 18 (బోథ్, సిర్పూర్, సంగారెడ్డి, జహీరాబాద్, జుక్కల్, ఎల్లారెడ్డి, హుజూరాబాద్, మానకొండూర్, మహబూబ్‌నగర్, అలంపూర్, షాద్‌నగర్, నర్సంపేట, మహబూబాబాద్, మిర్యాలగూడ, అలైర్, భద్రాచలం, నాంపల్లి, ఎల్.బీ.నగర్)ప్రధాన సర్వే ప్రశ్నలు, ఫలితాలుప్రభుత్వ పనితీరు:చాలా మంచిది: 3%మంచిది: 22%సగటు: 19%చెడు: 47%అభిప్రాయం లేదు: 9%తదుపరి సీఎం ఎవరు?:రేవంత్ రెడ్డి: 32%కేసీఆర్: 43%బండి సంజయ్: 14%తెలంగాణ అభివృద్ధికి ఉత్తమ పార్టీ:బీఆర్ఎస్: 41%కాంగ్రెస్: 33%బీజేపీ: 16%చట్టం, శాంతిభద్రతలు:మంచిది: 20%సగటు: 21%చెడు: 42%కాంగ్రెస్ హామీల అమలు:అమలయ్యాయి (సంతృప్తి): 20%అమలు కాలేదు (అసంతృప్తి): 44%పాక్షికంగా అమలు: 17%హైడ్రా పనితీరు:సంతృప్తి: 20%అసంతృప్తి: 44%పాక్షిక సంతృప్తి: 15%2025 ఏప్రిల్ 20 నాటి సర్వే ప్రకారం, తెలంగాణలో బీఆర్ఎస్ స్వల్ప ఆధిక్యంతో ముందంజలో ఉంది, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరుపై అసంతప్తి స్పష్టంగా కనిపిస్తోంది. బీజేపీ కొన్ని ప్రాంతాల్లో వోటు షేర్‌ను పెంచుకుంది, కానీ రాష్ట్రవ్యాప్తంగా ప్రభావం పరిమితంగా ఉంది. ఈ సర్వే 2028 అసెంబ్లీ ఎన్నికలకు ముందస్తు సూచన మాత్రమే. రాజకీయ పరిస్థితులు, పార్టీల వ్యూహాలు, ప్రజల్లో నమ్మకం ఆధారంగా తుది ఫలితాలు మారవచ్చు.

## ఎఫ్ ఎల్ ఎన్ కు నాలుగు పాఠశాలలు ఎంపిక

కమాన్ పూర్ ఏప్రిల్ 23, కమాన్ పూర్ మండలంలోని నాలుగు పాఠశాలలు ఎఫ్ ఎల్ ఎన్ కు ఎంపికైనట్లు జిల్లా విద్యాధికారి డి మాధవి తెలిపారు. ఎంపికైన పాఠశాలల కు ఎంపిక పత్రాలను జిల్లా విద్యాధికారి మాధవి రాజాపూర్ పాఠశాల హెచ్ఎం మెరుగు రాజమౌళికి అందజేశారు. 2024-25 విద్యా సంవత్సరం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ప్రతిష్టాత్మకంగా (ఎఫ్ ఎల్ ఎన్) ప్రాథమిక భాష మరియు గణిత సామర్థ్యాల బోధన భాగంగా జిల్లా విద్యాధికారి డి మాధవి ఆధ్వర్యంలో అన్ని పాఠశాలలో కనీస సామర్థ్యాలను పెంపొందించే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం జరిగింది. ఇందులో భాగంగా బేస్ లైన్ మిడ్లైన్ మరియు ఎండ లైన్ పరీక్షలను జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నిర్వహిస్తూ డిఆర్పీలు మరియు స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు మండల విద్యాధికారులు పకడ్బందీ పర్యవేక్షణ చేస్తూ కార్యక్రమం యొక్క విధి విధానాలు ఏ విధంగా అమలుపరచబడుతున్నాయో పరిశీలిస్తూ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు తగిన సూచనలు చేస్తూ కార్యక్రమాన్ని కొనసాగించడం జరిగింది. అంతే పరీక్ష తదనంతరము కమాన్ పూర్ మండలం నుండి నాలుగు పాఠశాలలు ఎంపీపీ ఎస్ రాజాపూర్ ఎంపీపీ ఎస్ ములకలపల్లి ఎంపీపీ ఎస్ గొల్లపల్లి మరియు ఎంపీ యుపిఎస్ నాగారం పాఠశాలలో చాంపియన్లుగా ఎన్నికవ్వడం జరిగింది. మంగళవారం పెద్దపల్లి కలెక్టర్ ఆడిటోరియంలో ఈ పాఠశాలల యొక్క విద్యార్థుల సామర్థ్యాలను ప్రత్యక్షంగా అధికారుల ముందు ప్రదర్శన చేసి పరీక్షించడం మరియు అభినందించడం జరిగినది.

## చైనా టూ అమెరికా..వయా కొరియా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రపంచ దేశాలపై ప్రతీకార సుంకాలు విధించారు. ఏప్రిల్ 2న రష్యా, ఉత్తర కొరియా మినహా మిగతా దేశాలపై ఈ టారిఫ్‌లు అమలులోకి వస్తాయని ప్రకటించారు. తర్వాత వారానికే టారిఫ్‌ల అమలు మూడు నెలలు వాయిదా వేశారు. అయితే అమెరికా సుంకాలకు ప్రతీకారంగా చైనా కూడా సుంకాలు విధించడం.. అమెరికా బెదిరింపులకు భయపడకపోవడంతో చైనాపై భారీగా సుంకాలు విధించారు. ప్రస్తుతం చైనా దిగుమతులపై 245 శాతం సుంకాలు అమలు చేస్తోంది. దీంతో చైనా సుంకాల భారం తప్పించుకునేందుకు కొత్త దారులు వెతుకుతోంది.అమెరికా చైనాపై 245 శాతం ప్రతీకార సుంకాలు విధించింది. ప్రపంచ వ్యాప్తంగా సుంకాల అమలు మూడు నెలలు వాయిదా వేసినా.. చైనాపై మాత్రం అమలు చేస్తోంది. దీంతో చైనా టారిఫ్‌ల భారం తప్పించుకునేందుకు అడ్డదారులు వెతుకుతోంది. ఇటీవల దక్షిణ కొరియాపై అమెరికా 25% టారిఫ్‌లు విధించింది. అయితే ఈ టారిఫ్‌లు ప్రస్తుతం అమలు ఆవడం లేదు. దీంతో చైనా తన ఉత్పత్తులను 'మేడ్ ఇన్ కొరియా' అని లేబుల్ చేసి, అమెరికా మార్కెట్‌లోకి చొప్పించేందుకు ప్రయత్నిస్తోంది. ఈ చర్య ద్వారా చైనా ఉత్పత్తులు తక్కువ టారిఫ్‌లతో అమెరికాలోకి ప్రవేశించే అవకాశం ఉంది, ఇది దక్షిణ కొరియా ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపవచ్చు.దక్షిణ కొరియా కస్టమ్స్ అధికారులు ఈ సమస్యను గుర్తించి, అమెరికా అధికారులతో సంయుక్త దర్యాప్తును ప్రారంభించారు. ఈ దర్యాప్తు ద్వారా చైనా ఉత్పత్తులపై తప్పుడు లేబులింగ్‌ను అడ్డుకోవడం, అలాగే అంతర్జాతీయ వాణిజ్య నిబంధనల ఉల్లంఘనను నిరోధించడం లక్ష్యంగా ఉంది. ఈ సమస్య వల్ల దక్షిణ కొరియా ఉత్పత్తుల పరిశ్రమలకు ఆర్థిక నష్టం, అలాగే అమెరికాతో వాణిజ్య సంబంధాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది.చైనా ఈ విధమైన వ్యూహాలను అవలంబించడం వల్ల అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలకు భంగం కలుగుతుంది. ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనల ప్రకారం, ఉత్పత్తి యొక్క మూలం స్పష్టంగా తెలియజేయాలి. చైనా ఈ నిబంధనలను ఉల్లంఘిస్తూ, తప్పుడు లేబులింగ్‌తో అమెరికా మార్కెట్‌ను ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. ఇది దక్షిణ కొరియాతో పాటు ఇతర దేశాల వాణిజ్య సంబంధాలపై కూడా ప్రభావం చూపవచ్చుదక్షిణ కొరియా మరియు అమెరికా ఈ సమస్యను నిశితంగా పరిశీలిస్తున్నాయి. చైనా ఉత్పత్తులపై కఠిన తనిఖీలు, అలాగే అంతర్జాతీయ సమాజంతో కలిసి చైనాపై ఒత్తిడి తీసుకొచ్చే అవకాశం ఉంది. ఈ సంఘటన వాణిజ్య యుద్ధాలను మరింత తీవ్రతరం చేసే అవకాశం ఉంది, దీని పర్యవసానాలు ఆసియా మరియు పశ్చిమ దేశాల ఆర్థిక వ్యవస్థలపై పడవచ్చు. ఈ సమస్య అంతర్జాతీయ వాణిజ్యంలో నీతి, నిజాయితీల ప్రాముఖ్యతను మరోసారి గుర్తు చేస్తోంది.


## నేడు జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

గ్రామాల అభివృద్ధి ప్రక్రియలో పంచాయితీ రాజ్ సంస్థలు పోషించే పాత్ర ఏమిటో ప్రజలకు అవగాహన కలిగించడం కోసం కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ అధ్వర్యంతో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం నిర్వహించబడుతుంది. 2010 నుంచి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 24 వ తేదీన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నారు. పంచాయతీ రాజ్ సంస్థలకు రాజ్యాంగ గుర్తింపుకు ఉద్దేశించిన '73 వ రాజ్యాంగ సవరణ చట్టం' 1993 ఏప్రిల్ 24 నుండి అమలులోకి వచ్చింది. దీనికి గుర్తుగా ప్రతి సంవత్సరం ఏప్రిల్ 24 వ తేదీన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తారు. ఆంధ్రప్రదేశ్ లో 73వ రాజ్యాంగ సవరణ చట్టం 1994 ఏప్రిల్ 24 నుంచి అమల్లోకి వచ్చింది. గ్రామస్థాయిలో అమల్లో ఉండే అతి ప్రాచీన పాలనా వ్యవస్థే పంచాయతీ. దీన్నే స్థానిక స్వపరిపాలనా సంస్థల వ్యవస్థ, పంచాయతీరాజ్ వ్యవస్థ అని కూడా అంటారు.గ్రామ రాజ్యం ద్వారా రామరాజ్యం ఏర్పాటు చేయాలని గాంధీజీ కలలు కన్నారు.ఆయన దృష్టిలో ప్రతి గ్రామపంచాయతీ ఒక చిన్న గణతంత్ర రాజ్యం. దేశాభివృద్ధికి మూలం గ్రామాభివృద్ధే. అందువల్ల గ్రామాభ్యుదయానికి గ్రామపంచాయతీల ఏర్పాటు, వాటికి విస్తృత అధికారాలు ఇవ్వడానికి రాజ్యాంగం ప్రాధాన్యం ఇచ్చింది.పంచాయతీరాజ్ వ్యవస్థలో గ్రామాల అభివృద్ధికి ఆ గ్రామ ప్రజలే పాటుపడటానికి వీలు కల్పించారు. ప్రాచీన కాలంలో పనిచేస్తున్న గ్రామపాలన వ్యవస్థ అప్పటి సాంఘిక పరిస్థితులకు అనుగుణంగా అయిదు ప్రధాన వృత్తుల ప్రతినిధులతో పనిచేసేది. అయితే ఇది ఎక్కువగా అణిచివేతకు గురయ్యేది. బ్రిటిష్ పాలనా ప్రారంభంలో అంతగా ఆదరణకు నోచుకోకపోయినప్పటికీ జనరల్ గవర్నర్ 'రిప్పన్' ప్రోత్సాహంతో స్థానిక స్వపరిపాలనా సంస్థలు పునరుజ్జీవనం పొందాయి. 1919, 1935 భారత ప్రభుత్వ చట్టాలు కొంతమేరకు వీటికి బలాన్ని చేకూర్చాయి.భారతదేశంలో మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రారంభించిన తొలి రాష్ట్రం రాజస్థాన్ కాగా, ఆంధ్రప్రదేశ్ రెండోది. 1959 నవంబరు 1న ఆంధ్రప్రదేశ్లోని మహబూబ్నగర్ జిల్లా షాద్నగర్లో ఈ వ్యవస్థను ప్రారంభించారు.73వ రాజ్యాంగ సవరణకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1994లో కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని చేసింది. ప్రస్తుత వ్యవస్థ దీనికి అనుగుణంగా ఉంది.కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ రాష్ట్రాల మంత్రిత్వ శాఖలతో దీనికి సంబంధించిన కార్యక్రమాలను చేపడుతుంది.ఏప్రిల్ 24ను పంచాయతీరాజ్ దినంగా పాటిస్తున్నారు.

## కోట్లాది భక్తులకు ఆధ్యాత్మిక గురువు భగవాన్ శ్రీ సత్య సాయి బాబా

### -నేడు బాబా వర్ధంతి



( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

కోట్లాది భక్తులకు ఆయన ఆధ్యాత్మిక గురువు. ఆయన కులాలకు, మతాలకు అతీతంగా నిలిచారు. ఆయన భక్తులలో హిందువులతో పాటు ముస్లింలు, క్రిస్టియన్లు కూడా చాలామంది ఉన్నారు. సత్యసాయి బాబా వారు సత్యనారాయణ రాజుగా 1926 నవంబరు 23న పెద్ద వెంకప్ప రాజు, ఈశ్వరమ్మ దంపతులకి, ఓ నిరుపేద వ్యవసాయ భట్టు రాజుల కుటుంబంలో అనంతపురం జిల్లా లోని, పుట్టపర్తి అనే కుగ్రామంలో జన్మించాడు. బాబాకు నలుగురు సోదరులు, ఇద్దరు సోదరీమణులు. బాబా చిన్న వయసులోనే చాలా అద్బుతాలు చేశాడని చెబుతారు. చిన్న వయసులోనే బాబా అపర మేధావి, సేవాభావం గల వ్యక్తిగా ముద్ర పడ్డారు. అపర మేధావి అయిన బాబాకు నాట్యంలో, సంగీతంలో, రచనలలో మంచి పట్టు ఉంది. బాబా స్వయంగా పాటలు, పద్యాలు రాసి భక్తులను వినిపించాడు. 1940వ సంవత్సరం మార్చి 8వ తేదిన తన సోదరుడు శేషమ రాజుతో కలిసి ఉరవకొండలో ఉన్న సమయంలో బాబాను ఓ తేలు కుట్టిందంట. ఆ సమయంలో బాబా తన స్పృహను కోల్పోయారంట. తేలు కుట్టిన కొద్ది రోజులకు బాబా బిహేవియర్‌లో మార్పు వచ్చింది. తనకు తాను నవ్వుకోవడం, ఏడ్వటం, అప్పటికప్పుడే నిశ్శబ్దంగా మారి పోవడం చేసేవారు. ఆ సమయంలో ఇతను తనకు ఇంతకుముందు ఏ మాత్రం పరిజ్ఞానం లేని సంస్కృతంలో పాటలు పాడేవారు. బాబా పరిస్థితి చూసి వైద్యులు హిస్టేరియా అని నమ్మేవారు. దీంతో చేసేది లేక బాబా తల్లిదండ్రులు బాబాను పుట్టపర్తికి తీసుకు వచ్చారు. వారు బాబాను అనేకమంది వైద్యుల వద్దకు, ఆధ్యాత్మిక గురువుల వద్దకు తీసుకు వెళ్లారు.మే 23 1940లో బాబా చేసిన ఓ చర్య వల్ల బాబా తండ్రి బాబాను ఓ అద్వితీయ మహోన్నతుడుగా భావించాడు. బాబా తండ్రి ఓ కర్ర తీసుకొని నీవెవరు అని అడిగాడు. అప్పుడు బాబా తాను షిరిడీ సాయిబాబా ప్రతిరూపాన్ని అని చెప్పాడు. ఆ తర్వాత బాబా తనకు ఎవరితోనూ సంబంధం లేదని చెప్పారు. తాను షిర్డీ సాయికి ప్రతిరూపం అని చెప్పడం, తనకు ఎవరితోనూ సంబంధాలు లేవని చెప్పడంతో ఆయనకు భక్తులు తయారవడం ప్రారంభం అయింది. పద్నాలుగేళ్లకే బాబా ఆధ్యాత్మిక మార్గం పట్టారు. ఆ తర్వాత సత్యసాయి మద్రాసుకు, దక్షిణ భారతంలో పర్యటనలు ప్రారంభించారు. దీంతో తొందరగానే ఆయనకు భారీ సంఖ్యలో భక్తులు తయారయ్యారు. 1944వ సంవత్సరంలో భక్తులు బాబా స్వగ్రామం పుట్టపర్తిలో ఓ మందిరాన్ని నిర్మించారు. ఆ తర్వాత 1948లో ప్రారంభం అయిన ప్రశాంతి నిలయం 1950కి పూర్తయింది. 1957వ సంవత్సర కాలంలో బాబా ఉత్తర భారత దేశ దేవాలయాల సందర్శనకు వెళ్లారు. 1954లోనే బాబా చిన్న పాటి గ్రీన్ హాస్పిటల్‌ను పుట్టపర్తిలో నిర్మించారు. 1963లో బాబాకు నాలుగుసార్లు గుండెనొప్పి వచ్చింది. ఆ సమయంలో బాబా తాను మరణించాక కర్ణాటకలో ప్రేమసాయి అవతారం ఎత్తుతానని చెప్పారు.ఆ తర్వాత 1968 జూన్ 29న బాబా మొదటిసారి విదేశాలకు వెళ్లారు. ఉగండా, నైరోబీ తదితర దేశాలకు వెళ్లారు. ఆయా దేశాలకు వెళ్లిన బాబా తాను ఏ మతపరంగా రాలేదని ప్రేమను పంచడానికే వచ్చానని చెప్పారు. తనవైపు ఎవరినీ తిప్పుకోవడానికి, ప్రలోభ పెట్టడానికి రాలేదని, కేవలం ప్రేమ పంచి, ఎవరిపై వారికి నమ్మకం కలిగించడానికే వచ్చానని ఆయా దేశాలలో చెప్పేవారు.మన రాష్ట్రం రాజధానిలో ప్రసిద్ధి పొందిన శివం మందిరాన్ని 1973లో ఎస్టాబ్లిష్ చేశారు. అలాగే 1981 జనవరి 19న చెన్నైలో సుందరం మందిరాన్ని ప్రారంభించారు. 1995లో రాయలసీమ ప్రాంతంలో బాబా నీటి ప్రాజెక్టు పనులు చేపట్టారు. 2001లో పుట్టపర్తిలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించారు. బాబా 2005వ సంవత్సరం నుండి వీల్ చైర్‌కే పరిమితం అయ్యారు. తాను దేహం కలవాడిని కాదని, దేహిని అని చెప్పారు. తాను నిర్మాణం చెందినప్పటికీ మళ్లీ పుడతానని పలు సందర్భాలలో చెప్పారు. అయితే భక్తుల ప్రార్థనలే తనకు ప్రాణం అని కూడా చెప్పారు. ప్రతి దేహం గిట్టక తప్పదని చెప్పారు.బాబా తన భజనల సీడీలను చాలా విడుదల చేశారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది భక్తులను, వేల సేవాకేంద్రాలు, ప్రజలకు నీటి సౌకర్యం కల్పించిన శ్రీ భగవాన్ సత్యసాయి బాబ తాను స్థాపించిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లోనే గత నెల 28న మంచాన పడ్డారు. 28 రోజుల అనంతరం బాబా ఆదివారం ఏప్రిల్ 24న ఉదయం 7.40 నిమిషాలకు నిర్యాణం చెంది బాబా భక్తులలో విషాదం నింపారు.

## వేసవి కాలంలో తల్లితండ్రులు మీ పిల్లల పట్ల జాగ్రత్త వహించాలి

### వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనా రెడ్డి.

గోదావరిఖనివేసవి కాలంలో తల్లిదండ్రులు మీ పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలి.పాఠశాలలకు సెలవులు రావడంతో పిల్లల పట్ల తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎంత పనిలో ఉన్నా సరే పిల్లలపై ఓ కన్నేసి ఉండాలి. పిల్లల పట్ల అప్రమత్తంగా లేకుంటే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ప్రమాదం జరగకుండా ముందస్తుగానే జాగ్రత్తలు పాటించడం మంచిదని గోదావరిఖని 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి తల్లితండ్రులకు సూచించారు. బుధవారం నుండి పాఠశాలలకు వేసవి సెలవులు సందర్భంగా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో స్కూల్ హెడ్ మాస్టర్ మల్లేశం గారి ఆధ్వర్యంలో విద్యార్థని విద్యార్థుల తల్లితండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశం లో గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి పాల్గొని ఈ సందర్భంగా తల్లిదండ్రులకు పలు సూచనలు జాగ్రత్తగా తెలియజేయడం జరిగింది. పిల్లలను బావుల్లో, అలాగే చెరువుల్లో ఈత కొట్టేందుకు పంపించకండి..అవసరమైతే ఈత నేర్పించాలి అంటే మీరే స్వయంగా వారికి తోడుగా వెళ్లండి. మైనర్ పిల్లలకు మోటార్‌సైకిల్ నడపమని వారి చేతికి తాళాలు ఇవ్వకండి. వారికి తాళాలు కనిపించకుండా ఉండేలా జాగ్రత్త తీసుకోండి.మొబైల్ ఫోన్‌లు, ట్యాబ్‌లు వారి చేతికి ఇవ్వకండి. సోషల్ మీడియా వాడకం వలన ప్రమాదం లో పడే అవకాశం ఉంది. తెలియని వారు పంపిన మెసేజ్ లు, ఫోన్ కాల్స్, లింక్ లు ఓపెన్ చేసి సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయే అవకాశం ఉందన్నారు.స్నేహితులతో కలిసి దూరప్రాంతాలకు పంపకండి. చేడు స్నేహితుల వలన చేడు అలవాట్ల కు బానిసలుగా మారి భవిష్యత్తు జీవితాలు నాశనం చేసుకొనే అవకాశం ఉందన్నారు. మధ్యాహ్న సమయంలో ఆరుబయట ఆడుకోవడానికి అనుమతించకండి. ఉదయం మరియు సాయంత్రం వేళల్లో మాత్రమే ఆడుకోవడానికి వారికి అనుమతినివ్వండి. ఇంట్లో పెద్దలతో వారు ఎక్కువ సమయం గడిపేలా చూడండి. వీలైనంత వరకు పిల్లలను ఇంట్లోనే ఉంచుకుని మన సంప్రదాయాలను నేర్పించాలి. సంప్రదాయ పనులు గురించి వారికి చెప్పాలి. ఇలా పైన పేర్కొన్న జాగ్రత్తలు పాటించినట్లయితే ఈ వేసవి సెలవులు ఇట్టే గడిచిపోతాయి. సంప్రదాయ పనులు చెప్పాలి. పైన పేర్కొన్న జాగ్రత్తలు పాటిస్తే ఈ వేసవి సెలవులు ఇట్టే గడిచిపోతాయి అని సీఐ ఇంద్రసేనారెడ్డి తల్లితండ్రులకు సూచించారు.ఈ సమావేశం లో స్కూల్ టీచర్స్, తల్లితండ్రులు పాల్గొన్నారు.

## విజయవంతంగా శస్త్ర చికిత్సలు

### అభినందనలు తెలిపిన జిల్లా కలెక్టర్

పెద్దపల్లి పలు క్లిష్టమైన శస్త్ర చికిత్సలను విజయవంతంగా జిల్లా ఆసుపత్రిలో నిర్వహిస్తున్న వైద్యులను జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అభినందించారు. కరీంన గర్ జిల్లా మానకొండూరు మండలం అన్నారం గ్రామానికి చెందిన 92 ఏళ్ల గొట్టేముక్కల వీర రెడ్డి ఎడమ వైపు తుంటి ఎముక ఫ్రాక్చర్ తో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ నెల 12న అడ్మిట్ అయ్యారని, ఎక్కువ వయస్సు, రెండు కిడ్నీ లు సరిగా పని చేయకపోవడం, గుండె పని తీరు సామర్థ్యము సగం మాత్రేమే ఉండటం, కిడ్నీల పనితీరు తక్కువగా ఉండటంతో ఇతని ఇద్దరు కొడుకుల సమ్మతితో క్లినికల్ కార్డిలోజిస్ట్ తో 2 డి ఎకో పరీక్షలు, ఇతర రక్త పరీక్షలు నిర్వహించి డా కే. శ్రీనివాస్ రెడ్డి, డా. కృష్ణవేణి, డా. భవాని, డా. రామం, డా. కె. శ్రీధర్, సూపరింటెండెంట్ పర్యవేక్షణలో 22న శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారని తెలిపారు. అలాగే సుల్తానాబాద్ పట్టణంలోని దుర్గా నగర్ కు చెందిన 32 ఏళ్ల ఆసియా తబస్సుము షైక్ తీవ్రమైన కడుపు నొప్పితో ప్రైవేట్ ఆసుపత్రిలో సంప్రదించగా కడుపులో గర్భ సంచి పక్కన వున్నా ట్యూబ్ లో గర్భము ఏర్పడిందని చెప్పారని, తరువాత అది పగిలిపోయి తీవ్ర రక్త స్రావముతో పెద్దపల్లి మాత శిశు ఆసుపత్రిలో సంప్రదించారు. డ్యూటీలో ఉన్న డాక్టర్లు ప్రియాంక, రామం, శ్రీధర్, సూపరింటెండెంట్ సకాలంలో స్పందించి సదరు మహిళాకు అవసరమైన రక్త పరీక్షలు నిర్వహించి పేషెంట్ కి కౌన్సెలింగ్ ఇచ్చి, రక్తాన్ని ఏర్పాటు చేసి 22 న క్రిటికల్ శస్త్ర చికిత్స నిర్వహించి మహిళా ప్రాణాలు కాపాడారని తెలిపారు. క్లిష్టమైన శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందానికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. జిల్లా ఆసుపత్రిలో, ఎం సి హెచ్ లో ఆధునిక వైద్యం అందుబా టులోకి వచ్చిందన్నారు. ప్రతి గర్భిణీకి 2డి ఈకో తో పాటుగా ప్రతి ఆర్గాన్ ని పరీక్షించే టిఫా స్కాన్లను అందుబాటులో కి తీసుకు వచ్చామని, కష్టతర మైన శస్త్ర చికిత్సలను సైతం విజయవంతంగా నిర్వహిస్తు న్నామని, దీనిని ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

# కేశినేని బ్రదర్స్ మధ్య వార్

విజయవాడ, ఏప్రిల్ 23, బెజవాడ రాజకీయాలు మళ్లీ హీటెక్కాయి. కేశినేని నాని, కేశినేని చిన్నిల మధ్య మళ్లీ ట్వీట్ల యుద్ధం మొదలయింది. విశాఖపట్నంలో ఉర్సా క్లస్టర్ కంపెనీకి భూములను కేటాయించడంపై కేశినేని అభ్యంతరం తెలిపారు. ఈ మేరకు చంద్రబాబు నాయుడును ట్యాగ్ చేస్తూ ట్వీట్ చేశారు. ఉర్సా క్లస్టర్ కంపెనీకి ఒక విశ్వసనీయత లేదని, 2025లో స్థాపించిన సంస్థ కావడంతో దానికి అతి తక్కువ ధరకు భూములను కేటాయించడంపై కేశినేని నాని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనివల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని తెలిపారు. ఈ సంస్థకు ఇచ్చిన భూముల కేటాయింపులను రద్దు చేయాలని కూడా కేశినేని నాని కోరారు. దీనిపై అనేక విమర్శలు కూడా వెల్లువెత్తుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు... విశాఖపట్నంలో అతి తక్కువ ధరకు ఉర్సా క్లస్టర్ కంపెనీకి అరవై ఎకరాలు కేటాయించడం ఇప్పటికే విమర్శలకు తావిచ్చింది. ఊరూ పేరులేని సంస్థకు అంత విలువైన భూములను ఎలా అప్పగిస్తారని జాతీయ మీడియాలో సయితం కథనాలు ప్రసారమయ్యాయి. 2025లో కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత స్థాపించిన పరిశ్రమకు అంత పెద్ద సంఖ్యలో భూముల ఎలా కేటాయిస్తారన్న ప్రశ్నలు బాగా వినపడుతున్నాయి. ఈ నేపథ్యంలో నిన్న చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా కేశినేని నాని ఆయనకు బర్త్ డే విషెస్ చెప్పారు. 2024లో తనకు సీటు దక్కకపోవడంతో కేశినేని నాని టీడీపీని వీడి వైసీపీలో చేరారు. వైసీపీ నుంచి పోటీ చేసినా విజయవాడ పార్లమెంటు ప్రజలు మూడో సారి ఆదరించలేదు దీంతో మళ్లీ కేశినేని నాని



చంద్రబాబుకు దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నారన్న ప్రచారం జరగుతుంది. ఈ నేపథ్యలోనే ఆయన బర్త్ డే కి నిన్న ట్వీట్ చేసి నేడు మరో ట్వీట్ తో ఆయన సోదరుడు ప్రస్తుత ఎంపీ కేశినేని చిన్ని పితూరీలు చెప్పేందుకు సిద్ధమయ్యారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. కేశినేని నాని, కేశినేని చిన్నిలు అన్నదమ్ములయినప్పటికీ ఇద్దరి మధ్య ఆస్తుల వివాదాలతో పాటు రాజకీయ వైరుధ్యాలు ఉండటంతోనే ఈ ట్వీట్ వార్ స్టార్ట్ చేశారంటూ టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న ఆరోపించారు. ఉర్సా క్లస్టర్ సంస్థ కేశినేని చిన్నికి చెందిందని, దానికి అంత పెద్ద సంఖ్యలో భూములు కేటాయించడాన్ని కేశినాని నాని తప్పు పట్టడం ఇప్పుడు బెజవాడ పాలిటిక్స్ లో హీట్ ను రాజేసినట్లయింది. కేశినేని చిన్నికి సంబంధించిన సంస్థ కాబట్టే తక్కువ ధరకు అరవై ఎకరాల విలువైన భూములను కేటాయించారన్న అర్థం వచ్చే రీతిలో కేశినేని నాని ట్వీట్ చేయడం టీడీపీ నేతల ఆగ్రహానికి గురి చేసింది. అయితే దీనిపై బుద్ధా వెంకన్న మినహా ఎవరూ స్పందించక పోయినా కేశినేని నాని మరోసారి తన సోదరుడు చిన్నిని లక్ష్యంగా చేసుకుని ఈ ట్వీట్ చేశారంటూ పెద్దయెత్తున సోషల్ మీడియాలో టీడీపీ నేతలు ధ్వజమెత్తుతున్నారు. నారా లోకేశ్ పేరును కూడా కేశినేని చిన్ని మద్యం, ఇసుక వంటి కేసుల్లో బయటకు తెస్తున్నారని కూడా కేశినేని నాని ట్వీట్ చేయడం ఇప్పుడు తెలుగుదేశం పార్టీలోనే కాదు.. కూటమి పార్టీల్లోనూ చర్చనీయాంశమైంది. మరోసారి బ్రదర్స్ మధ్య వార్ మళ్లీ మొదలయినట్లేనని విశ్లేషకులు చెబుతున్నారు

## తియ్యని పండ్ల వెనుక చేదు నిజాలు.



విజయవాడ, ఏప్రిల్ 23, నూజివీడు.. మామిడి పండ్లకు కేరాఫ్ అడ్రస్. నూజివీడు ప్రాంతంలో దాదాపు 40 వేల ఎకరాల్లో మామిడి పంటను సాగు చేస్తున్నారు. ఇక్కడ కాయలు కోయకముందే వ్యాపారులు రైతులతో ఒప్పందం చేసుకొని తోటలను కొనుగోలు చేస్తారు. ఆ పంట వరకు డబ్బులు చెల్లించి.. కోత మొదలు పెడతారు. దీంతో రైతులకు పండ్లతో సంబంధం ఉండదు. కేవలం పండించడమే వారి బాధ్యత. ఇదంతా ఎలా ఉన్నా.. అసలు సమస్య అక్కడే మొదలవుతోంది. వ్యాపారులకు విక్రయించని రైతులు.. పండ్ల పండాక కోసి.. మార్కెట్లకు తరలిస్తారు. కానీ.. వ్యాపారులు కొనుగోలు చేసిన తోటల్లో.. పండ్లు పూర్తిగా పండకముందే.. కోస్తున్నారు. వాటికి రసాయనాలు పూసి.. తొందరగా పక్వానికి వచ్చేలా చేస్తున్నారు. ఇలా చేయడంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. వాటిని ఇతర పట్టణాలు, నగరాలకు తరలించి విక్రయిస్తున్నారు. రసాయనాలతో పక్వానికి తెచ్చిన పండ్లను తింటే ఆరోగ్య సమస్యలు బారినపడే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి పండ్లను తీసుకోవడం ద్వారా.. క్యాన్సర్, అల్సర్, లివర్, కిడ్నీ, జీర్ణ సంబంధిత వ్యాధులు, కాళ్లు, చేతులు తిమ్మిర్లు, నరాల బలహీనతలకు గురయ్యే ప్రమాదం ఉంది. కాల్షియం కార్బైడ్ ద్వారా వెలువడే ఎసిటిలిన్ వాయువు.. నాడీ వ్యవస్థ మీద ప్రభావం చూపి తలనొప్పి, దీర్ఘకాలిక మత్తు, శక్తిని కోల్పోయే ప్రమాదముంది. చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గి శ్వాస సంబంధిత ఇబ్బందులు తలెత్తుతాయి. 2011 ఆహార భద్రత, ప్రమాణాల నిబంధనలు ప్రకారం.. ప్రభుత్వం కార్బైడ్, ఎసిటిలిన్ రసాయనాలను నిషేధించింది. సహజంగా పండించే ఇథిలిన్‌ను మాత్రమే కొంత వరకు వినియోగించేందుకు అనుమతిచ్చింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. సుమారు 20 కిలోల పండ్లకు 5 గ్రాముల ఇథిలిన్‌ను వినియోగించాల్సి ఉంటుంది. మేలిమి పండులా కనిపించేందుకు వ్యాపారులు కార్బైడ్‌ను వినియోగిస్తున్నారు. ఆమోదించిన ఇథిలిన్‌తో పోలిస్తే కార్బైడ్, ఇతర రసాయనాలు మార్కెట్‌లో చౌకగా లభిస్తుండటంతో వీటిని వ్యాపారులు ఇష్టానుసారంగా వాడుతున్నారు.'కృత్రిమంగా పండించిన పండ్లను తిన్న వారికి వాంతులు, విరేచనాలు, దాహం ఎక్కువగా కావటం, కడుపులో తిప్పటం వంటి సమస్యలు వస్తాయి. మామిడి పండ్లను తినే ముందు ఉప్పు నీటిలో కడగాలి. కృత్రిమంగా పండించిన పండ్లను సాధ్యమైనంత వరకు తినకపోవడం మంచిది' అని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# అనంత వైసీపీలో వర్గపోరు

అనంతపురం, ఏప్రిల్ 23,అనంతపురం ఉమ్మడి జిల్లాలో పెనుగొండ తెలుగుదేశం పార్టీకి అత్యంత పట్టున్న నియోజకవర్గం. అలాంటి చోట 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చిన సమయం లోనే పెనుకొండ లో కూడా మొట్టమొదటి సారి వైసిపి బోణీ కొట్టింది. దీంతో సరాసరి పెనుకొండ ఎమ్మెల్యే శంకర్ నారాయనకీ సైతం జగన్ రెడ్డి మంత్రి పదవి కూడా కట్టబెట్టారు. ఇక్కడి వరకు అంతా సవ్యంగానే జరిగింది. తాను ఒకటి తలిస్తే దైవం మరొకటి తలచిందన్న చందంగా జగన్ రెడ్డి చేసిన ప్రయోగం బెడిసికొట్టింది. అనంతరం 2024 ఎన్నికల్లో శంకర్ నారాయణ కాదని అదే సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి కళ్యాణదుర్గం నియోజకవర్గం ఎమ్మెల్యే ఉషశ్రీ చరణ్‌నుకు చాన్స్ ఇచ్చారు. పెనుగొండ నియోజకవర్గం బీసీకి ( కురుబ ) కంచుకోట అలాంటి నియోజకవర్గంలో ఎప్పుడు తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేస్తూ వచ్చింది. వైయస్ ఆర్ పార్టీ ఆవిర్భావం నుంచి కూడా జగన్మోహన్ రెడ్డికి వెన్నంటే ఉంటూ వస్తున్న కృప శంకర్ నారాయణ కు 2019 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి జగన్ బరిలో నిలిపాడు. ఆ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బి కే పార్థసారధి పై శంకర్ నారాయణ అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. అనంతరం శంకర్ నారాయణ కు జగన్మోహన్ రెడ్డి మంత్రి పదవిని కూడా కేటాయించారు. 2024 ఎన్నికల్లో శంకర్ నారాయణ ను అనంతపురం పార్లమెంటు అభ్యర్థిగా బరిలోకి దింపి అదే సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి కళ్యాణదుర్గం నియోజకవర్గం ఎమ్మెల్యే ఉషశ్రీ చరణ్ ను పెనుగొండ నియోజకవర్గం వైఎస్ఆర్సిపి అభ్యర్థిగా జగన్మోహన్ రెడ్డి ప్రకటించారు. కానీ ఆమె పరాజయం పాలయ్యారు. 2024 ఎన్నికల ఓటమి అనంతరం వైయస్సార్సీపీలో వర్గ విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. బలమైన అభ్యర్థి శంకర్ నారాయణ కాదని ఉ షాశ్రీ చరణ్ కు టికెట్ కేటాయించినప్పటి నుంచి కూడా పెనుగొండ నియోజకవర్గం లో వర్గ విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. నియోజకవర్గ ఇన్చార్జిను మార్చాలన్న ప్రతిపాదన జగన్ వరకు వెళ్లినట్లు



తెలుస్తోంది.ప్రస్తుతం ఉషశ్రీ చరణ్ శ్రీ సత్యసాయి జిల్లా వైసీపీ పార్టీ అధ్యక్షురాలుగా కూడా కొనసాగుతున్నారు. పెనుగొండ నుంచి పరిటాల రవీంద్ర మూడు సార్లు వరుసగా విజయం సాధించారు. ఆయన హత్య తర్వాత రవి భార్య పరిటాల సునీత ఒక్కసారి పెనుగొండ నుంచి గెలుపొందారు. మొత్తంగా ఇప్పటివరకు 8 సార్లు పెనుగొండ నుంచి టీడిపి విజయం సాధించింది. ఉషాశ్రీచరణ్‌ను పెనుగొండకు మార్చిన జగన్ 2019 ఎన్నికల్లో మాజీ మంత్రి శంకర నారాయణ వైసీపీ నుంచి గెలుపొందారు. ఆ తర్వాత పరిణామాలు మారిపోయాయి. అనంతపురం ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన శంకరనారాయణ.. తిరిగి పెనుకొండ నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జ్ పదవి ఆశిస్తూ పావులు కదుపుతున్నారణ. మండల స్థాయిలో తన వర్గీయులతో సమావేశాలు పెట్టి మాజీ మంత్రి ఉషాశ్రీ చరణ్‌కు వ్యతిరేకంగా పావులు కదుపుతున్నారంట. పార్టీ అధ్యక్షుడు జగన్, ఇతర పార్టీ పెద్దల వద్దకు వెళ్లి నియోకవర్గ ఇన్చార్జ్ పదవి శంకర్ నారాయణకే ఇవ్వాలని పెనుగొండ సెగ్మెంట్ పరిధిలోని మండలాల నేతలు వత్తిడి తెస్తున్నారు. ఉ ష శ్రీ చరణ్ హైకమాండ్ దగ్గర తన పలుకుబడిని ఉపయోగించి పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తున్నారంటూ శంకరనారాయణ వర్గీయుల్ని కొందర్ని పార్టీ నుంచి సస్పెండ్ చేయించారు. దాంతో పెనుగొండలో వారద్దరి మధ్య పరిస్థితి ఉప్పునిప్పులా తయారైందంటున్నారు . ఎప్పుడో వచ్చే ఎన్నికల కోసం వారిద్దరు అలా కుస్తీ పడుతుంటే.. ఇటీవల వారిద్దరికి పోటీగా మూడో వ్యక్తి సీన్లోకి వచ్చి ఇన్చార్జ్ పదవి కోసం పోటీ పడుతున్నారంట. ఉషాశ్రీ, శంకరనారాయణ లను పెనుగొండ వైసీపీలో సైడ్ చేయడానికి శిల్పా అనే కొత్త నాయకురాలు ప్రయత్నిస్తున్నారనీ టాక్ నడుస్తోంది. ఇప్పటికే పెనుగొండ లో ఇద్దరు మాజీ మంత్రులు శంకర్ నారాయణ , ఉ ష శ్రీ చరణ్ లు రెండు వర్గాలుగా వైసీపీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే ఇన్చార్జ్‌గా ఉష శ్రీ చరణ్ ఏమాత్రం ప్రభావం చూపించలేక పోతున్నారని పార్టీ క్యాడర్ ఆరోపణలు గుప్పిస్తోంది.. క్రమంలో పెనుగొం డ నియోజకవర్గం వైసీపీలో వర్గ విభేదాలను పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఏ విధంగా పరిష్కా రం చూపుతాడో వేచి చూడాల్సి ఉంది.

## జగన్ యూ.. టర్న్ తప్పదా...

ఒంగోలు, ఏప్రిల్ 23, మూడు రాజధానుల నుంచి మద్యం వరకు.. వలంటీర్ వ్యవస్థ నుంచి సచివాలయాల వరకు.. వైసీపీ అధినేత జగన్ చేసిన ప్రయోగాలు వికటించిన విషయం తెలిసిందే. ఇవే.. ఆయనను నిలువునా ముంచాయన్నది మేధావుల నుంచి విశ్లేషకుల వరకు చెబుతున్న మాట. తాను పట్టిన కుందేలుకు మూడు కాళ్లే అన్నట్టుగా ఆయన అప్పట్లో వ్యవహరించారన్న విమర్శలు తెలిసిందే. ఏరాష్ట్రంలోనూ లేని విధంగా మూడురాజధానులు తెచ్చారు. దీనిపైకేంద్రం కూడా విస్మయం వ్యక్తం చేసింది.ఇక, వలంటీర్ వ్యవస్థను తెచ్చామని చెప్పినా.. వారిని పొడిగించని ఫలితంగా ఇప్పుడు వారికి దిక్కు మొక్కు లేకుండా పోయింది.



పైగా ఎన్నికల సమయంలో కీలక నాయకుల కంటే కూడా.. వారే ఎక్కువై పోయారన్నట్టుగా జగన్ వ్యవహరించారు. ఫలితంగా కార్యకర్తలు పోయి..వైసీపీని వలంటీర్లు నడిపించే పరిస్థితి వచ్చింది. ఇదో పెద్ద మైనస్‌గామారి.. ఎక్కడికక్కడ ఓటు బ్యాంకు చీలిపోయింది. ఫలితంగా వైసీపీ నాశనమైంది.ఇక, మరో రెండు కీలక విషయాలు.. మద్య నిషేధం.. చీప్ బ్రాండ్స్‌ను ఎక్కువ ధరలకు విక్రయించడం.. ఈ రెండు కూడా.. వికటించాయి. మద్యనిషేధం పేరుతో మంచి చేశామని జగన్ చెబుతున్నా.. ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారు. ఇక, సచివాలయాలను నిర్మించి.. మంచి చేసినా.. దానివల్ల కూడా ప్రయోజనం రాబట్టుకోలేక పోయారు. సో.. మొత్తంగా జగన్ అనుసరించిన విధానాలు వివాదానికి దారితీశాయి. చివరకు ఆ పార్టీకి మైనస్ పై మైనస్ అయ్యాయి.ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల నాటికి.. జగన్ తన విధానాలను మార్చుకోక తప్పదన్న వాదన బలంగా వినిపిస్తోంది. "ఏం చేస్తారో.. ఏమో.. మా విధానాలు మారాల్సి ఉంది. ఏదీ ఒక్కటీ కూడా వర్కవుట్ కాలేదు. మా నాయకుడు ఆదిశగా అడుగులు వేస్తారని అనుకుంటున్నాం. ఇంకా మూడు రాజధానులని మేం ఎలా చెబుతాం" అని సీనియర్ నాయకుడు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు వ్యాఖ్యలు పరిగణనలోకి తీసుకుంటే.. మార్పు తప్పదన్న సంకేతాలు వస్తున్నాయి. సో.. జగన్‌తన విధానాలను మార్చుకునే టైం త్వరలోనే ఉందని కూడా అంటున్నారు. మరి ఏంచేస్తారు..? కొత్త విధానాలు ఏంటి? అనేది వేచి చూడాలి.

## జోరుగా బెట్టింగ్...

విజయవాడ, ఏప్రిల్ 23, తెలుగు రాష్ట్రాల్లో బెట్టింగ్ భూతం ఎన్నో కుటుంబాలను రోడ్డున పడేసింది. ఎంతోమంది యువత ఆయుష్షును అర్థాంతరంగా ముగిసేలా చేసింది. ఇక ఏపీలోని చాలా బార్‌లలో రోజూ బెట్టింగ్ నడుస్తుంది. ప్రతీదగ్గర స్క్రీన్‌లు వేసి బెట్టింగ్‌లు జోరుగా నడిపిస్తున్నారు. దీంట్లో ప్రజా ప్రతినిధులకు కూడా వాటాలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే వాళ్లవే బార్లు, వాళ్లవే బెట్టింగులు అని తెలుస్తోంది. ఉదాహరణకు ఏలూరులో రైల్వే స్టేషన్ సమీపంలో ఓ బార్ ఉంది. ఓపెన్ ఎయిర్ స్క్రీన్ ఏర్పాటు చేసి.. జోరుగా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది.దీనిపై ఇటీవల తెలంగాణ ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసిన వారిపైనా కేసులు నమోదు చేసింది. ఫలితంగా ఆన్ లైన్ బెట్టింగ్ కాస్త తగ్గింది. కానీ.. ఇన్నాళ్లు బెట్టింగ్ దోపిడీకి పాల్పడ్డ ముఠాలు ఇప్పుడు కొత్త దారిని ఎంచుకున్నాయి.ప్రస్తుతం ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. ఈ సమయంలో ఆన్ లైన్ బెట్టింగ్‌పై గట్టి నిఘా ఉంది. దీంతో బుకీలు రూచ్ మార్చి.. మళ్లీ పాత పద్ధతిని ఎంచుకున్నారు. ఆఫ్ లైన్ బెట్టింగ్ దందా కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా ఏపీ-తెలంగాణ సరిహద్దు పట్టణాల్లో ఈ దందా జోరుగా సాగుతోంది. ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి, అశ్వరావుపేట, మధిర, కొత్తగూడెం, బూర్గంపాడు, భద్రాచలం, వైరా ప్రాంతాల్లో గుట్టుగా బుకీలు దందా సాగిస్తున్నారు.ఇటు నల్గొండ జిల్లాలోని హుజూర్‌నగర్, నల్గొండ, సూర్యాపేట, కోదాడ ప్రాంతాల్లో ఆఫ్ లైన్ బెట్టింగ్ దందా జోరుగా సాగుతోందని తెలుస్తోంది. ఈ ప్రాంతాలకు అటు ఏపీ నుంచి ఇటు తెలంగాణ నుంచి బెట్టింగ్ రాయుళ్లు వస్తున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా బార్లు, చాయ్ కేఫ్‌లు, రెస్టారెంట్లు, లాడ్జీలు ఆఫ్ లైన్ బెట్టింగ్‌కు వేదికలయ్యాయి. చాలా రోజులుగా పోలీసులు ఈ ఆఫ్‌లైన్ బెట్టింగ్‌పై ఫోకస్ పెట్టడం లేదు. దీంతో బుకీలు రెచ్చిపోతున్నారు.ఆఫ్ లైన్ బెట్టింగ్ స్పాట్‌కు తక్కువ మంది వెళ్తున్నారు. అక్కడ ఉన్న బుకీలు, బ్రోకర్లు అమాయకులకు ఫోన్లు చేసి బెట్టింగ్ పెట్టేలా ప్రోత్సహిస్తున్నారు. దీంతో ఈ విష సంస్కృతి మారుమూల పల్లెలకూ పాకింది. నెలకు రూ.10 వేలు సంపాదించే వారు కూడా క్రికెట్ బెట్టింగ్‌కు బానిసలవుతున్నారు. బాల్ టు బాల్, ఓవర్ టు ఓవర్, వికెట్ టు వికెట్.. ఇలా రకరకాలుగా బెట్టింగ్ నడుస్తోంది. ఇప్పటికే ఎంతోమంది డబ్బులు పోగొట్టుకొని చెప్పలేని తిప్పలు పడుతున్నారు.ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లో మోసపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అనధికారిక వ్యక్తులు లేదా సంస్థలు బెట్టింగ్ నిర్వహిస్తే, మీ డబ్బును కోల్పోయే ప్రమాదం ఉంది. గెలిచినప్పటికీ, వారు చెల్లించకపోవచ్చు. ఆఫ్‌లైన్‌లో ఎంత మొత్తం బెట్ వేస్తున్నారో ట్రాక్ చేయడం కష్టం. ఇది ఎక్కువ నష్టపోయేలా చేస్తుంది.

# తెరపైకి బల్లం సుధీర్ పేరు

కడప, ఏప్రిల్ 23, వైసీపీ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల విలువైన మద్యం కుంభకోణంలో నాటి ప్రభుత్వ పెద్దల తరపున అన్నీ తానై వ్యవహరించిన కెసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అలియాస్ రాజ్ కెసిరెడ్డి ఎట్టకేలకు అరెస్టయ్యారు.రాజ్ కెసిరెడ్డి రాజేష్‌రెడ్డి అనే మారు పేరు, నకిలీ గుర్తింపు పత్రాలతో గోవా నుంచి ఇండిగో విమానంలో హైదరాబాద్‌లో దిగారు. విమానాశ్రయంలో అప్పటికే మాటు వేసిన సిట్ అధికారులు పట్టుకున్నారు. అరెస్టు చేసినట్లు కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. శంషాబాద్ నుంచి రాత్రి 11.10 గంటలకు ఆయన్ను విజయవాడ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఉన్న సిట్ కార్యాలయానికి తీసుకొచ్చారు కాగా రాజ్ కెసిరెడ్డి.సిట్ జారీ చేసిన నోటీసుల చట్టబద్ధతను సవాల్ చేస్తూ, ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టు, సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వాటి విచారణలన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. మరోవైపు ఆయనపై లుకౌట్ సర్క్యులర్ జారీ అయింది. మరోవైపు రాజ్ కెసిరెడ్డి విచారణకు ఏ మాత్రం సహకరించకపోవటంతో.. ఆయన కుటుంబసభ్యులు, బంధువులు, బినామీలు, మద్యం కుంభకోణం సొత్తును పెట్టుబడులుగా పెట్టిన సంస్థలు, వాటి డైరెక్టర్ల నివాసాలు, కార్యాలయాల్లో సిట్ అధికారులు ఇటీవల వరుసగా 3 రోజులపాటు సోదాలు నిర్వహించారు. కీలక పత్రాల్ని స్వాధీనం చేసుకున్నారు. ఆయన తండ్రి ఉపేంద్రరెడ్డికి నోటీసులిచ్చారు. ఇలా అన్ని వైపుల నుంచి అష్టదిగ్బంధం చేయడంతో తప్పించుకోవటం సాధ్యం కాదని గుర్తించిన రాజ్ కెసిరెడ్డి.. హైదరాబాద్ నుంచి చెన్నైకు చేరుకుని అక్కడి నుంచి విదేశాలకు వెళ్లిపోవాలని కుట్ర చేశారు. కానీ ఈ లోపు సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.కాగా కసిరెడ్డి విచారణ సందర్భంగా పలువురి పేర్లు బయటకు వచ్చినట్లు తెలుస్తుంది. నిన్న రాత్రి నుంచి కసిరెడ్డిని సిట్‌చీఫ్ రాజశేఖర్ బాబు విచారిస్తున్నారు. ఈవిచారణలో సిట్ చీఫ్‌తో పాటు ఏడుగురు అధికారుల బృందం ఉంది. అయితే వసూళ్ల నెట్‌వర్క్‌తో తనకు సంబంధం లేదని కసిరెడ్డి చెబుతున్నట్లు సమాచారం. గతంలో విజయసాయి, మిథున్ సిట్‌ఎదుట ఇచ్చిన స్టేట్‌మెంట్స్ ఆధారంగా విచారణ జరుగుతోంది. పలు ఆధారాలను చూపిస్తూ సిట్ బృందం ప్రశ్నిస్తున్నట్లు సమాచారం.

ఈ క్రమంలో ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో తెరపైకి బల్లం సుధీర్ అనే పేరు వచ్చింది. ఇతను కసిరెడ్డికి అత్యంత సన్నిహితుడిగా పేరుంది. లావాదేవీలన్నీ సుధీర్ ద్వారానే జరిపినట్టు తెలుస్తుంది. ఇంతకు సుధీర్ ఎవరు అనే కోణంలో అధికారులు కూపీ లాగే పనిలో ఉన్నారు. ఏపీ, తెలంగాణలో ఇసుక మాఫియాలోనూ ఇద్దరూ ఉన్నట్లు ప్రచారం సాగుతుంది. కసిరెడ్డి, సుధీర్ కలిసి వందల కోట్ల రూపాయలు వెనుకేసుకొన్నట్లు సమాచారం. ఈ లిక్కర్ స్కాంలో కేసిరెడ్డి తర్వాత సుధీర్దే కీలకపాత్రఅని అంటున్నారు. సుధీర్ అరెస్ట్ అయితే మరిన్ని సంచలనలు బయటకు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

## పరుగుల రారాజు 'భారతరత్న' సచిన్ టెండూల్కర్

### -నేడు ఆయన జన్మదినం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

ప్రపంచ క్రికెట్ క్రీడా చరిత్రలో ప్రఖ్యాతి గాంచిన భారతీయ ఆటగాడు సచిన్ రమేష్ టెండుల్కర్. క్రికెట్ క్రీడకు భారతదేశంలో అత్యధిక జనాదరణకు కారకుడై, చిన్న పిల్లలు మొదలు ముసలివాళ్ళ మనసులను సైతం దోచుకున్న వర్తమాన క్రికెటర్ టెండుల్కర్ ఏప్రిల్ 24, 1973 న జన్మించాడు. 16-నవంబర్-2013 నాడు తన 40వ ఏట 200వ టెస్ట్ మ్యాచ్ పూర్తి చేసి, అంతర్జాతీయ క్రీడారంగం నుంచి విరమించుకుంటున్న సందర్భంలో భారతప్రభుత్వం అత్యున్నత పౌర పురస్కారమైన భారత రత్నను ఈయనకు ప్రకటించింది. ఈ విధంగా ఈ అవార్డును పొందిన ప్రథమ క్రీడాకారునిగా మరో రికార్డు నెలకొల్పాడు సచిన్ టెండూల్కర్. ఈనాడు భారత్ లో ఈ క్రీడకు ఇంత జనాదరణ ఉందంటే అదంతా సచిన్, అతని ఆట తీరు కూడా ఒక కారణం. 1990 దశకంలో భారత క్రికెట్ లో మెరుపులు మెరిపించి ప్రేక్షకులను ఉర్రూతలూగించిన ఆటగాడు సచిన్. భారత జట్టుకు ఆపద్బాంధవుడిగా ఎన్నో విజయాలు అందజేసిన ఈ ముంబాయికి చెందిన బ్యాట్స్‌మెన్ ను పొగడని వారు లేరనే చెప్పవచ్చు.

# వేసవిలో దొరికే పుచ్చకాయలు...తింటే ఊహించని ఆరోగ్య ప్రయోజనాలు



వేసవిలో ప్రతి ఒక్కరూ బాగా ఇష్టపడేది పుచ్చకాయలు. సీజనల్ ఫ్రూట్ అయిన పుచ్చకాయలలో మన శరీరానికి కావాల్సిన ఎన్నో పోషకాలతో నిండి ఉంటాయి. అలాగే పుచ్చకాయలో నీరు కూడా అధికంగా ఉంటుంది. వేసవిలో మన శరీరానికి కావలసిన చల్లదనాన్ని ఇస్తుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు మరియు నీరు అధికంగా ఉండడంతో రక్తపోటును తగ్గించడానికి దోహదపడుతుంది .అలాగే చర్మకాంతిని మెరుగుపరుస్తుంది. పుచ్చకాయలతో బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు పుచ్చకాయలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఫైబర్ అధికంగా ఉండడంతో జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, వేసవికాలంలో ఎక్కువ మందికి మలబద్ధక సమస్య ఏర్పడుతుంది. ఈ సమస్యతో బాధపడేవారికి పుచ్చకాయ తినడం వలన మలబద్ధక సమస్య నుండి ఉపశమనం కలుగుతుంది. ఎండలో బయటకు వెళ్లే వారు తొందరగా డీ హైడ్రేషన్ కు గురి అవుతూ వుంటారు. అలాంటివారికి వడ దెబ్బ తగలకుండా ఉండేందుకు పుచ్చకాయ సహాయం చేస్తుంది. గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది వేసవిలో ఎక్కువగా గుండె సంబంధిత జబ్బుల బారిన పడుతుంటారు. అలా పడకుండా వుండటానికి పుచ్చకాయ మంచి ఔషధంగా పనిచేస్తుంది పుచ్చకాయలో మెగ్నీషియం తోపాటు భాస్వరం ఉంటుంది. ఇది గుండె పని తీరుని మెరుగుపరుస్తుంది. గుండెకు సంబంధించిన నాళాలు పనిచేయడానికి దోహదపడే పోషకాలు పుచ్చకాయ తినడం వలన శరీరానికి అందుతాయి. పుచ్చకాయలు అలసట నుండి రిలీఫ్ ఇస్తాయి. పుచ్చకాయ తినడం వలన ఈ లాభాలు కూడా కరోనా సంక్షోభం నుండి ప్రతిఒక్కరు రోగ నిరోధకశక్తిని బలోపేతం చేసుకోవడానికి అనేక విధాలుగా ప్రయత్నాలు చేస్తూనే ఉంటున్నారు. వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నపుడు మన శరీరం జబ్బుల బారిన పడుతుంది. మన బాడీకి కావలసిన రోగ నిరోధక శక్తి పుచ్చకాయలో ఎక్కువగా లభిస్తుంది. పుచ్చకాయ తినడం వలన చర్మ సౌందర్యం ఉపయోగపడుతుంది. వేసవిలో వీచే గాలులకు చర్మం పొడిబారుతుంది. చర్మ సంబంధిత వ్యాధులు సోకే ప్రమాదం రాకుండా పుచ్చకాయ నియంత్రిస్తుంది. పుచ్చకాయలతో మూత్రపిండాల ఆరోగ్యం అధిక బరువుతో ఇబ్బంది పడే వారికి పుచ్చకాయ చాలా మేలు చేస్తుంది. పుచ్చకాయలో నీరు శాతం ఎక్కువగా ఉండటం వలన ఇది తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. దీంతో ఆహారం తక్కువ తీసుకుంటారు. ఫలితంగా బరువు తగ్గటానికి ఇది దోహదం చేస్తుంది. పుచ్చకాయ మూత్ర పిండాల ఆరోగ్యానికి దోహదం చేస్తుంది. పుచ్చకాయలు డయాబెటిస్ బాధితులకు మంచిది. అయితే మితంగానే తినాలి.

# బొడ్డులో నూనె వేసుకుంటే జరిగే అద్భుతాలు అన్నీ ఇన్నీ కావు!

మానవ శరీరంలోని ఏడు ప్రధాన బిందువులలో ఒకటిగా పేర్కొనబడినది నాభి. దీనినే వాడుక భాషలో బొడ్డు అని కూడా అంటారు. ఆయుర్వేద వైద్యంలో బొడ్డు ద్వారా చికిత్స కు ప్రాధాన్యత ఇస్తారు. మరి బొడ్డులో నూనె వేయటం వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. అన్నింటికి మూల కేంద్రము నాభి. శరీరంలో ఎక్కడ నొప్పి కలిగిన పూర్వ కాలంలో ఆయుర్వేద వైద్యులు నాభి వద్ద నూనె రాసేవారు. బొడ్డులో నూనె వేస్తే ఫలితాలిలా బొడ్డులో నూనె వేయటం, బొడ్డు చుట్టూ నూనె రాసుకోవటం వలన జీర్ణక్రియ మెరుగుపడుతుంది. బొడ్డులో నూనె వేయటం కారణంగా గ్యాస్, అజీర్ణం, మలబద్ధక సమస్య నుండి ఉపశమనం కలుగుతుంది. బొడ్డులో నూనె వేసుకుంటే చర్మం మెరిసిపోతుంది. రోగ నిరోధక శక్తిని బలోపేతం అవితుంది. బొడ్డులో నూనె రాసుకుంటే సంతానం లేక బాధ పడేవారికి ప్రయోజనం కలుగుతుంది. ఎక్కడ నొప్పి ఉన్నా బొడ్డు దగ్గర నూనె బొడ్డు చుట్టూ నూనె రాస్తే మెడ నొప్పికి ఉపశమనం కలుగుతుంది. పూర్వ కాలంలో నాయనమ్మలు,అమ్మమ్మలు ఈ చిట్కాలను బాగా పాటించేవారు. కడుపులో మంట అనిపించిన లేదా కడుపు ఉబ్బరంగా ఉన్నాకూడా బొడ్డు చుట్టూ నూనె రాసేవారు. అలా బొడ్డు చుట్టూ నూనె రాయడం వలన ఎంతోకొంత నొప్పి నుండి ఉపశమనం కలిగేదని చెప్తారు. ఈ నూనెలు బెస్ట్ ఇక బొడ్డులో నూనె వేసుకోవాలనుకునేవారు, బొడ్డు చుట్టూ నూనె రాసుకోవాలి అని భావించేవారు ఆవనూనె, కొబ్బరి నూనె, ఆలివ్ ఆయిల వంటి వాటిని వినియోగిస్తే మంచిది. ఆవ నూనెను బొడ్డు చుట్టూ రాసుకోవడం వలన మీ చర్మం కాంతివంతంగా ఉంచుతుంది. చర్మం పొడిబారకుండా చర్మం పై మచ్చలు ఏర్పడకుండా ఆవనూనె నియంత్రిస్తుంది. స్నానం చేసిన తరువాత రెండు చుక్కలు బొడ్డు చుట్టూ అప్లై చూసుకున్నట్లయితే కళ్ళలో మంటలు తగ్గుతాయి. బొడ్డులో నూనెతో బోలెడు లాభాలు క్రమం తప్పకుండా కొన్ని రోజుల పాటు ఒక నాలుగు చుక్కల కొబ్బరి నూనెను బొడ్డులో వేసుకొని బొడ్డు చుట్టూ అప్లై చేయడం వలన పెదాలు కాంతివంతంగా మెరుస్తాయి. పెదాలపై పగుళ్ళు రాకుండా మృదువుగా ఉంటాయి. బొడ్డులో నూనె వేయటం కారణంగా వేడి తగ్గుతుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. కీళ్ళ నొప్పులు, వాపుల నుండి ఉపశమనం లభిస్తుంది. జుట్టు పెరుగుదలకు దోహదం చేస్తుంది. శరీరంలో టాక్సిన్స్ ను తొలగిస్తుంది.



# ఊపిరితిత్తులకు డేంజర్ బెల్స్.. పాప్ కార్న్ లంగ్ వ్యాధితో ప్రాణాలకే ముప్పు.. ఇది ఎలా వస్తుందో తెలుసా?





పాప్ కార్న్... ఈ పేరు వినగానే నోరూరించే వెన్న సువాసన, సినిమా థియేటర్ జ్ఞాపకాలు గుర్తొస్తాయి కదూ! కానీ, ఈ పాప్ కార్న్ పేరుతో ముడిపడి ఉన్న ఒక తీవ్రమైన ఊపిరితిత్తుల వ్యాధి ఉందని మీకు తెలుసా? దాని పేరే "పాప్ కార్న్ లంగ్" వైద్య పరిభాషలో దీనిని "బ్రాంకియోలైటిస్ ఆబ్లిటెరాన్స్" అంటారు. ఇది ఊపిరితిత్తులలోని అతి చిన్న గాలి నాళాలను (బ్రోన్కియోల్స్) దెబ్బతీసే ఒక అరుదైన, తీవ్రమైన పరిస్థితి వ్యాధి. పాప్ కార్న్ లంగ్ ఎందుకు వస్తుంది? ఈ వ్యాధికి "పాప్ కార్న్ లంగ్" అని పేరు రావడానికి ఒక కారణం ఉంది. గతంలో, మైక్రోవేవ్ పాప్ కార్న్ తయారీ కర్మాగారాల్లో పనిచేసే కార్మికులలో ఈ వ్యాధిని ఎక్కువగా గుర్తించారు. పాప్ కార్న్‌కు వెన్న వంటి సువాసనను జోడించడానికి ఉపయోగించే "డైయాసిటైల్" అనే రసాయనాన్ని పీల్చడం వల్ల వారిలో ఈ సమస్య తలెత్తింది. ఆరోగ్య ప్రయోజనాలు ఫుల్లు!'' అయితే, కేవలం డైయాసిటైల్ మాత్రమే కాదు, ఇతర రసాయనాలను పీల్చడం వల్ల కూడా ఈ వ్యాధి రావచ్చు. వీటిలో కొన్ని పారిశ్రామిక రసాయనాలైన అమ్మోనియా, క్లోరిన్, సల్ఫర్ డయాక్సైడ్ వాటిని పీల్చడం వల్ల కూడా ఊపిరితిత్తుల వ్యాధి వచ్చే అవకాశం ఉంది. కొన్ని రకాల ఫ్లేవర్లలో వాడే రసాయనాలు. ఇవి ముఖ్యంగా ఇ-సిగరెట్లు/వేపింగ్ ద్రవాలలో వాడతారు. కొన్ని వైరల్ ఇన్ఫెక్షన్ల ( అడెనోవైరస్, రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్ - తర్వాత వచ్చే సమస్యలు కూడా ఈ పాప్ కార్న్ లంగ్ వ్యాధికి దారితీయవచ్చు. ఊపిరితిత్తులు లేదా మూలుగ మార్పిడి తర్వాత శరీరం కొత్త అవయవాన్ని తిరస్కరించడం ద్వారా కూడా ఈ వ్యాధి సంభవించే అవకాశం ఉంది. ఎవరికి ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉంది? ఫ్లేవర్లు, ఆహార పదార్థాల తయారీ పరిశ్రమలలో పనిచేసేవారు . ముఖ్యంగా డైయాసిటైల్ వంటి రసాయనాలకు గురయ్యేవారు. పారిశ్రామిక రసాయనాలకు ఎక్కువగా గురయ్యే కార్మికులు . కొన్ని రకాల ఇ-సిగరెట్లు/వేప్‌లను అధికంగా వాడేవారు . వీటిలో డైయాసిటైల్ లేదా ఇతర హానికర రసాయనాలు ఉండే అవకాశం ఉంది. తీవ్రమైన శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల నుండి కోలుకున్న కొందరు వ్యక్తులు. అవయవ మార్పిడి చేయించుకున్న రోగులు వంటి వారిలో ఈ పాప్ కార్న్ లంగ్ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. లక్షణాలు , సంకేతాలు: పాప్ కార్న్ లంగ్ లక్షణాలు నెమ్మదిగా, వారాలు లేదా నెలల వ్యవధిలో బయటపడవచ్చు. అవి తరచుగా ఇతర శ్వాసకోశ సమస్యలైన ఆస్తమా లేదా బ్రోన్కైటిస్‌ను పోలి ఉంటాయి, కానీ చికిత్సకు సరిగా స్పందించవు. ముఖ్యంగా పొడి దగ్గు , ఆయాసం, గురక లేదా పిల్లికూతలు , తీవ్రమైన అలసట, నీరసం, జ్వరం లేకపోయినా ఈ లక్షణాలు కొనసాగడం వంటి లక్షణాలు కన్పిస్తాయి. ఈ లక్షణాలు కనిపిస్తే, వెంటనే వైద్యుడిని సంప్రదించడం చాలా ముఖ్యం.' వ్యాధి నిర్ధారణ చికిత్స: వ్యాధి నిర్ధారణ కొంచెం క్లిష్టమైనది. వైద్యులు రోగి యొక్క వృత్తి, రసాయనాలకు గురైన చరిత్ర, లక్షణాలను పరిశీలిస్తారు. ఊపిరితిత్తుల పనితీరు పరీక్షలు (స్పిరోమెట్రీ), హై-రిజల్యూషన్ అు స్కాన్, కొన్నిసార్లు ఊపిరితిత్తుల బయాప్సీ (చిన్న కణజాల నమూనాను తీసి పరీక్షించడం) అవసరం కావచ్చు. పాప్ కార్న్ లంగ్ అనేది ఊపిరితిత్తులకు శాశ్వత నష్టం కలిగిస్తుంది, దీనికి పూర్తి నివారణ లేదు. చికిత్స ప్రధానంగా లక్షణాలను నియంత్రించడం, వ్యాధి ముదరకుండా చూడటంపై దృష్టి పెడుతుంది. ముఖ్యంగా హానికరం కారకాలకు దూరంగా ఉండాలి. ఇది అత్యంత ముఖ్యమైన దశ. వ్యాధికి కారణమైన రసాయనాలు లేదా వాతావరణానికి దూరంగా ఉండాలి. కార్టికోస్టెరాయిడ్స్ వంటి మందులు వాపును తగ్గించడంలో సహాయపడవచ్చు. ఇన్ఫెక్షన్లు ఉంటే యాంటీబయాటిక్స్ వాడతారు. ఆక్సిజన్ థెరపీ చేయాలి. ఆయాసం ఎక్కువగా ఉంటే ఆక్సిజన్ అవసరం కావచ్చు. అయితే చాలా తీవ్రమైన సందర్భాలలో, ఊపిరితిత్తుల మార్పిడి ఒక్కటే మార్గం కావచ్చు. నివారణ: ప్రధానంగా పని చేసే ప్రదేశాల్లో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. రసాయనాలకు గురికాకుండా సరైన వెంటిలేషన్, రక్షణ పరికరాలు (మాస్కులు) వాడాలి. హానికరం కానీ ప్రత్యామ్నాయ రసాయనాలను వాడే ప్రయత్నం చేయాలి. ధూమపానం, వేపింగ్ మానేయడం చాలా ముఖ్యం. ముఖ్యంగా ఫ్లేవర్లు కలిపిన వేప్ ద్రవాల వాడకం ప్రమాదకరం కావచ్చు. రసాయనాలకు గురయ్యే పనులు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ' పాప్ కార్న్ లంగ్ అనేది అరుదైనప్పటికీ, తీవ్రమైన, జీవితాన్ని ప్రభావితం చేసే వ్యాధి. దీనికి కారణమయ్యే రసాయనాలకు, ముఖ్యంగా డైయాసిటైల్‌కు దూరంగా ఉండటం ద్వారా దీనిని నివారించవచ్చు. పని ప్రదేశాల్లో భద్రతా ప్రమాణాలు పాటించడం, వేపింగ్ వంటి అలవాట్లకు దూరంగా ఉండటం ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కీలకం. అనుమానిత లక్షణాలు కనిపిస్తే అశ్రద్ధ చేయకుండా వైద్య సలహా పొందడం అత్యవసరం.

# డయాబెటిస్ పేషెంట్స్ వేసవిలో ఈ పండ్లు తింటే మంచిది!!



డయాబెటిస్ పేషెంట్లు మన సమాజంలో రోజురోజుకు పెరిగిపోతున్నారు. అనారోగ్యకరమైన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, విపరీతమైన పని ఒత్తిడి కారణంగా చాలామంది డయాబెటిస్ బారిన పడుతున్నారు. ఇక డయాబెటిస్ బారిన పడినవారు ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోకపోతే మరిన్ని అనారోగ్య సమస్యలను ఎదుర్కోవలసి వస్తుంది. డయాబెటిస్ బాధితులకు ఈ పండ్లతో మేలు డయాబెటిస్ పేషంట్స్ పండ్లు తినడం మంచిదే కానీ అన్ని రకాల పండ్లను తినకూడదు. ఒకవేళ పండ్లను తిన్నా కూడా పరిమిత మోతాదులోనే తినాలి. ఇక వేసవి కాలంలో కొన్ని రకాల పండ్లు తినడం డయాబెటిస్ బాధితులకు మేలు చేస్తుంది. మరి ఆ పండ్లు ఏమిటో ప్రస్తుతం తెలుసుకుందాం. జామ పండు డయాబెటిస్ పేషంట్స్ జామపండు ఎక్కువగా తినడం మంచిది. జామ పండులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. అంతేకాదు దీనిలో గ్లైసిమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. జామ పండు రక్తంలోని చక్కెరను నియంత్రించి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. డయాబెటిస్ ను కంట్రోల్ చేస్తుంది. పుచ్చకాయ వేసవి కాలంలో మన శరీరం డీహైడ్రేట్ అవుతుంది. శరీరంలో నీటి శాతాన్ని పెంచుకోవడం కోసం పుచ్చకాయ మంచి ఆహారంగా చెప్పవచ్చు. పుచ్చకాయలో నీటి శాతం ఎక్కువగా ఉండడంతో పాటు పోషకాలు ఎక్కువగా ఉంటాయి. దీనిలో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. అయినా పుచ్చకాయను పరిమిత మోతాదులోనే డయాబెటిస్ పేషెంట్స్ తినాలి. యాపిల్ పండు యాపిల్ పండులో కూడా ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది మనకు ఎక్కువ ఆకలి కాకుండా నిరోధిస్తుంది. చక్కెర శోషణ ను తగ్గిస్తుంది. మన ఇన్సులిన్ ఆక్టివిటీని మెరుగుపరుస్తుంది. కనుక యాపిల్ పండును ఆహారంలో భాగంగా చేసుకుంటే మంచిది. ఇది మనకు ఎంతో మేలు చేస్తుంది. బొప్పాయి పండు బొప్పాయి పండులో రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించే గొప్ప గుణాలు ఉన్నాయి. బొప్పాయి పండులో కూడా ఫైబర్ కంటెంట్ ఎక్కువగా ఉండటం వల్ల, ఇది మన ఆకలిని నియంత్రి బరువు తగ్గడానికి దోహదం చేస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించి బొప్పాయి డయాబెటిస్ ను కంట్రోల్లో ఉంచుతుంది. ముఖ్యంగా ఈ పండ్లను ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల ఈ వేసవికాలంలో డయాబెటిస్ ను కంట్రోల్ చేసుకోవచ్చు.

# ఆయుర్వేదంలో శిలాజిత్ అంటే ఏమిటి? ఎందుకు ఉపయోగిస్తారు?

2 ఆయుర్వేదంలో శిలాజిత్‌ను ఒక ముఖ్యమైన ఔషధంగా పరిగణిస్తారు. ఇది హిమాలయ పర్వతాల వంటి ఎత్తైన ప్రాంతాల్లోని శిలల నుండి ఊరే జిగురు లాంటి పదార్థం. వందల ఏళ్లపాటు మొక్కలు కుళ్ళిపోయి, శిలల ఒత్తిడికి గురికావడం వల్ల ఇది ఏర్పడుతుంది. శిలాజిత్‌ను సంస్కృతంలో "శిలాజితు" లేదా "శిలాజతు" అంటారు. దీని అర్థం "పర్వతాలను జయించేది, బలహీనతను నాశనం చేసేది" అని. శిలాజిత్‌ను ఎందుకు ఉపయోగిస్తారు?



ఆయుర్వేదం ప్రకారం శిలాజిత్ అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది. శరీర కణాలను దెబ్బతినకుండా కాపాడటంతోపాటు యవ్వనంగా ఉంచడంలో సహాయపడుతుంది. శరీరానికి శక్తిని అందించి రోగనిరోధక వ్యవస్థను బలపరుస్తుంది. నాడీ వ్యవస్థను బలపరిచి మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. ఎముకల సాంద్రతను పెంచడానికి సహాయపడుతుంది, వాటిని ఆరోగ్యంగా ఉంచుతుంది. పురుషులలో టెస్టోస్టెరోన్ స్థాయిని పెంచడానికి, స్పెర్మ్ నాణ్యతను మెరుగుపరచడానికి సహాయపడుతుంది. స్త్రీలలో పునరుత్పత్తి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. శరీరంలో ఇనుము స్థాయిని పెంచుతుంది. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుంది. మూత్రపిండాలలో రాళ్లు ఏర్పడకుండా నిరోధించడంలో తోడ్పడుతుంది. శరీరంలో వాపు, నొప్పిని తగ్గించి ఆరోగ్యంగా ఉంచుతుంది. కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించి గుండె పనితీరును మెరుగుపరుస్తుంది. ఉత్తర భారతదేశం, నేపాల్ ప్రజలు శిలాజిత్‌ను ఎక్కువగా ఉపయోగిస్తారు. పిల్లలకు దీన్ని పాలతో కలిపి ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో ఇస్తారు. షెర్పా ప్రజలు తమ ఆహారంలో శిలాజిత్‌ను ఒక భాగంగా చేసుకున్నారు. దీనివల్ల వారు చాలా బలంగా, ఎక్కువ కాలం ఆరోగ్యంగా జీవిస్తారని నమ్ముతారు. శిలాజిత్‌లో ఫుల్విక్ యాసిడ్, హ్యూమిక్ యాసిడ్, అనేక ఖనిజాలు (కాల్షియం, మెగ్నీషియం, ఇనుము, జింక్ వంటివి) మరియు ట్రేస్ ఎలిమెంట్స్ ఉంటాయి. ఫుల్విక్ యాసిడ్ ముఖ్యంగా పోషకాలను శరీరంలోని లోతైన కణజాలాలకు చేరవేయడంలో, శక్తి ఉత్పత్తిని పెంచడంలో సహాయపడుతుంది.



# సినిమా



## అందుకే ఆ రోజు అలా మాట్లాడా..



లేడీ సూపర్ స్టార్ గా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలైన విజయశాంతి కెరీర్లో ఎన్నో మంచి మంచి సినిమాలొచ్చాయి. ఆమె నటన, టాలెంటే ఆమెను సాధారణ హీరోయిన్ నుంచి లేడీ సూపర్ స్టార్ ను చేశాయి. రీసెంట్ గా అర్జున్ సన్నాఫ్ వైజయంతీ సినిమాలో నటించి, కర్తవ్యం సినిమాలోని వైజయంతిని గుర్తు చేసిన విజయశాంతి ఆ సినిమాలో తన నటనతో మంచి మార్కులు వేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ పలు విషయాలను తెలిపారు. తాను ఎలాంటి నటి, ఎలాంటి సినిమాలు చేశాననే విషయం గత తరానికి తెలుసని, ఈ తరానికి కూడా తన టాలెంట్ తెలియాలనే ఆలోచనతోనే అర్జున్ సన్నాఫ్ వైజయంతీ సినిమా చేశానని చెప్తున్న విజయశాంతి, ఈ కథలో తల్లీ కొడుకుల మధ్య ఉండే ఎమోషన్ తో పాటూ యాక్షన్ కూడా తనను ఎట్రాక్ట్ చేసిందని, ఈ ఏజ్ లో తనకు యాక్షన్ ఎంతో పెద్ద సవాల్ అని, అయినప్పటికీ దాన్ని ఛాలెంజ్ గా తీసుకుని చేశానని, సినిమా రిలీజయ్యాక అందరి నుంచి ఈ విషయంలో ప్రశంసలొస్తుంటే ఆనందంగా ఉందని విజయశాంతి తెలిపారు. రాములమ్మను ఎలాంటి క్యారెక్టర్ లో చూడాలనుకున్నామో అలాంటి పాత్రలోనే చూశామని అందరూ అంటున్నారని, కళ్యాణ్ రామ్ కూడా ఎంతో బాగా నటించాడని, స్క్రీన్ పైనే కాకుండా ఆఫ్ స్క్రీన్ లో కూడా తమ బంధం అలానే ఉంటుందని, కళ్యాణ్ రామ్ తనపై చూపించే ప్రేమ, ఆప్యాయత చూస్తుంటే, గత జన్మలో తను నా బిడ్డేమో అనిపిస్తుందని.. తల్లి, కొడుకుల గురించి కళ్యాణ్ రామ్ అలా మాట్లాడుతుంటే చాలా గర్వంగా అనిపించిందని విజయశాంతి అన్నారు.కొన్నాళ్లుగా ఇండస్ట్రీలో జరుగుతున్న పరిణామాల్ని చూస్తున్నాకాబట్టి సినిమాను చంపేయొద్దని మాట్లాడానని, ఇండస్ట్రీపై ఆధారపడి ఎంతోమంది బతుకుతున్నారని అందుకే కనీస బాధ్యత వ్యవహరించాలని చెప్పానన్నారు. ప్రతీ ఒక్కరూ హీరోలతో సమానంగా హీరోయిన్లకు కూడా గౌరవం ఇవ్వాలని, సీనియర్ ఎన్టీఆర్ తనకంటే ఎంత చిన్నవాళ్లనైనా మీరు అనే గౌరవించేవారని, ఆయన్ను చూసే అందరితో గౌరవంగా ఉండటం నేర్చుకున్నానని చెప్పిన ఆమె, హీరోయిన్లకు పెద్ద పాత్రలు ఇస్తే వాళ్లను వాళ్లు ప్రూవ్ చేసుకునే ఛాన్స్ ఉంటుందన్నారు.సుమారు 60 మంది హీరోలతో కలిసి పనిచేసిన తాను ఎన్నో ప్రయోగాలు చేశానని, ప్రతీ సినిమాలో హీరోలకు లుక్ మారినా తనకు మాత్రం అదే లుక్ ఉండేదని, ఆ లుక్ లోనే ఎప్పటికప్పుడు ఎన్నోరకాల ఎమోషన్స్ పలికించేదాన్నని, అందుకే ఆడియన్స్ తనను సింహాసనంపై కూర్చోపెట్టారని, పొలిటీషియన్ గా మీటింగ్స్ కు వెళ్లినప్పుడు మీలో ఉండే ధైర్యమే మాకు ఇన్స్పిరేషన్ అని చెప్పినప్పుడు చాలా సంతృప్తిగా ఉండేదని, ప్రేక్షకులకు కృష్ణుడు అనగానే ఎన్టీఆర్ ఎలా గుర్తొస్తారో, లేడీ పోలీసాఫీసర్ అనగానే విజయశాంతి గుర్తొస్తుందని, అందుకే ఇందులోని వైజయంతీ పాత్రను చేశానని విజయశాంతి చెప్పారు.

## ఎన్టీఆర్ బాడీ డబుల్ వార్ 2ను రిజెక్ట్ చేశాడా?

: తెరపై కనిపించే హీరోలకు డూప్‌లు అంటే బాడీ డబుల్ లు ఉంటారన్నది చాలా మందికి తెలిసినవిషయమే. తెరపై వీరోచిత విన్యాసాలు చేసే హీరోలని చూసి అభిమానులు,ప్రేక్షకులు సంభ్రమాశ్చర్యాలకు లోనవుతూ ఉంటారు. సూపర్ హీరోల్లా అభిమాన హీరోలు చేసే సాహసోపేతమైన విన్యాసాలు, ఒళ్లుగగుర్పొడిచే స్టంట్‌లు మన హీరోలు చేయడం లేదంటే నమ్మడానికి కొంత కష్టంగానే ఉంటుంది కానీ క్లిష్టతమైన స్టంట్‌లు చేసేది మాత్రం హీరోలు కాదు వారి డూప్‌లు అంటే బాడీ డబుల్‌లు. ప్రతి హీరోకు బాడీ డబుల్ ఉన్నాడు. మెగాస్టార్ చిరంజీవి నుంచి క్రేజీ హీరోల వరకు బాడీ డబుల్స్ ఉన్నారు. ప్రతి సినిమాలోనూ, చివరికి కమర్షియల్ యాడ్స్‌లలోనూ హీరోలు చేయలేని స్టంట్స్ చేస్తూ వారికి పేరు తెచ్చి పెడుతున్నారు. అందరి హీరోల్లాగే యంగ్ టైగర్ ఎన్టీఆర్‌కు కూడా ఓ డూప్, ఓ బాడీ డబుల్ ఉన్నాడు. అతనే ఈశ్వర్ హరీస్. ఐటీ రంగంలో జాబ్‌ని వదులుకుని గత కొంత కాలంగా ఎన్టీఆర్‌కు బాడీ డబుల్‌గా పని చేస్తూ వస్తున్నాడు. ఎన్టీఆర్ కోసం వీరోచిత విన్యాసాల్లో కనిపించిన ఈశ్వర్ ఓ భారీ క్రేజీ ప్రాజెక్ట్‌ని రిజెక్ట్ చేశాడట. అదే బాలీవుడ్ మూవీ 'వార్ 2'. ఈ సినిమాతో ఎన్టీఆర్ బాలీవుడ్‌కు పరిచయం అవుతున్న విషయం తెలిసిందే. యష్‌రాజ్ ఫిలిమ్స్ స్పై యూనివర్స్ ఫ్రాంఛైజీల్లోని 'వార్'కు సీక్వెల్‌గా వస్తున్న ఈ మూవీలో హృతిక్ రోషన్ నటిస్తున్న విషయం తెలిసిందే. 'బ్రహ్మాస్త్ర' ఫేమ్ అయాన్



ముఖర్జీ డైరెక్ట్ చేస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ని ఎన్టీఆర్ బాడీ డబుల్ తిరస్కరించాడట. కారణం తను డిమాండ్ చేసిన మొత్తాన్ని ఇవ్వకపోవడమేనట.‌ తను డిమాండ్ చేసిన పారితోషికంతో పాటు ముంబై ఫ్లైట్ ఛార్జీలు కూడా ఇవ్వనన్నారట. దీంతో హర్ట్ అయిన ఈశ్వర్ 'వార్ 2'ని తిరస్కరించాడట. మరి అతని స్థానంలో ఎన్టీఆర్ బాడీ డబుల్‌గా ఎవరిని తీసుకున్నారు? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇదిలా ఉంటే 'వార్ 2'ఆగస్టు 14న భారీ స్థాయిలో రిలీజ్ కాబోతోంది. దీని తరువాత ఎన్టీఆర్ కోసం బాలీవుడ్ డైరెక్టర్స్, ప్రొడ్యూసర్స్ క్యూ కడతారని ఇన్ సైడ్ టాక్.

## రెండేళ్ల క్రితం నా పుట్టిన రోజు అక్కడే జరిగింది : విజయ్ దేవరకొండ

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి దేశం మొత్తాన్ని కుదిపేసింది. అమాయకులైన పర్యాటకులపై కాల్పులు జరిపిన ఉగ్రవాదులను, ఉగ్రవాద సంస్థలను క్షమించవద్దంటూ దేశం మొత్తం ముక్త కంఠంతో డిమాండ్ చేస్తుంది. సోషల్ మీడియాలో చాలా మంది దీనికి ప్రతీకారం తీసుకోవాల్సిందే అంటూ డిమాండ్ చేస్తున్నారు. సామాన్యులు మాత్రమే కాకుండా సెలబ్రెటీలు సైతం ఈ ఉగ్రదాడి ని తీవ్రంగా ఖండించి చనిపోయిన పర్యాటకులకు ప్రగాడ సంతాపం తెలియజేశారు. టాలీవుడ్‌కి చెందిన సినీ ప్రముఖులు పలువురు ఈ దారుణంపై స్పందించారు. సోషల్ మీడియా ద్వారా పలువురు తమ సంతాపం తెలియజేశారు. మెగాస్టార్ చిరంజీవి స్పందిస్తూ... 28 మంది చనిపోయిన ఈ ఘటన హృదయ విదారకమైనది. ఉగ్రవాదులు పాల్పడిన ఈ చర్య క్షమించరానిది. చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను అన్నారు. విజయ్ దేవరకొండ స్పందిస్తూ... రెండు సంవత్సరాల క్రితం పహల్గాంలో ఒక షూటింగ్‌లో పాల్గొన్నాను. ఆ సమయంలో షూటింగ్ చాలా సరదాగా నవ్వుల మధ్య సాగింది. ఆ సమయంలో మమ్మల్ని చాలా జాగ్రత్తగా స్థానిక కశ్మీరీలు చూసుకున్నారు. వారి ప్రేమ మధ్య ఆ సమయంలో నా పుట్టిన రోజు జరుపుకున్నాను. నిన్న జరిగిన హృదయ విదారక ఘటన నాకు కోపం తెప్పించింది. మిమ్మల్ని మీరు ఒక దళంగా చెప్పుకుంటూ పర్యాటకులను కాల్చి చంపడం అనేది కచ్చితంగా పిరికిపంద చర్య అంటూ ఉగ్రవాదుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. కాశ్మీర్‌కు మేము అండగా నిలుస్తాము. ఈ పిరికి వాళ్ళు త్వరలోనే నిర్మూలించబడుతారు. భారతదేశం ఎప్పటికీ ఉగ్రవాదానికి తలవంచదు. అల్లు అర్జున్ స్పందిస్తూ... పహల్గాం ఎంతో అందమైన ప్రదేశం. అక్కడ జరిగిన ఘటన తెలిసి గుండె పగిలింది. బాధిత కుటుంబాలకు నా సానుభూతి తెలియజేస్తున్నాను. మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను. ఎన్టీఆర్ స్పందిస్తూ... పహల్గాం ఘటనలో చనిపోయిన వారిని, బాధితులను చూస్తూ ఉంటే హృదయం బరువెక్కుతోంది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. అక్కడ శాంతి కోసం ప్రార్థిస్తున్నాను అన్నారు. నాని స్పందిస్తూ... మూడు నెలల క్రితం అక్కడ 200 మందితో కలిసి షూటింగ్‌లో పాల్గొన్నాను. ఇలాంటి దారుణాన్ని ఊహించలేదు. ఉగ్రదాడి హృదయాన్ని కలచి వేసింది అన్నారు. మహేష్ బాబు స్పందిస్తూ... ఇది డార్క్ డే, ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నాను. బాధిత కుటుంబాలకు అండగా ఉందాం అన్నారు. అక్షయ్ కుమార్ స్పందిస్తూ... ఈ దాడి దారుణమైనది. అమాయకులను చంపడం అనేది దారుణం. మృతుల కుటుంబాల కోసం ప్రార్థిస్తున్నాను. సంజయ్ దత్ స్పందిస్తూ... ఇది కచ్చితంగా క్షమించరాని ఘాతుకం. ఈ ఉగ్ర చర్యపై అందరూ మౌనం వీడాలి, తప్పకుండా ప్రతీకారం తీర్చుకోవాల్సిందే అని అన్నారు. జాన్వీ కపూర్ స్పందిస్తూ... పహల్గాం ఉగ్ర దాడి గురించి తెలిసి షాక్ అయ్యాను. సైనిక దుస్తుల్లో వచ్చి కాల్పులు జరపడం అనేది అన్యాయం. ఇలాంటి అనాగరిక చర్యల వల్ల నాలోని కోపాన్ని అణచివేయలేక పోతున్నాను. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల కోసం ప్రార్థన చేస్తున్నా. మేం మొత్తం మీ వెంట ఉన్నాం. ఈ సమయంలో ధైర్యంగా ఉండండి. సోనూసూద్ స్పందిస్తూ... అమాయకపై పర్యాటకులపై ఉగ్రదాడి జరగడం దారుణం. ఇది కచ్చితంగా పిరికిపంద చర్య. నాగరిక ప్రపంచంలో ఉగ్రవాదానికి చోటు ఉండకూడదు. ఈ దాడి ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు అన్నారు. ఇంకా పలువురు సినీ ప్రముఖులు ఈ విషయమై స్పందిస్తూ తమ సంతాపం తెలియజేశారు. అంతే కాకుండా పలువురు గతంలో తాము పహల్గాంలో షూటింగ్ చేసిన సందర్భాలను గుర్తు చేసుకున్నారు. ఉగ్రవాద చర్య ను ఖండిస్తూ కఠినంగా వ్యవహరించాలంటూ ప్రభుత్వాన్ని సెలబ్రిటీలు డిమాండ్ చేస్తున్నారు.





## ఎన్టీఆర్ తగ్గితే పుష్పరాజ్ మాత్రం తగ్గేదేలే!

'పుష్ప 2'తో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌కు దక్కిన పాపులారిటీ అంతా ఇంతా కాదు. దేశంలోని నలుమూలలకు బన్నీ క్రేజ్ పాకిన విషయం తెలిసిందే. స్టైల్‌కు ఐకాన్‌గా నిలిచిన అల్లు అర్జున్ ఈ సినిమాతో బాక్సాఫీస్ రికార్డుల్ని తిరగరాయడమే కాకుండా అత్యంత వివాదాలకు కేంద్ర బిందువుగా నిలవడం, జాతీయ మీడియాలోనూ హాట్ టాపిక్‌గా మారడం తెలిసిందే. 'పుష్ప ది రూల్' పేరుకు తగ్గట్టే బాక్సాఫీస్‌ని రూల్ చేసిన బన్నీ ఈ సినిమాతో వరల్డ్ వైడ్‌గా రూ.1800 కోట్లు సాధించి ట్రేడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.ఇంతటి సంచలన విజయం తరువాత అల్లు అర్జున్ సొందరపడకుండా 'పుష్ప2' లాంటి బ్లాస్టింగ్ హిట్ తరువాత అంతకు మించి అనే స్థాయి సినిమాతో ప్రేక్షకు ముందుకు రాబోతున్నాడు. 'పుష్ప 2' తరువాత బన్నీ తమిళ దర్శకుడు అట్లీ డైరెక్షన్‌లో పాన్ వరల్డ్ మూవీకి శ్రీకారం చుడుతున్న విషయం తెలిసిందే.అయితే ఈ సినిమా కోసం బన్నీ ఎక్కడా తగ్గడం లేదు. ప్రశాంత్ నీల్ 'డ్రాగన్' కోసం ఎన్టీఆర్ దాదాపు 18 కేజీలు బరువు తగ్గడం హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. ఎన్టీఆర్ ఏంటీ ఇలా తగ్గుతున్నాడు? .. ఎందుకింతగా తగ్గుతున్నాడు? ఎన్టీఆర్ బొద్దుగా ఉంటేనే మజా కానీ ప్రశాంత్ నీల్ అందుకు పూర్తి భిన్నంగా 'డ్రాగన్' కోసం ఎన్టీఆర్‌ని మరీ లీన్‌గా తయారు చేస్తున్నాడేంటీ? అనే కామెంట్‌లు వినిపించాయి. ఎన్టీఆర్‌ని చూసి ఫ్యాన్స్ షాక్‌కు గురయ్యారు కూడా. అయితే తన తదుపరి ప్రాజెక్ట్ కోసం పుష్పరాజ్ మాత్రం తగ్గేదేలే అంటున్నాడు. అట్లీతో బన్నీ ఓ భారీ ప్రాజెక్ట్‌ని చేయబోతున్న విషయం తెలిసింద్ సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించనున్న ఈ ప్రాజెక్ట్ కోసం పలువురు హాలీవుడ్ టెక్నీషియన్‌లు పనిచేయబోతున్నారు. ఇదిలా ఉంటే ఈ ప్రాజెక్ట్‌లో బన్నీ సూపర్ హీరో తరహా క్యారెక్టర్‌లో కనిపించనున్నాడట. అయితే అందు కోసం బరువు తగ్గుతాడేమోనని అంతా అనుకుంటే అందుకు పూర్తి భిన్నంగా బన్నీ తగ్గేదేలే అన్నట్టుగా మునుపటికంటే ఫిట్‌గా మారిపోయారు. తాజాగా శంషాబాద్ ఏయిర్ పోర్ట్‌లో బన్నీ కనిపించిన తీరుకు అంతా అవాక్కవుతున్నారు. డెనిమ్ బ్లాక్ డ్రెస్‌లో బన్నీ మునుపటికంటే ఫిట్‌గా మరింత బొద్దుగా కనిపించడం విశేషం. ఫిజిక్ పెంచేసిన అల్లు అర్జున్ మరింత గ్లోతో కనిపించారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. ఫ్యాషన్‌కి ఐకాన్‌గా భావించే బన్నీ బ్లాక్ డ్రెస్‌లో మరింత మ్యాన్లీగా కనిపించారు. ఇప్పటికే అట్లీ మూవీ లుక్ టెస్ట్ పూర్తి కావడంతో బన్నీ ఈ మూవీలో మరింత ఫిట్‌గా కనిపించి అదరగొట్టబోతున్నాడని అభిమానులు పండగ చేసుకుంటున్నారు.



# కసిరెడ్డి అప్రవూర్..తూచ్... నాకేమి తెలియదు... వాళ్లు చెప్పినట్టే చేశా

గుంటూరు, ఒంగోలు, ఏప్రిల్ 23,ఏపీలో వైసీపీ పాలనలో చీపు లిక్కరును మద్యం బాబులకు అంటగట్టి.. భారీ ధరలతో వారిని దోచేసిన విషయం తెలిసిందే. అన్నీ ప్రభుత్వ మద్యం దుకాణాలే కావడం.. ఎక్కడా ఫోన్‌పే, గూగుల్ పే వంటి వాటినివినియోగించకపోవడం ద్వారా భారీ ఎత్తున నగదు అక్రమాలు జరిగాయని అప్పట్లోనే ఆరోపణలు గుప్పుమన్నాయి. దీనిని కూటమి సర్కారు వచ్చాక దుమ్ముదులిపే ప్రయత్నం చేసింది. తాజాగా కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి..ఉరఫ్ రాజ్ కసిరెడ్డిని పోలీసులు మంగళవారం సాయంత్రం వరకు విచారించారు.వాస్తవానికి సోమవారం.. అర్ధరాత్రి నుంచి విడతల వారీగా రాజ్ కసిరెడ్డిని విచారిస్తూనే ఉన్నారు.. ఈ సందర్భంగా పలు కీలక విషయాలు కసిరెడ్డి వెల్లడించినట్టు అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. వీటిలో ప్రధానంగా నాలుగు అంశాలపై అధికారులు దృష్టి పెట్టారు. వైసీపీ హయాంలో తీసుకువచ్చిన మద్యం విధానానికి రూపకర్త ఎవరు? అన్నది ప్రధాన ప్రశ్న. దీనికి కసిరెడ్డి ఎలాంటి తడబాటు లేకుండానే.. వైసీపీ ముఖ్య నాయకులు అని చెప్పినట్టు తెలిసింది.ఈ ముఖ్య నాయకుల్లో వైవీ సుబ్బారెడ్డి తనయుడు విక్రాంత్ రెడ్డి ఉన్నట్టు చెప్పారు. అదేవిధంగా సాయిరెడ్డి పాత్ర కూడా ముఖ్యమేనని.. ఆయన ఇప్పుడు తప్పించుకుంటున్నారని చెప్పినట్టు తెలిసింది. ఇక, డిస్టిలరీల వ్యవహారం అంతా.. సాయిరెడ్డే చూసినట్టు చెప్పారని తెలిసింది. కొన్ని కొన్ని విషయాల్లో మాత్రమే తన ప్రమేయం ఉందని.. తాడేపల్లి, హైదరాబాద్, బెంగళూరు లలో జరిగిన నాలుగు కీలక సమావేశాల్లోనే నిర్ణయాలు జరిగాయని వివరించినట్టు సమాచారం.డిస్టరీల వ్యవహారం సహా.. మద్యం కేసుల విక్రయాలు.. లక్ష్యాలు పెట్టడం.. నిధుల విషయం అంతా.. కూడా.. తాడేపల్లికి చెందిన ముగ్గురు కీలక వ్యక్తులు చెబితేనే తాను చేసినట్టు కసిరెడ్డి వివరించినట్టు తెలిసింది. ఆ ముగ్గురులో అప్పటి సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కూడా ఉన్నట్టు చెప్పడం సంచలనంగా మారింది. ఎక్కడెక్కడ ఏయే మద్యం విక్రయించాలి. ఎవరిని వాడుకోవాలి.. అనే విషయాల్లో ఆయన ప్రమేయం ఉందని.. అదేవిధంగా అప్పటి ఓ మంత్రి ప్రమేయం కూడా ఉందని కసిరెడ్డి చెప్పినట్టు సమాచారం. ఇదిలావుంటే.. రాజ్ కసిరెడ్డి నుంచి మరిన్ని వివరాలు రాబట్టిన పోలీసులు కోర్టుకు ఆయనను హాజరుపరిచారు.సీనియర్ ఐపీఎస్ అధికారి, ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు అరెస్టుపై విపక్ష వైసీపీ ఘాటుగా స్పందించింది. ఈ మేరకు వైసీపీ కీలక నేత, మాజీ మంత్రి అంబటి కూటమి సర్కారే కక్షపూరితంగా అరెస్టు చేయించిందని సంచలన ఆరోపణ చేశారు. అంతేకాకుండా ఈ అరెస్టులకు మూల్యం చెల్లించుకోక తప్పదంటూ అంబటి ఏకంగా టీడీపీ అధినేత, సీఎం నారా చంద్రబాబునాయుడుకు వార్నింగులు జారీ చేశారు. చంద్రబాబుకు వార్నింగ్ ఇస్తూ అంబటి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఎంతమందిని అరెస్టు చేస్తారు? అరెస్టు చేసి జైల్లో పెడితే? జైల్లోనే తాము చనిపోతామా? రాదా బెయిల్? ఏడాదికి అయినా వస్తుంది కదా. చాలా తప్పు చేస్తున్నారు చంద్రబాబు గారు, మీరు పెద్ద వారు. 75వ పుట్టిన రోజు జరుపుకున్న మీరు గుర్తు పెట్టుకోండి. దీనికి తగ్గ మూల్యం చెల్లిస్తారు" అంటూ అంబటి సంచలన వ్యాఖ్యలే చేశారు. అసలు పీఎస్ఆర్ ను అరెస్టు చేసిన కేసులో నిందితుడిగా ఉన్న కుక్కల విద్యా సాగర్ తో పాటు మరో ఇద్దరు ఐపీఎస్ అధికారులు కాంతి రాణా టాటా, విశాల్ గున్నీలకు కోర్టు ఇప్పటికే బెయిల్ ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. కోర్టును ఆశ్రయించకుండా ఉన్న కారణంగానే పీఎస్ఆర్ ను అరెస్టు చేయగలిగారు అని ఆయన ఆరోపించారుఅయినా పీఎస్ఆర్ అరెస్టు చంద్రబాబు మార్గదర్శకత్వంలోనే జరిగిందని కూడా అంబటి ఆరోపించారు. చంద్రబాబు అరెస్టైన సమయంలో పీఎస్ఆర్ ఇంటెలిజెన్స్ చీఫ్ గా ఉన్నారని, తన అరెస్టులో కీలక భూమిక పీఎస్ఆర్ దేనని చంద్రబాబు భావించారని ఆయన ఆరోపించారు. తన అరెస్టుకు కారకుడిగా నిలిచారన్న భావనతోనే పీఎస్ఆర్ ను చంద్రబాబు అరెస్టు చేయించారన్నారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులు కూడా ఓ విషయాన్ని గుర్తించాలని.. టీడీపీ సర్కారే ఎల్లకాలం అధికారంలో ఉండదని ఆయన హెచ్చరించారు. మరో పార్టీ ప్రభుత్వం వస్తే మీ పరిస్థితి ఏమిటని కూడా ఆయన పోలీసులను హెచ్చరించారు. ఐపీఎస్ లు అయినా, ఐఏఎస్ లు అయినా వారి పరిధి దాటి వ్యవహరించరని అంబటి అన్నారు.

అయితే ఇప్పుడు మాత్రం పోలీసుల తీరు అందుకు విరుద్ధంగా ఉందని అంబటి ఆరోపించారు.జగన్ కు ఎవరు దగ్గరగా ఉన్నా? వారంతా తమకు శత్రువులే అన్నట్లుగానే చంద్రబాబు భావిస్తున్నారని అంబటి వ్యాఖ్యానించారు. అసలు ఏపీలో మద్యం కుంభకోణమే జరగకున్నా.., ఏదో జరిగిందంటూ రాజ్ కసిరెడ్డిని అరెస్టు చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వమే మద్యం విక్రయిస్తే అవినీతి ఎక్కడ జరుగుతుందని ఆయన ప్రశ్నించారు. అయినా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడితే కదా అవినీతి జరిగేది అని కూడా ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు జరుగుతున్న వాటికంతా చంద్రబాబు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. చంద్రబాబు లేకుంటే ఆయన కుమారుడు లోకేశ్ అయినా మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కూటమి సర్కారు కేవలం 11 నెలల వ్యవధిలో వచ్చిన వ్యతిరేకత దేశంలో ఏ ఒక్క ప్రభుత్వం మీద రాలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న చంద్రబాబు? అందులో భాగంగానే రోజుకు ఒకరిని అరెస్టు చేస్తూ ప్రజల దృష్టిని మరల్చుతున్నారని ఆయన ఆరోపించారు.

## పిఎస్ఆర్ రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు

**అధికార దుర్వినియోగంతో నటి జెత్వానిపై కేసు**

**ఇంటిలిజెన్స్ చీఫ్‌గా ఆదేశాలతోనే అక్రమ అరెస్టులు**

అమరావతి,ఏప్రిల్ 23: నటి జెత్వాని కేసులో అరెస్ట్ అయిన ఇంటెలిజెన్స్ మాజీ బాస్ పీఎస్ఆర్ ఆంజనేయులు రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ముంబై నటి జెత్వాని కేసులో ఆమె, ఆమె తల్లిదండ్రులను పథకం ప్రకారమే ఆంజనేయులు అరెస్ట్ చేయించారని పోలీసులు తెలిపారు. ఆయన అప్పటిలో ఇంటెలిజెన్స్ బాస్‌గా ఉండటంతో ఆయన ఆదేశాలు మేరకే అక్రమ అరెస్టులు జరిగాయని.. ముందుగా నిర్ణయించిన ప్రణాళిక ప్రకారమే ఈ అక్రమ అరెస్టులు జరిగాయని వెల్లడించారు. ఇందుకు సంబంధించి పీఎస్ఆర్ ఆంజనేయులు, అప్పటి సీపీ కాంతి రాణా తాతా, విశాల్ గున్ని కాల్ రికార్డ్ డేటా కూడా స్పష్టంగా ఉందన్నారు. 2024 జనవరి 30 నుంచి 2024 ఫిబ్రవరి 3 వరకు వీరి ముగ్గురి కాల్ డేటా కూడా సేకరించినట్లు ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ తెలిపారు. పీఎస్ఆర్ ఆంజనేయులు ముంబై పోలీస్ అధికారులతో కూడా ఆ సమయంలో టచ్‌లో ఉన్నారని తేలిందన్నారు. ముందుగా నిర్ణయించడం వల్లే అసలు జెత్వానీపై కేసు రిజిస్టర్ చేయకముందే అంటే రెండు రోజులు ముందు ముంబై ఫ్లైట్ టికెట్స్ కొన్నారన్నారు. అసలు కుక్కల విద్యాసాగర్ ముంబై నటి జెత్వానీపై చేసిన ఫిర్యాదులో కూడా నిజం లేదని తేలిందని పోలీసులు పేర్కొన్నారు. దీనికి సంబంధించి న్యాయమూర్తి ముందు ఇచ్చిన 164 వాంగ్మూలం కూడా ఉన్నాయన్నారు. పైగా తనను విశాల్ గున్ని ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను కూడా రిమాండ్ రిపోర్ట్‌లో దర్యాప్తు అధికారి పేర్కొన్నారు. తనని పీఎస్ఆర్ ఆంజనేయులు సీఎంవోకు పిలిపించి జెత్వానీని అరెస్ట్ చేసే టాస్క్ అప్పగించారని విశాల్ గున్ని చెప్పారు. తనకు అసలు ఈ కేసుతో సంబంధం లేకపోయినప్పటికీ టాస్క్ అప్పగించారని విశాల్ గున్ని చెప్పారు. తాను ఈ టాస్క్ పూర్తి చేస్తేనే తనను విశాఖకు రిలీవ్ చేస్తామని చెప్పారని కూడా వివరించారు. అప్పటి ఇంటెలిజెన్స్ బాస్‌గా ఉండటం, తన అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఈ అక్రమ అరెస్ట్ చేయించారని.. ఒక మహిళ వ్యక్తిగత స్వేచ్ఛను హరించారని.. అప్పటి డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డికి కూడా ఈ విషయం అప్పటి సీపీ కాంతి రాణా తాతా చెప్పారని.. ఆయన గో ఎహెడ్ అన్నారని రిమాండ్ రిపోర్ట్‌లో తెలిపారు. పీఎస్ఆర్ ఆంజనేయులు అసలు విచారణకు సహకరించలేదని.. ఆయన వద్ద నుంచి ఐఫోన్‌ను సీజ్ చేశామన్నారు. ఆయనను విచారించేందుకు మళ్ళీ కస్టడీకి కూడా తీసుకోవాల్సి ఉందని రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొన్నారు. పీఎస్ఆర్ ఆంజనేయులుకు విజయవాడలోని కోర్టు రిమాండ్ విధించిన విషయం తెలిసిందే. ముంబయి నటి కాదంబరి జెత్వానీ కేసులో మంగళవారం పీఎస్ఆర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. ఆయనకు మే 7 వరకు రిమాండ్ విధిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే, రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పీఎస్ఆర్ ఆదేశాలతో ఫోర్జరీ డాక్యుమెంట్లతో నకిలీ ఆధారాలు సృష్టించారని తేలింది. పీఎస్ఆర్ ఆంజనేయులే కేసు నమోదు చేయాలని కాంతిరాణా, విశాల్ గున్నికి చెప్పినట్లు- రిపోర్టులో పేర్కొన్నారు. పీఎస్ఆర్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. అలాంటి అధికారి సాక్ష్యాలు తారుమారు చేసే, సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉంది. మహిళపై అక్రమ కేసు నమోదుకు అధికారులను ప్రభావితం చేశారు. కిందిస్థాయి అధికారులకు తప్పుడు దిశానిర్దేశం చేశారని రిపోర్టులో పేర్కొన్నారు.

## పదోతరగతి ఫలితాల్లో బాలిలక ప్రతిభ

**వందశాతం మార్కులు సాధించిన నేహాంజని**

**598 మార్కులు సాధించిన పావని చంద్రిక**

కాకినాడ,ఏప్రిల్ 23: ఏపీ టెన్త్ ఫలితాల్లో బాలికలు అద్భుత ప్రతిభను చాటారు. ఓ విద్యార్థిని అరుదైన ఘనత సాధించింది. కాకినాడకు చెందిన నేహాంజని అనే బాలికకు 600 మార్కులు వచ్చాయి. నగరంలోని భాష్యం పాఠశాలలో బాలిక చదువుతోంది. మరోవైపు ఎలమంచిలి శ్రీచైతన్య స్కూల్‌లో చదువుతున్న ఎండ అనీష అనే విద్యార్థిని 599 మార్కులు సాధించింది. పల్నాడు జిల్లాలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థినికి 598 మార్కులు వచ్చాయి. ఒప్పిచర్ల జడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న పావని చంద్రిక ఈ ఘనత సాధించింది. ఆమెను హెచ్ఎం విజయ లలిత, తోటి ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.విద్యార్థిని పావని చంద్రిక కారంపూడి మండలం ఒప్పిచర్ల ప్రభుత్వ పాఠశాలలో చదివి 598 మార్కులు సాధించింది. విద్యార్థిని పావని చంద్రికని జిల్లా విద్యాశాఖ అధికారులు అభినందించారు. నరసరావు పేటలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి విద్యార్థిని పావని చంద్రిక, ఆమె తల్లిదండ్రులు, పాఠశాల టీచర్లను ను పిలిచి సన్మానించిన జిల్లా డీఈఓ చంద్రకళ స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా విద్యార్థిని పావని చంద్రిక మాట్లాడుతూ.. పదవ తరగతి ఫలితాలలో నాకు 598 మార్కులు రావడం చాలా సంతోషంగా ఉంది.. నాకు ఈ మార్కులు రావడానికి మా టీచర్లు, స్కూల్ హెచ్ఎం కృషి చేశారు.. మా తల్లిదండ్రులకు దూరంగా ఉన్నా కానీ అమ్మమ్మ ఎంతో జాగ్రత్త తీసుకుని చదివించింది.. భవిష్యత్తులో నేను కలెక్టర్ కావాలని అనుకుంటున్నాను.. ఐఏఎస్ చదవడానికి ప్రభుత్వం కూడా సహకరిస్తే తప్పకుండా విజయం సాధిస్తానని తెలిపింది. పల్నాడు జిల్లా డీఈఓ చంద్రకళ మాట్లాడుతూ.. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మంచి ఫలితాలు రావడం జరిగింది.. ఈ ఏడాది మంచి ఫలితాలు రావడం శుభ పరిణామం.. పదో తరగతి పరీక్షలలో జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు సూచనలు, సలహాలు బాగా పని చేశాయి.. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తున్నానని తెలిపారు.

## అవంతికి లైన్ క్లియర్ అయినట్టేనా

విశాఖపట్టణం, ఏప్రిల్ 23, కూతురు కూటమిలో చేరితే మాజీ మంత్రి అవంతికి రూట్ క్లియర్ అయినట్లేనా? అవంతి కూటమిలో చేరేందుకు ద్వారాలు తెరిచినట్లేనా? ఇన్నాళ్లు అవంతి దారెటని సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిన వార్తలకు కూతురి ఓటుతో సమాధానం దొరికినట్లేనా? వైసీపీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి అవంతి చూపంతా ఇప్పుడు కూటమివైపేనా? అంటే అవుననే సమాధానం రాజకీయవర్గాల్లో విన్పిస్తోంది. స్టీల్ సిటీ విశాఖ నగరంలో పొలిటికల్ రూపు రేఖలు మారబోతున్నాయంట. 3రోజుల క్రితం జరిగిన జీవీఎంసీ మేయర్ అవిశ్వాస తీర్మానం ఓటింగ్ తో జిల్లా రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయి. విశాఖ మేయర్ పీఠాన్ని కూటమి కైవసం చేసుకోవడంతో జిల్లా పాలిటిక్స్ లో పెను మార్పులు చోటు చేసుకున్నాయి. కూటమి ఖాతాలోకి విశాఖ మేయర్ పీఠం వచ్చి చరడంతో ఇన్నాళ్లు ఒక లెక్క?ఇప్పుడొలెక్క మాదిరిగా మారిపోయాయి విశాఖ పాలిటిక్స్. అంతేకాదు?రాబోయే రోజుల్లో జిల్లా రాజకీయ ముఖచిత్రమే పూర్తిగా మారబోతుందన్న టాక్ పొలిటికల్ సర్కిల్స్ లో జోరుగా చక్కర్లు కొడుతోందటవిశాఖ మేయర్ పదవి కూటమికి దక్కడంలో మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ కుమార్తె,.6వ జీవీఎంసీ కార్పొరేటర్ లక్ష్మీ ప్రియాంక కీలకపాత్ర పోషించారు. ఆమె వేసిన ఓటుతోనే మేయర్ పీఠం కూటమి ఖాతాలోకి చేరిపోయింది. అప్పటివరకు వైసీపీలో ఉన్న ఆమె..పార్టీకి అండగా నిలబడాలని విప్ కూడా జారీ చేశారు. కానీ సీన్ కట్ చేస్తే?తీరా ఓటింగ్ వచ్చే సమయానికి ఒక్కసారిగా కూటమికి మద్దతుగా నిలిచారు.మ్యాజిక్ ఫిగర్ 74 చేరుకోవడానికి అవంతి కుమార్తె వేసిన ఓటు కూటమికి ఆక్సీజన్ మాదిరిగా మారిందని టాక్ విన్పిస్తోంది. అప్పటివరకు వైసీపీకి అండగా నిలబడాలని విప్ సైతం జారీ చేసిన లక్ష్మి ప్రియాంక.. కూటమికి సపోర్ట్ చేయడంతో అంతా అవాక్కయ్యారట. ఆ తర్వాత వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన ఆమె..ఇంకా కూటమిలో మాత్రం చేరలేదు.ఇక రేపో మాపో కూటమిలో లక్ష్మి ప్రియాంక చేరడం ఖాయమనే టాక్ జిల్లా రాజకీయాల్లో కోడై కూస్తోంది. ఒకవేళ కుమార్తె టీడీపీలో చేరితే.. ఆమె తండ్రి అవంతి శ్రీనివాస్ కూడా కుమార్తె బాటలోనే పయనించి కూటమిలో చేరతారంటూ ఓ వార్త జిల్లా రాజకీయాల్లో చక్కర్లు కొడుతోందట. కూతురి బాటలోనే తండ్రి పయనం అంటూ పొలిటికల్ సర్కిల్స్ లో జోరుగా చర్చ జరుగుతోంది.మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్..గత డిసెంబరులో వైసీపీకి రాజీనామా చేశారు. ఇపుడు ఆయన కూటమి వైపే అడుగులు వేస్తున్నారని అంతా ప్రచారం సాగుతోంది. కుమార్తె కూటమిలోకి అడుగు పెట్టడం ఖాయమని..తండ్రి అవంతి కూడా కుమార్తె బాటలోనే కూటమిలోకి ఎంట్రీ ఉంటుందంటూ విశాఖలో టాక్ నడుస్తోంది. అవంతి శ్రీనివాసరావు తన 15 ఏళ్ళ రాజకీయ జీవితంలో నాలుగు పార్టీలు మారారని అంతా అంటున్నారు.ఆయన ఏ పార్టీకి గాలి ఉంటే ఆ వైపుగా మారే పొద్దు తిరుగుడు పువ్వు లాంటి వారని అంతా అనుకుంటున్నారు. ఆయనను రాజకీయంగా ప్రవేశం కల్పించి ఎమ్మెల్యేని చేసింది ప్రజారాజ్యం పార్టీ అని అంతా గుర్తు చేస్తున్నారంట. ఆ తర్వాత 2014లో ఆయన టీడీపీలో చేరి అనకాపల్లి ఎంపీగా గెలిచారు. తిరిగి అయిదేళ్ళు గడవకుండానే టీడీపీని వీడి 2019 ఎన్నికల సమయంలో వైసీపీలో చేరి మూడేళ్ళ పాటు మంత్రిగా కూడా పనిచేశారు. అంతేకాదు వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగానూ వ్యవహరించారు.కూటమి వైపు అడుగులు వేయాలని చూస్తున్న అవంతిపై జిల్లా రాజకీయాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన రాజకీయంగా ఒక పార్టీలో నిలకడగా ఉండరని..పదే పదే పార్టీలు మారడం ఆయనకు అలవాటే అని సందేహం వ్యక్తం చేస్తున్నాయి. ఆయన రాజకీయ జీవితంలో ఎపుడూ విపక్ష ఎమ్మెల్యేగా లేరని గుర్తు చేస్తున్నారట.వైసీపీ హయాంలో మంత్రిగా, ఎమ్మెల్యేగా ఉన్నపుడు చంద్రబాబు- లోకేష్ పవన్ ల మీద చేసిన కామెంట్స్ ని ఆయా పార్టీల నాయకులు మళ్ళీ గుర్తుచేస్తున్నారంట. అలాంటి వారిని పార్టీలో చేర్చుకోవద్దని పార్టీ పెద్దలను కోరుతున్నారుట. మరి అవంతి శ్రీనివాస్ చివరకు ఏ పార్టీలో చేరతారనేది రాబోయే రోజుల్లో ఓ క్లారిటీ రానుందని తెలుస్తోంది. కుమార్తె చేరిన తర్వాత చేరతారా లేదా ఇద్దరూ ఒకేసారి పార్టీలో చేరతారా అన్నది చూడాల్సి ఉంది. అసలు తండ్రీకూతురు కూటమిలో చేరతారా లేదా అన్నది కూడా సస్పెన్స్ అంటూ కూడా ఓ చర్చ జరుగుతోంది.

## జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాద దాడి అత్యంత హేయమైన చర్య

**ఉగ్రమూకల దాడులను ఖండించిన బద్వేలు నియోజకవర్గ కూటమి నేత మంచూరు సూర్యనారాయణ రెడ్డి**

బద్వేలు,జమ్ముకాశ్మీర్ పహల్గాంలో చోటుచేసుకున్న ఉగ్రవాద దాడి అత్యంత హేయమైన చర్య అని బద్వేలు నియోజకవర్గ కూటమి నేత మంచూరు సూర్యనారాయణ రెడ్డి తీవ్రంగా ఖండించారు.పలు ప్రాంతాల నుంచి వచ్చిన 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు దారుణంగా కాల్చి చంపడం అమానవీయ చర్యగా పేర్కొంటూ,ఈ దుశ్చర్య సంఘటనపైగ్ర్భాంతి, విచారం వ్యక్తం చేశారు. సామాన్యులను,మిలట్రీ అధికారులను, సైన్యాన్ని, పర్యాటకులను ఇలా ఎంతమందిని పొట్టన పెట్టుకుంటారన్నారు. దేశ సమగ్రతను విచ్చిన్నం చేయడానికి కొంతమంది విచ్చిన్నకారులు, ఉగ్రవాదులు ప్రయత్నం చేస్తున్నారని, దేశమంతా ఒక్కటై ఉక్కు పిడికిలితో ఉగ్రవాదాన్ని కూకటివేళ్ళతో పెకిలించాలన్నారు. దాడిని నిర్ద్వంద్వంగా ప్రతి ఒక్కరూ ఖండిచాలని తెలిపారు. అమాయక పౌరులపై, ముఖ్యంగా పర్యాటకులపై దాడి చేయడం భయంకరమైనదని, క్షమించరానిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మృతుల కుటుంబాలకు తమ సంతాపం తెలిపారు.ఈ దాడిలో క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూర్యనారాయణ రెడ్డి కోరారు


## వినాయక స్వామి కుంబాభిషేక మహోత్సవంలో

**బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా ఎమ్మెల్సీ గోవింద్ రెడ్డి**

బద్వేలు,బద్వేలు టౌన్ శ్రీ వాసవి షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణం నందు శ్రీశ్రీశ్రీ కార్యసిద్ధి వినాయక స్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ, శిఖర కలశ ప్రతిష్ఠ కుంభాభిషేక మహోత్సవంలో కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధమ్మ వారితోపాటు మాజీ కూడా చైర్మన్ సింగసాని గురు మోహన్, మున్సిపల్ వైస్ చైర్మన్ సాయి కృష్ణ, మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షులు సుందర్ రామిరెడ్డి, రాష్ట్ర బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శి యద్దారెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు రమేష్ బాబు, జిల్లా డిస్ట్రిక్ట్ సెక్రటరీ తోట నాగేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు కేశవరెడ్డి, చెన్న కృష్ణారెడ్డి, ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి. సుబ్బారావు పార్టీ నాయకులు ఆలయం కమిటీ సభ్యులు, మహిళలు స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువా, పూలమాలలతో వేద పండితులు ఆశీర్వదించి ప్రత్యేక పూజలు నిర్వహించారు

## కోట్లాది భక్తులకు ఆధ్యాత్మిక గురువు భగవాన్ శ్రీ సత్య సాయి బాబా

**-నేడు బాబా వర్ధంతి**



( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

కోట్లాది భక్తులకు ఆయన ఆధ్యాత్మిక గురువు. ఆయన కులాలకు, మతాలకు అతీతంగా నిలిచారు. ఆయన భక్తులలో హిందువులతో పాటు ముస్లింలు, క్రిస్టియన్లు కూడా చాలామంది ఉన్నారు. సత్యసాయి బాబా వారు సత్యనారాయణ రాజుగా 1926 నవంబరు 23న పెద్ద వెంకప్ప రాజు, ఈశ్వరమ్మ దంపతులకి, ఓ నిరుపేద వ్యవసాయ భట్టు రాజుల కుటుంబంలో అనంతపురం జిల్లా లోని, పుట్టపర్తి అనే కుగ్రామంలో జన్మించాడు. బాబాకు నలుగురు సోదరులు, ఇద్దరు సోదరీమణులు. బాబా చిన్న వయసులోనే చాలా అద్భుతాలు చేశాడని చెబుతారు. చిన్న వయసులోనే బాబా అపర మేధావి, సేవాభావం గల వ్యక్తిగా ముద్ర పడ్డారు. అపర మేధావి అయిన బాబాకు నాట్యంలో, సంగీతంలో, రచనలలో మంచి పట్టు ఉంది. బాబా స్వయంగా పాటలు, పద్యాలు రాసి భక్తులను వినిపించాడు. 1940వ సంవత్సరం మార్చి 8వ తేదిన తన సోదరుడు శేషమ రాజుతో కలిసి ఉరవకొండలో ఉన్న సమయంలో బాబాను ఓ తేలు కుట్టిందంట. ఆ సమయంలో బాబా తన స్పృహను కోల్పోయారంట. తేలు కుట్టిన కొద్ది రోజులకు బాబా బిహేవియర్‌లో మార్పు వచ్చింది. తనకు తాను నవ్వుకోవడం, ఏడ్వటం, అప్పటికప్పుడే నిశ్శబ్దంగా మారి పోవడం చేసేవారు. ఆ సమయంలో ఇతను తనకు ఇంతకుముందు ఏ మాత్రం పరిజ్ఞానం లేని సంస్కృతంలో పాటలు పాడేవారు. బాబా పరిస్థితి చూసి వైద్యులు హిస్టేరియా అని నమ్మేవారు. దీంతో చేసేది లేక బాబా తల్లిదండ్రులు బాబాను పుట్టపర్తికి తీసుకు వచ్చారు. వారు బాబాను అనేకమంది వైద్యుల వద్దకు, ఆధ్యాత్మిక గురువుల వద్దకు తీసుకు వెళ్లారు.మే 23 1940లో బాబా చేసిన ఓ చర్య వల్ల బాబా తండ్రి బాబాను ఓ అద్వితీయ మహోన్నతుడుగా భావించాడు. బాబా తండ్రి ఓ కర్ర తీసుకొని నీవెవరు అని అడిగాడు. అప్పుడు బాబా తాను షిరిడీ సాయిబాబా ప్రతిరూపాన్ని అని చెప్పాడు. ఆ తర్వాత బాబా తనకు ఎవరితోనూ సంబంధం లేదని చెప్పారు. తాను షిర్డీ సాయికి ప్రతిరూపం అని చెప్పడం, తనకు ఎవరితోనూ సంబంధాలు లేవని చెప్పడంతో ఆయనకు భక్తులు తయారవడం ప్రారంభం అయింది. పద్నాలుగేళ్లకే బాబా ఆధ్యాత్మిక మార్గం పట్టారు.

## ఉగ్రవాద దాడిలో మృతులకు జనసేన ఆధ్వర్యంలో మూడు రోజులపాటు సంతాప దినాలు

**జనసేన కార్యాలయాలపై పార్టీ జెండా అవనతం**

జమ్ము కాశ్మీర్ లోని బైసరన్ ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి 28 మందిని హతమార్చడాన్ని జనసేన పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ ఈ దుశ్చర్యను ఖండించి, మృతులకు సంతాపం తెలియచేశారు.జనసేన పార్టీ పక్షాన మృతులకు సంతాపం తెలియచేస్తూ మూడు రోజులపాటు సంతాప కార్యక్రమాలు నిర్వహించాలని శ్రీ పవన్ కల్యాణ్ గారు దిశానిర్దేశం చేశారు. బుధవారం ఉదయం అన్ని పార్టీ కార్యాలయాలపై పార్టీ జెండాను అవనతం చేస్తూ సగం వరకూ దించి ఉంచాలని స్పష్టం చేశారు. సాయంత్రం కూడళ్లలో కొవ్వొత్తులు వెలిగించాలని, శుక్రవారం సాయంత్రం రాష్ట్రవ్యాప్తంగా మానవ హారాలు నిర్వహించి ఉగ్రవాద దాడిని ఖండించాలని తెలియచేశారు.

# మట్టిలో మాణిక్యాలు మోడల్ స్కూల్ విద్యార్థులు





.గూడూరు(విజయ సారథి):నేడు విడుదల అయిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో జులకల్ మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటాయని ప్రిన్సిపల్ దిల్షాద్ గారు తెలిపారు. 600 కి 575 మార్కులు జయలక్ష్మి సాధించి స్కూల్ మొదటి స్థానంలో నిలిచిందన్నారు.ఉషారాణి 600 కి 570 మార్కులు, గుణదీప్ సాయి 600 కి 551 మార్కులు తమ విద్యార్థులు సాధించారని ప్రిన్సిపల్ దిల్షాద్ గారు తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను జులకల్ మోడల్ స్కూల్ పాఠశాలలో సన్మానించారు.ఇంతటి ఘన విజయానికి కారణమైన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.×

# శ్రీ సాక్షిగణపతిస్వామికి విశేష అభిషేకం

శ్రీశైలం(విజయ సారథి):లోక కల్యాణం కోసం దేవస్థానం బుధవారం ఉదయం సాక్షిగణపతిస్వామి వారికి విశేష అభిషేకాన్ని నిర్వహించింది.కాగా ప్రతి బుధవారం, సంకటహరచవితిరోజులు మరియు పౌర్ణమిరోజులలో శ్రీసాక్షిగణపతి వారికి ఈ విశేష అభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానం సేవగా (సర్కారి సేవగా) నిర్వహించబడుతున్నాయి.ఈ ఉదయం సాక్షిగణపతిస్వామివారికి పంచామృతాలతోనూ, పలుఫలోదకాలతోనూ, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం నిర్వహించబడింది. తరువాత స్వామివారికి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలు జరిపించబడ్డాయి.వైదిక సంప్రదాయాలలో గణపతి అభిషేకానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఈ గణపతి అభిషేకం వలన అనుకున్న పనులలో ఆటంకాలు తొలగి విజయం లభిస్తుందని చెప్పబడుతోంది. అలాగే కోరిన కోరికలు నెరవేరుతాయని, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలుగుతాయని, ముఖ్యంగా విద్యార్థులలో ఆలోచనా శక్తి పెరిగి విద్య బాగా వస్తుందని చెప్పబడుతోంది.కాగా శ్రీశైలక్షేత్ర పరివార ఆలయాలలో సాక్షిగణపతి ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది.భక్తులు శ్రీశైల మహాక్షేత్రాన్ని సందర్శించినట్లుగా కైలాసంలో పరమేశ్వరుని వద్ద ఈ స్వామి సాక్ష్యం చెబుతాడని ప్రసిద్ధి. అందుకే ఈ స్వామి సాక్షిగణపతిగా పేరొందాడు. చక్కని నల్లరాతితో మలచబడిన ఈ స్వామి ఒకచేతిలో కలం, మరోచేతిలో పుస్తకాన్ని ధరించి భక్తుల పేర్లను నమోదు చేస్తున్నట్లుగా దర్శనమిస్తాడు.

# ఉగ్రవాదుల పిరికిపందల చర్యలను ఖండిస్తున్నాం




కర్నూలు(విజయ సారథి):జనసేన పార్టీ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాలనుసారం ఉమ్మడి కర్నూలు జిల్లా కోఆర్డినేటర్ చింతా సురేష్ బాబు సూచనలతో జమ్మూ కాశ్మీర్ పహల్గామ్, బైసరన్ ఉగ్రవాద దాడిలో బలైన భారతీయులకు వారి కుటుంబాలకు సంతాపాన్ని ప్రకటిస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో గాంధీ విగ్రహం ముందర సంతాపం తెలియజేయడం జరిగినది. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు మాట్లాడుతూ బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ దేశం మొత్తం ఈ రోజున ఐక్యతను స్ఫూర్తిని ముందుకు తీసుకు వెళ్లాల్సిన బాధ్యతను గుర్తు చేసుకుంటూ ఈ మూడు రోజులు సంతాప దినాలుగా జనసేన పార్టీ ప్రకటించందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పివివి సుబ్బయ్య, కటిక షబ్బీర్, రామ్మోహన్, మౌలాలి, నగేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ కస్టడీకి గోరంట్ల మాధవ్

## నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు తరలింపు

గుంటూరు,ఏప్రిల్ 23:వైసీపీ నేత, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ పోలీసుల విచారణ మొదలయ్యింది. పోలీసుల అదుపులో ఉన్న టీడీపీ నేత చేబ్రోలు కిరణ్ పై దాడికి ప్రయత్నించిన ఘటనలో గోరంట్ల మాధవ్ పై కేసు నమోదయ్యింది. ఈ కేసు విచారణలో భాగంగా ఐదు రోజుల పోలీస్ కస్టడీకి ఇవ్వాలంటూ నగరంపాలెం పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రెండు రోజులు పోలీసుల కస్టడీకి కోర్టు అనుమతించింది.

# బ్యాంక్ ఖాతానిలిచిపోయిందా?

నందికొట్కూరు(విజయ సారథి):అల్లూరు గ్రామంలో బుధవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో ,సొసైటీ ఫర్ రూరల్ ఎకో డెవలప్మెంట్ వారి ఆధ్వర్యంలో, అన్ క్లైమేడ్ డిపాజిట్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ భగీరథ, రిసోర్స్ పర్సన్స్ కొమ్ము పాలెం శ్రీనివాస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.




భగీరథ మాట్లాడుతూ ,ఆర్థిక, అక్షరాస్యత స్వయం సహాయక సంఘాలకు, సెక్యూరిటీ నిబంధనలు పొదుపు ఖాతాలపై, కేవైసీ నిబంధనలు, ఆర్థిక ప్రణాళిక మరియు బడ్జెట్ రూపొందించటం, ఆదాయము, ఖర్చులు ,అవసరం ,అనవసరం , ఖర్చు చేస్తున్నవి తెలుసుకోవడానికి, ప్రతిరోజు ఖర్చు పెట్టినవి రాసుకోవడం వల్ల, నెల తర్వాత వాటిని పరిశీలించితే, అనవసరమైన ఖర్చులు ఏంటి, నీకు తెలుస్తాయని తెలిపారు. రిసోర్స్ పర్సన్ కొమ్ము పాలెం శ్రీనివాస్, వెంకటేష్ మాట్లాడుతూ, బ్యాంకు ఖాతా ఉంటుంది, కానీ అందులో డబ్బు జమ చేయడానికి కుదరదు, ఖాతాలో డబ్బు ఉంది, కానీ వెనక్కి తీసుకోవడానికి అంగీకరించరు .ఇలాంటి సంఘటనలు ఇప్పుడు చాలామందికి అనుభవంలోకి వస్తున్నా కారణం ఏళ్ల తరబడి ఆ ఖాతాను ఏ మాత్రం పట్టించుకోకపోవడమే, సాధారణంగా బ్యాంకు ఖాతాల్లో 12 నుంచి 24 నెలలపాటు ఎలాంటి లావాదేవీలు నిర్వహించినప్పుడు, వాటిని నిర్వహణలో లేని ఖాతా లేద నిష్క్రియకాతగా పరిగణిస్తుంటారు .రిజర్వ్ బ్యాంక్ నిబంధనల ప్రకారం, ఖాతాలో నగదు జమ ఏటీఎం నుంచి నగదు తీసుకోవడం ,చెక్కుల ద్వారా జమలు చెల్లింపులు, ఇంటర్నెట్ ఫోన్ ,బ్యాంకింగ్ ద్వారా లావాదేవీలు నిర్వహించడం లాంటివన్నీ ఖాతా లావాదేవీలు కిందికే వస్తాయి. మనదేశంలో బ్యాంకు కార్యాకాలపాలు పర్యవేక్షించి, నియంత్రించే అధికారం, జాతీయ రిజర్వ్ బ్యాంక్ ఉంది. బ్యాంకులో మూల వ్యాపార ,డిపాజిట్లు సేకరించి, రుణాలు ఇవ్వడం ,రిజర్వ్ బ్యాంక్ నిర్దేశాల ప్రకారం కనీసం , గరిష్టంగా పదేళ్లకు మించి డిపాజిట్ ఖాతాలను తెరవకూడదు .బ్యాంకుల్లో పొదుపు, కరెంట్ ఖాతాలు, తెరిచి డబ్బులు దాచుకోవచ్చు, ఎప్పుడైనా డిపాజిట్లను ఉపసరించుకునే అధికారం ఖాతాదారులకు ఉంటుంది. డిపాజిట్ల ఖాతాలో ,ఖాతాదారులు ఎలాంటి లావాదేవులు చేయకపోతే ,ఆ అకౌంట్ లో డబ్బులు బ్యాంకులో ఆర్బిఐ కి బదిలీ చేయాల్సి ఉంటుంది .మీ డబ్బులు తీసుకోవాలంటే, మీ ఖాతా ప్రారంభం కావాలంటే ,తిరిగి కేవైసీ ద్వారా ఆధారాలు తెలపాలి .

# ఉగ్రదాడులతో దేశ సమైక్యతను దెబ్బతీయలేరు

## ఉగ్రదాడులకు ఎన్డీఏ ప్రభుత్వం ధీటైన జవాబిస్తుంది

## పహల్గామ్ ఘటన ఎంతో బాధించిందన్న ఎమ్మెల్యే దగ్గుపాటి

## మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ఎమ్మెల్యే

అనంతపురం(విజయ సారథి):తమ దాడులతో భారతదేశంలో సమైక్యతను దెబ్బతీయాలన్న ఉగ్రవాదుల క్రూరమైన ఆలోచనలు ఇక్కడ చెల్లవని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. జమ్మూ కాశ్మీర్‌లోని బైసారన్ ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి 28 మందిని హతమార్చడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని ఎన్డీఏ ప్రభుత్వం ఉపేక్షించదని వారు కచ్చితంగా తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు. ఈ ఘటనలో అమాయక ప్రజలు చనిపోవడం చాలా బాధ కల్గించిందన్నారు. వారి కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే దగ్గుపాటి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కశ్మీర్‌లో ఇటీవల రికార్డు స్థాయిలో పర్యాటకుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో, శాంతిభద్రతలకు విఘాతం కలిగించి ఆ ప్రాంతాన్ని అస్థిరపరిచే కుట్రలు పన్నుతున్నారని అన్నారు. అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా శాంతి విద్రోహ శక్తులు తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నాయని ఇలాంటి వాటిని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా లు ఉపేక్షించరన్నారు. ఉగ్రవాద శక్తులను కూకటి వేళ్లతో పెకిలించేందుకు భారత ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు..



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో మా ప్రభుత్వం ఎప్పటికీ మద్దతుగా నిలుస్తుందన్నారు. పహల్గామ్ ఘటనలో చనిపోయిన వారి ఆత్మలకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్టు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

# డొల్ల కంపెనీలకు వేలకోట్ల భూ పందేరం

## విశాఖలో 99 పైసలకే ఎకరం ఎలా ఇస్తారు

## తెరపైకి లోకేశ్ బినామీల డొల్ల కంపెనీలు

## భూ పందేరాలపై విచారణ చేయించాలి

## వైఎస్సార్‌సీపీ జాయింట్ సెక్రటరీ కారుమూరు వెంకటరెడ్డి

అమరావతి,ఏప్రిల్ 23:విశాఖలో రూ.3 వేల కోట్ల విలువైన భూములను 99 పైసలకే డొల్ల కంపెనీ ఉర్సా క్లస్టర్స్‌కు కేటాయించడం వెనుక మంత్రి నారా లోకేష్, ఆయన బినామీలే సూత్రధారులని వైఎస్సార్‌సీపీ జాయింట్ సెక్రటరీ కారుమూరు వెంకటరెడ్డి మండిపడ్డారు. తాడేపల్లిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ తన సన్నిహితుడు కిలారు రాజేష్ ద్వారా పెద్ద సంఖ్యలో డొల్ల కంపెనీలను సృష్టించి, వాటికి ప్రభుత్వం ద్వారా కారుచౌకగా విలువైన భూములను కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంపద సృష్టిస్తానని చెబుతున్న చంద్రబాబు ప్రజల సంపదను దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం విలువైన భూములను ప్రైవేటు సంస్థలకు దోచిపెడుతోందన్నారు. ఊరు, పేరు లేని ఉర్సా క్లస్టర్స్ అనే సంస్థకు విశాఖలో అత్యంత ఖరీదైన భూమిని కారుచౌకగా కట్టబెట్టింది. గత వారం రోజులుగా దీనిపై రాష్ట్ర ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ డొల్ల కంపెనీ హైదరాబాద్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో రెండు నెలల కిందటే రిజిస్టర్ అయ్యింది. అటువంటి కంపెనీకి 56 ఎకరాల భూమిని కట్టబెడతారనే దానిపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వ అవినీతిపై ఇంత పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నా, దీనిపై రాష్ట్రంలోని ఒక్క మంత్రి కూడా ధైర్యంగా ప్రజల ముందకు వచ్చి వివరణ ఇవ్వలేదన్నారు. ఇద్దరు డైరెక్టర్లు తప్ప ఒక్క ఉద్యోగి కూడా లేని ఈ కంపెనీకి ఎకరం రూ.50 కోట్ల విలవైన భూములు, అంటే దాదాపు రూ.3 వేల కోట్ల విలువైన భూమిని కేవలం 99 పైసలకే కట్టబెట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఇటువంటి సూట్‌కేస్ కంపెనీలను పెద్ద ఎత్తున రిజిస్టర్ చేయించడం, వాటికి కారుచౌకగా ఖరీదైన భూములను కట్టబెట్టించడం చేయిస్తున్నారు. ఇది ఒక ఆర్గనైజ్డ్ స్కామ్. ప్రభుత్వమే బినామీలను ముందు పెట్టి, ఆస్తులను దోచేస్తోందని ఆరోపించారు. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలోనే టీసీఎస్ ప్రతినిధులతో చర్చలు జరిగాయి. తరువాత కోవిడ్ కారణంగా టీసీఎస్ ఏపీకి రావడం ఆలస్యం అయ్యింది. 2022లో టీసీఎస్‌కు చెందిన చంద్రశేఖరన్ ఏపీకి వచ్చి ప్రభుత్వ అధికారులతో భేటీ అయ్యారు. తరువాత ఎన్నికలు రావడంతో కూటమి ప్రభుత్వం ఏర్పడింది. టీ-సీఎస్‌తో ప్రభుత్వ సంప్రదింపులు కొనసాగాయి. టీ-సీఎస్‌కు విశాఖలో 21.16 ఎకరాల భూమిని కేవలం 99 పైసలకే విక్రయిస్తూ కూటమి ప్రభుత్వం ఈనెల 21వ తేదీన జీవో జారీ చేసింది. ఈ భూముల విలువ వేలకోట్ల రూపాయలు ఉంటుంది. కనీసం వాటి మార్కెట్ విలువపై కొంతశాతం తగ్గించి విక్రయించినా ప్రభుత్వానికి ఆదాయం సమకూరేదని అన్నారు. అలా కాకుండా 99 పైసలకు విక్రయించడం చూస్తే, దేశంలో ఎక్కడైనా ఇలా జరిగిందా అనే అనుమానం కలుగుతోంది. ప్రజాసంపదను ప్రైవేటు- సంస్థలకు ఇచ్చే సమయంలో ప్రోత్సాహకరంగా విధానాలు ఉండాలే తప్ప, పూర్తిగా ఉచితంగా దారాదత్తం చేసేలా ఏ ప్రభుత్వమైనా వ్యవహరిస్తుందా అని ప్రశ్నించారు. ఈ కేటాయింపులను ప్రశ్నిస్తే, పరిశ్రమలను, ఐటీ సంస్థలను అడ్డుకుంటున్నారని మాపైన దుష్ప్రచారం చేస్తున్నారని వెంకట్ రెడ్డి అన్నారు. ఉర్సా ప్రతినిధులు పెందుర్తి విజయ్‌కుమార్, ఆయన కుమారుడు పెందుర్తి కౌశిక్, మరో వ్యక్తి అబ్బూరి సతీష్. వీరు అమెరికాలోని తన సొంత ఇంట్లో ఒక కంపెనీని రిజిస్టర్ చేసుకున్నారు. ఈ కంపెనీని చూపించి ఇటీవల దావోస్‌లో తెలంగాణలో అయిదు వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెడతామంటూ ఎంఓయు చేసుకున్నారు. తరువాత ఏపీలో కూడా ఇదే తరహాలో మరో అయిదు వేల కోట్ల రూపాయల పెట్టుబడులు అంటూ స్కామ్‌ను నడిపించారు. గతంలో ఐఎంజీ భారత్ పేరుతో వేల కోట్ల రూపాయల విలువైన భూములను బిల్లీరావుకు కట్టబెట్టేందుకు చంద్రబాబు ఏరకంగా ప్రయత్నించాడో అందరికీ తెలుసు. ఇప్పుడు లోకేష్ తండ్రిని




మించిన తనయుడిగా ఉర్సా సంస్థను తెరమీదికి తీసుకువచ్చారని ఆరోపించారు. డొల్ల కంపెనీలకు విలువైన భూములను దోచిపెడుతుంటే చూస్తూ ఊరుకోవాలా? వైఎస్సార్‌సీపీ హయాంలో అనేక కంపెనీలను ప్రోత్సహించాం, మీలా ఉచితంగా భూములను ధారాదత్తం చేయలేదన్నారు. . తెలుగుదేశం ప్రభుత్వం దిగిపోయే నాటికి విశాఖలో 161 స్టార్ట్ అప్ ఐటీ- కంపెనీలు ఉంటే, వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో కొత్తగా 425 కంపెనీలు ఏర్పాటయ్యాయి.

# ప్రతీ గురువారము విస్తృత పారిశుద్ధ్య కార్యక్రమం

స్వచ్ఛ ఆంధ్ర సేవా కార్యక్రమములో భాగంగా క్షేత్రంలో విస్తృత పారిశుద్ధ్య చర్యలుపారిశుద్ధ్య కార్యక్రమానికై క్షేత్రపరిధిని 6 జోన్లు మరియు 11 సెక్టార్లుగా విభజనమొత్తం 66 ప్రదేశాలలో ప్రత్యేకంగా పారిశుద్ధ్య కార్యక్రమముశ్రీశైలం(విజయ సారథి):స్వచ్ఛ ఆంధ్ర సేవా కార్యక్రమములో భాగంగా గురువారం క్షేత్ర పరిధిలో విస్తృత పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టబడుతోంది.గతములో వలెనే ప్రతీ గురువారము క్షేత్రపరిధిలో ఈ పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది.ఈ కార్యక్రమానికి ముందుగా గంగాధర మండపం నుంచి నందిగుడి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించబడుతుంది.కాగా పారిశుద్ధ్య నిర్వహణకుగాను క్షేత్రాన్ని 6 జోన్లుగా, 11 సెక్టార్లుగా, 66 ప్రదేశాలుగా విభజించడంపారిశుద్ధ్య కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ప్రతీ జోనుకు కూడా దేవస్థానం యూనిట్ అధికారులను, పర్యవేక్షకులను ప్రత్యేక అధికారులుగా నియమించడం జరిగింది. అదేవిధంగా ఆయా జోన్లలో పలువురు సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించ బడ్డాయి. దాదాపు అన్ని విభాగాల సిబ్బంది కూడా ఈ ప్రత్యేక విధులలో పాల్గొననున్నారు.ఈ కార్యక్రమములో పలు ప్రధాన రహదారులు ఆలయమాడవీధులు, గంగాధరమండపం నుంచి తూర్పువైపున నందిగుడి వరకు గల ప్రదేశం, దక్షిణం వైపున అలంకారేశ్వరాలయం గల ప్రదేశం, దర్శన క్యూకాంప్లెక్సు, విరాళాల సేకరణ కేంద్ర ప్రాంగణం మరియు పరిసరాలు, అన్నప్రసాద వితరణ భవన పరిసరాలు, సి.ఆర్.ఓ కార్యాలయ పరిసరాలు, దేవస్థానం వైద్యశాల పరిసరాలు, గంగాగౌరీపదన్ పరిసరాలు, మల్లికార్జునసదన్ పరిసరాలు, గణేశసదన్ పరిసరాలు, టూరిస్ట్ బస్టాండ్ పరిసరాలు, సెంట్రల్ పార్కింగ్ ప్రదేశం, మల్లమ్మ కన్నీరు పరిసరాలు, పంచమఠాల పరిసరాలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్ర పరిసరాలు, సర్వతోభద్రవన పరిసరాలు, కల్యాణకట్ట పరిసరాలు, పాతాళగంగ పాతమెట్ల మార్గం, ఆర్టీసి బస్టాండు, సిద్ధిరామప్ప వాణిజ్య సముదాయం, పాతాళగంగమెట్లమార్గం, పాతాళగంగ స్నానఘట్టాలు, భ్రమరాంబా అతిథిగృహ పరిసరాలు, సాక్షిగణపతి ఆలయ పరిసరాలు, హాటకేశ్వరాలయ పరిసరాలు, ఫాలధార-పంచధార, శిఖరేశ్వర ఆలయ పరిసరాలు మొదలైన 66 చోట్ల పారిశుద్ధ్య చర్యలు చేపట్టడం జరుగుతోంది.ఈ కార్యక్రమములో దేవస్థానం సిబ్బందితో పాటు పలువురు శివసేవకులు కూడా పాల్గొననున్నారు.

# చేపల జాతరతో గుబాళింపు

## ఏటా జరుపుకునే పండగలో ఐకమత్యం

ఏలూరు,ఏప్రిల్23:పండగలు,జాతరలు అందరినీ కలిసికట్టుగా ఉంచే సంప్రదాయాలుగా చూడాలి. కలిసుంటే కలదు సుఖం అన్న నానుడి తగ్గట్టుగా .... ఏలూరు ఏజెన్సీలో చేపల జాతర జరిగింది. ఏకంగా 10 గ్రామాలు కలిసి చేపల జాతర జరుపుకున్నారు.. ప్రతీ ఇంట్లోనూ చేపల పులుసు గుభాళింపే..! ఏలూరు ఏజెన్సీలో ప్రజలు ఏడాదికి ఒక్కసారి సమిష్టిగా ఊరి చెరువులో చేపల జాతర నిర్వహిస్తుంటారు. వేసవి కాలంలో చెరువులో చేపలు పెట్టడం జాతరలా ఉంటుంది. పెద్ద ఎత్తున తరలివచ్చిన జనం నీళ్లలోకి దిగి, చేపలను పట్టి, వాటిని కుప్పలుగా పోసేవాళ్లు. సమానంగా జరిగే పంపకాలు.. ఇదే సమయంలో వినిపించే చలోక్తులు, సరదాగా సాగే దెప్పిపొడుపులు, అన్యాయం జరిగిందంటూ సాగే అలకలు. చిన్నా, పెద్దా , బాబాయ్, పిన్ని, అత్తా మామ అంటూ వినిపించే పలకరింపులు.. మొత్తం ఒక జాతరలా కనిపిస్తుంది. వచ్చిన చేపలన్నిటినీ అంతా సమానంగా పంచుకుని వండుకుని తింటారు. ఆ గ్రామాల్లో ప్రతి ఇంటా చేపల వంటకాలే..! ఈ ఏడాది కూడా అదే వాతావరణంలో కుక్కునూరు మండలం చీరవల్లిలో చేపలను పెట్టారు.

# ఆలయప్రాంగణములోని వీరభద్రస్వామికి విశేష పూజలు

శ్రీశైలం(విజయ సారథి):లోకకల్యాణం కోసం దేవస్థానం బుధవారం సాయంకాలం ఆలయ ప్రాంగణం లోని వీరభద్రస్వామివారికి (జ్వాలావీరభద్రస్వామివారికి)విశేషపూజలను నిర్వహిస్తో ంది.ఆలయప్రాంగణంలో మల్లికార్జునస్వామివారి ఆలయానికి ఉత్తరభాగంలో మల్లికాగుండానికి ప్రక్కనే ఉన్న వీరభద్రస్వామి జ్వాలామకుటంతో పదిచేతులతో విశిష్టరూపంలో దర్శనమిస్తాడు.శిల్పశాస్త్ర పరిభాషలో ఈ స్వామికి అఘోరవీరభద్రమూర్తి అని పేరు కూడా ఉంది. స్వామివారికి ప్రక్కనే దక్షప్రజాపతి కనిపిస్తాడు. ఈ స్వామిని పరివార ఆలయాలలో భాగంగా ప్రతినిత్యం పూజించడం జరుగుతోంది.కాగా ప్రతి బుధవారం ప్రదోషకాలంలో విశేషఅభిషేకం కార్యక్రమం దేవస్థానం నిర్వహిస్తోంది.ఈ పూజవలన లోకశాంతి, దుర్భిక్షనివారణ, భక్తుల అనుకున్న కోరికలు నెరవేరుతాయి. ముఖ్యంగా క్షేత్ర అభివృద్ధి జరుగుతుంది.కాగా ఈ పూజలలో ముందుగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజను నిర్వహించబడుతుంది.తరువాత వీరభద్రస్వామికి పంచామృతాలతోనూ, పలురకాల ఫలోదకాలతోనూ, గంధోదకం, భస్మోదకం, పుష్పోదకం, బిల్వోదకం, హరిద్రోదకంతోనూ మరియు మల్లికా గుండంలోని శుద్ధజలంతో విశేష అభిషేకం నిర్వహించడం జరుగుతుంది.ఈ అభిషేకాల తరువాత విశేషంగా స్వామివారికి పుష్పార్చనను జరిపించబడుతుంది.

PRINTED, EDITED, PUBLISHED AND OWNED BY P.VENKATESWARLU, PRINTED AT PRAVEEN OFFSET PRINTERS, OLD BUSTAND, KURNOOL-518001 AP, PUBLISHED FROM HO.NO.45/403- 10, BHAGATSING NAGAR, KURNOOL AP, Cell : 9700370499, Email : vijayasarathi2010@gmail.com